ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



కాందీశీక శిబిరనిర్మాణము.

నిజాముద్దీనులో కాందిశీకులకై ఇండ్లు నిర్మించుపనిలో, మట్టిపనిలో పాల్గొంటున్న కులీన యువతులు


కాందిశీకవసతిగృహాల నిర్మాణం






నిజాముద్దీనులో కాందిశీకులఇండ్లు నిర్మించుటకు సాంఘిక పెద్దలైన మహిళలే శ్రీమతి. యం. సాక్సేనా, నాయకత్వంక్రింద స్వయంగా పూనుకొన్నారు. ఆశిబిర శంఖుస్థాపనలో పెద్దలుపనిచేస్తూన్న దృశ్యాలు






కల్యాణీలో కాందిశీక శిబిరాన్ని బొంబై ప్రధాని బి. జి. ఖేర్ సందర్శించినప్పటి దృశ్యం
శిబిరంలో, 80,000 మంది కాందిశీకులు ఐదువరుసల బ్యారక్సులో నివసిస్తున్నారు.


గౌరవనీయులైన మహిళామణుల ముందడుగు



కాశ్మీర్ రణరంగంలో వీరస్వర్గాన్ని పొందిన బ్రిగాడీర్ ఉస్మాన్‌కు ప్రధాని అబ్దుల్లా పుష్పాంజలి



ఇండియాప్రభుత్వ మింట్ మాస్టరుగా (టంకసాలాధిపతి) నియమితులైన శ్రీ జె. పి. మిత్తర్ యఫ్. ఆర్. ఐ. ఓ. గారు



లక్నో ఆలిండియారేడియో స్టేషను డైరక్టరుగా నియమితులైన శ్రీ యస్. యక్. మూర్తిగారు

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


ఇది సేయుమి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 40

సంచిక 44

Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర ఆషాఢ శుద్ధ నవమి బుధవారము



వసంత ఆగమము



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ జూలైనెల 14-వ తేది బుధవారము

సంస్థాన ఏకీకరణ

భారత ప్రభుత్వ సంస్థాన శాఖ ఏర్పరుచబడిన తొలి సంవత్సరముననే సాధించిన మహత్కార్యములు ఏ దేశములోను, ఏ ప్రభుత్వ శాఖయు సాధించి యుండలేదనిన అతిశయోక్తి కానేరదు. గత సంవత్సర మీ కాలమునకు భారత విభజన నిర్ణయమై సంస్థానముల భవిష్యత్తు జటిల సమస్యగా పరిణమించి, భారత శ్రేయోభిలాషులకు ఆవేదనకరముగా నుండెను. అధికారము భారత ప్రజలకు దత్తత చేసిన తరువాత, సంస్థానములపై సార్వభౌమత్వాధికారము తనంతటదే తొలగిపోవునని, అప్పటివరకు బ్రిటిష్ ప్రభుత్వము - భారత సంస్థానముల మధ్య అమలులో నున్న ఒడంబడికలన్నియు రద్దయిపోవునని బ్రిటిష్ ప్రభుత్వము ప్రకటించుటతో దేశములోని 560 పైచిలుకు సంస్థానములు స్వతంత్ర రాజ్యము లగుటకు హక్కు లభించినది. భారతదేశము రెండుగా గాక, కొన్ని వందల దేశములుగా విభక్తమైపోయి మన స్వాతంత్ర్యము భగ్నమై పోవునని కొంద రాశించిరి; మరి కొందరు భయపడిరి. ఏ కొద్ది విషయములలో అధికారమును కూడ భారత ప్రభుత్వమునకు దత్తత చేయుటకు సంస్థానములు అంగీకరించవని చాలమంది భావించిరి. అధికార దత్తత ఒడంబడిక ముసాయిదా తయారు చేయుట అనవసరశ్రమ యని హేళన చేసిరి. సంవత్సరకాలము తిరిగివచ్చునాటికి ఆ విమర్శకులు తమ తప్పిదములను గ్రహించుకొనక తప్పలేదు. దేశములోని 584 సంస్థానములలో హైదరాబాద్ ఒక్కటి తప్ప తక్కిన వన్నియు భారతప్రభుత్వములో జేరి అధికారమును దత్తత చేసినవి. అంతేకాదు, చిన్న చిన్న సంస్థానములు సంశ్లిష్ట భారత రాష్ట్రములతో కలసిపోవుటో, ఇతర చిన్నచిన్న సంస్థానములతో కలిసి కూటములుగా ఏర్పడుటో జరిగినది. ఈ విధముగా మొత్తము 535 సంస్థానములు తమ ప్రత్యేక అస్తిత్వమును ఐచ్ఛికముగా త్యజించి దేశఐక్యమునకు తోడ్పడినవి. పరిపాలనాసౌష్ఠవము, సర్వతోముఖ అభివృద్ధికి అవకాశము, ఆర్థికదక్షత, స్వయంపోషకశక్తి గల సంస్థాన కూటములు ఏర్పడి, దేశము బలిష్ఠము, సుసంఘటితము నైనది. భారతదేశము నుండి కొంతభాగము విడిపోయినను, తక్కిన భాగము చరిత్రలో ఇదివరకెన్నడు లేనట్టి ఐక్యమును సాధింపగల్గినది. చంద్రగుప్తుడు, అశోకుడు, అక్బరు మొదలగు చక్రవర్తులుకూడ సాధింపలేని ఐక్యము, మన కండ్ల ఎదుటనే, ఒక సంవత్సర కాలములోనే సాధింపబడెను. ఈ శాంతియుత, ఐచ్ఛిక, రక్తరహిత విప్లవమునకు వేరొకటి సాటి లేదు.

భారత సంస్థాన ఏకీకరణ గారడివాని చేయూపుతో జరిగిన ఇంద్రజాలము కాదు; చిరకాలమునుండి పనిచేయుచున్న చారిత్రకశక్తుల పరిణామ ఫలితము. ఆంగ్లేయులు భారతప్రజలను కృత్రిమముగా 'బ్రిటిష్ ప్రజలు' 'సంస్థాన ప్రజలు' అని విభజించిరి. శతాబ్దముల పర్యంతము అమలులో నున్నను ఇట్టి కృత్రిమవిభజన, అనాదిసిద్ధముగా నున్న సాంస్కృతిక, భాషా, జాతీయత సహజ ఐక్యమును రూపుమాపజాలదు. 'బ్రిటిష్ ప్రజల' లో వ్యాపించిన స్వాతంత్ర్య కాంక్ష, బాధ్యతాయుత ప్రజాప్రభుత్వవాంఛ, 'సంస్థాన ప్రజల'పై తమ ప్రభావమును ప్రసరింపజేసెను. విదేశస్థులగు ఆంగ్లేయులే ప్రజాభీష్టమునకు దాసోహ మనవలసినప్పుడు వారి నాశ్రయించుకుని వున్న సంస్థానాధీశ్వరులు వేరేమి చేయగలరు? అటు 'బ్రిటిష్ భారతదేశము' లోను, ఇటు 'సంస్థాన భారతదేశము' లోను అధికారము ప్రజాపర మైనప్పుడు ఇన్నాళ్లనుండి అణచివేయబడియున్న సహజ ఐక్యము పైకుబికికొని వచ్చుట, కృత్రిమ విభజన తొలగిపోయి విశాల భారతదేశ మేర్పడుట సహజమే కదా!

భారత యూనియన్‌లో జేరిన రాష్ట్రములు, మొదట్లో రక్షణ, రాకపోకలు, విదేశ వ్యవహారములపైననే అధికారమును భారత ప్రభుత్వమునకు దఖలుపరచినవి. తరువాత ప్రారంభమైన ఏకీకరణ కార్యక్రమములో, సంశ్లిష్ట రాష్ట్రములతో కలసిపోయిన సంస్థానములు, భారతరాష్ట్ర భాగములే అయినవి. రాష్ట్రప్రభుత్వములపై కేంద్ర ప్రభుత్వమునకు ఎట్టి అధికారముండునో వీనిపైనను అట్టి అధికారమే యుండును. కూటములుగా ఏర్పడిన సంస్థానములుకూడ, మరొక దఖలుపత్రము నామోదించి, కొన్ని చిన్న విషయముల మినహా, దాదాపు రాష్ట్రప్రభుత్వముల స్థాయికి వచ్చినవి. రాష్ట్రములలోను, సంస్థాన కూటములలోను జేరని పెద్ద సంస్థానములపై భారత ప్రభుత్వమున కిప్పటికిని పరిమితాధికారమే యున్నది. ఇది తొలగించి, వానినికూడ భారత రాష్ట్రముల స్థాయికి తెచ్చినచో, దేశమున కంతకు కేంద్ర ప్రభుత్వాధికారము ఒకేవిధముగ వర్తించి, పరిపాలన సుకరమగును. లేనిచో కేంద్రప్రభుత్వ శాసనములు కొన్ని, రాష్ట్రములకు, సంస్థాన కూటములకు మాత్రమే వర్తించి, ఇతర సంస్థానములకు వర్తించకుండపోవును. ఈ అసహజత్వమును గించుటకు సంస్థాన శాఖ ఇప్పుడు పూనుకొనవలసియున్నది.

సంస్థాన ఏకీకరణ విజయమును సాధించిన సంస్థాన శాఖామాత్యుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ మహత్తర కార్యసాధకుడుగా భారత చరిత్రలో చిరకాలము స్మరింపబడగలడు. చరిత్రకందని అనాదికాలమునుండి కూడ భారత చక్రవర్తుల కాదర్శ లక్ష్యమై, మృగతృష్ణవలె వారి నూరించి, ఉద్దీపితుల నొనరించిన విశాలభారత ఐక్యమును ఒక్క సంవత్సర కాలములోనే ఐచ్ఛిక, అహింసాయుత మార్గముల ద్వారా ఆయన సాధించి, చరిత్రలో ఒక విశిష్ట స్థానమును సంపాదించుకొన్నాడు. భారత ప్రజానీకము, ముందు తరములవారు కూడ ఆయనకు ఋణపడినారు.

సంస్థానములపై సార్వభౌమత్వాధికారమును బ్రిటిష్ ప్రభుత్వము రద్దుచేయుట అప్పుడొక కీడుగా కనిపించెను. కీడులోనే మే లున్నది; వానికి అవినాభావసంబంధ మున్నది. సార్వభౌమత్వాధికారము భారత ప్రభుత్వమునకు సంక్రమించియుండిన యెడల, ఇదివరకటి ఒడంబడికలను భగ్నము చేయకుండ, సంస్థానముల ఏకీకరణ జరుగుటకు వీ లుండెడిది కాదు. ఆలోచించినచో, బ్రిటన్ సార్వభౌమత్వాధికారమును వదలుకొనుట, ఎట్టి ఉద్దేశ్యములతో జరిగినను, మనకు మంచిగానే పరిణమించిన దని తెలియగలదు.

స్టర్లింగు నిలువల ఒడంబడిక

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో మన రిజర్వుబ్యాంకు పేర పెరిగివున్న స్టర్లింగు నిలువలను ఉపయోగించుకొను విధానమును గురించి బ్రిటిష్ ప్రభుత్వముతో భారత ప్రతినిధులు గత రెండు మాసములుగ చర్చలు జరుపుచుండిరి. స్టర్లింగు నిలువల విషయమై శాశ్వత ఒడంబడిక కుదుర్చుకొనుటకే ఇంతకాలము సంప్రదింపులు జరిపిరి. బ్రిటన్ ఆర్థిక పరిస్థితి ఇంకను అసంతృప్తికరముగానే యున్నది. కాబట్టి మూడేండ్లకాలము వరకు అమలులో నుండు ఒడంబడిక నేర్పాటు చేసికొందమని బ్రిటిష్‌ప్రభుత్వము సూచింపగా, భారత ప్రతినిధులు కాదనలేకపోయిరి.

భారతదేశపు స్టర్లింగు నిలువలు దాదాపు ఒక వంద కోట్ల పౌను లుండును. అందులో కొంత మొత్తము ఇప్పటికే వాడివేయబడెను. రానున్న మూడు సంవత్సరములలో భారత దేశమునకు 16 కోట్ల స్టర్లింగు, ఒకటిన్నర కోట్ల డాలర్లు విడుదల చేయుటకు ఇప్పుడు బ్రిటన్ అంగీకరించినది. గత రెండు పర్యాయములు, ఆరు నెలల కాలపరిమితికి విడుదల చేయబడిన మొత్తములతో పోల్చి చూచిన ఈ మొత్తము తక్కువగానే యున్నది.

ఇదివరకు భారత ప్రభుత్వ కొలువులో వుండి ఫించను పుచ్చుకున్న బ్రిటిష్ పౌరులకు జీవితాంతము వరకు పింఛన్లు ఇచ్చుటకు ప్రత్యేకింప వలసిన స్టర్లింగు మొత్తము సంతృప్తికరముగ నిర్ణయమైనది. యుద్ధకాలములో బ్రిటన్ భారతదేశములో నిలువ చేసిన యుద్ధసామగ్రి, స్థాపించిన కర్మాగారములు మొదలగు వానిని భారత ప్రభుత్వము వశపరచుకొన్నది. వానికిగాను యివ్వవలసిన స్టర్లింగు మొత్తముకూడ సంతృప్తికరముగ నిర్ణయమైనది. భారతదేశమునకు కావలసిన యంత్రసామగ్రిని బ్రిటిష్ కర్మాగారములనుండి త్వరత్వరగా సరఫరాచేయుటకు బ్రిటన్ అంగీకరించినది.

మన ఆహార దిగుమతులు తగ్గుచున్నవి; దిగుమతి యగుచున్న మొత్తములో అధికభాగము ఇదివరకువలె అమెరికానుండిగాక ఆస్ట్రేలియానుండి దిగుమతి యగుచున్నది. కాబట్టి ఇప్పటి ఒడంబడిక ప్రకారము లభించెడి ఒకటిన్నరకోట్లు డాలర్లు కేవలము యంత్రసామగ్రి దిగుమతికే వినియోగించుకొనవచ్చును. స్విట్జర్లండు, స్వీడన్, చెకోస్లవేకియా మొదలగు యూరప్ రాజ్యముల ద్రవ్యమానమును ధారాళముగా సరఫరా చేయుటకు బ్రిటన్ అంగీకరించినది. ఈ దేశములలో మనకు కావలసిన యంత్రసామగ్రి విరివిగా లభించునని తెలియవచ్చుచున్నది. ఈ విషయమై భారత ప్రభుత్వము శ్రద్ధ వహింపవలెను.

ఇప్పుడు జరిగిన స్టర్లింగు ఒడంబడిక స్థూలదృష్ట్యా అసంతృప్తికరముగా కనిపించినను, విడుదలచేయబడిన సొమ్ము పొదుపుగా వాడుకొనినచో, మన అవసరములకు సరిపోవును.

నేటిప్రపంచం:

పాలస్తీనా పరిష్కారానికి రక్తపాతమే మార్గమా?

మధ్యవర్తి బెర్నాడోట్ మంతనాల వైఫల్యం



మారిషస్‌లో ప్రథమ భారతీయ హైకమీ షనర్‌గా నియమింపబడిన

ధర్మయాష్ దేవ్

అనుకున్నంతా జరిగింది. పాలస్తీనాలో తిరిగి పెద్దపెట్టున బ్రహ్మాండమైన యుద్ధం ప్రారంభమైంది. అరబ్ యూదు సలహా దార్లతో సంప్రతించి, మధ్యవర్తి కౌంట్ బెర్నాడోట్ చేసిన పరిష్కార ప్రతిపాదనలను ఉభయపక్షాలు తిరస్కరించడంతో, మొదట సూచించిన నాల్గు వారాల యుద్ధవిరమణగడువూ, మొన్న జూలై 9-వ తేదీన పూర్తికాగానే, "పవిత్రభూమి" పాలస్తీనాను తిరిగి ప్రచండ యుద్ధజ్వాలలు ఆవరించినవి. ఇక ఈ యుద్ధజ్వాలలు ఆరే దెప్పుడో చెప్పలేము. మధ్యవర్తి బెర్నాడోట్ యూదురాజధాని టెల్ అవీవ్, కైరో, డెమాస్కస్, అమ్మాన్ నగరాల మధ్య గత మూడు నాల్గు వారాలగా ఎన్నిసార్లు వాయువేగంతో తిరిగాడో, ఎన్నెన్ని గంటలసేపు యూదుఅరబ్ ప్రముఖులతో సంప్రతింపులు జరిపాడో సరిగా లెక్క కట్టలేము. ఎంత తిరిగినా, ఏమి చెప్పినా యుద్ధవిరమణగడువును మరికొన్ని రోజులపాటు పొడిగించడానికి ఆయన చేసిన ప్రయత్నం విఫలమైంది. పాలస్తీనాను యూదుఅరబ్ స్వతంత్ర రాజ్యాలుగా విభజించి ఆ రెంటినీ ఒక ఫెడరల్ సమాఖ్యకిందికి తీసుకొని రావడం ఒక్కటే పరిష్కార మార్గమని కౌంట్ బెర్నాడోట్ చేసిన ప్రతిపాదనను ఇటు యూదులు, అటు అరబ్బులుకూడ నిస్సంకోచంగా నిరాకరించారు. గత నవంబరు 29వ తేదీన ఐక్యరాజ్యసమితి చేసిన విభజన పథకం ఒక్కటే పాలస్తీనా పరిష్కారానికి మార్గమని యూదుల వాదన. కౌంట్ బెర్నాడోట్ ప్రతిపాదనలకు యూదు విదేశ మంత్రి మాషీషెర్టాక్ మొన్న అందజేసిన సమాధానం సరిగా ఇదే విషయాన్ని స్పష్టపరిచింది. పాలస్తీనాలో ఏ కొంత భూభాగానికైనా యూదురాజ్యమని పేరు పెట్టి పిలిచినంత కాలం ఈ సమస్య పరిష్కారం కావడం గాని, తాము అట్టి ప్రతిపాదనకు దేనికీ అంగీకరించడంగాని అసంభవమని అరబ్బుల వాదన. ఈ పరస్పర విరుద్ధ దృక్పథాలను రెంటిని సమన్వయపరచి సమస్యను పరిష్కరించడం ఎవరి తర మవుతుంది? మరెవరి తరమైనా అవుతుందో లేదో చెప్పలేము. కాని, మధ్యవర్తి బెర్నాడోట్‌కు మాత్రం ఇది తలకు మించిన పని అని తేలిపోయింది.

ఆ మాటకు వచ్చేట్లయితే, ఈ నాల్గు వారాల యుద్ధవిరమణ వాస్తవానికి యుద్ధవిరమణే కాదని కూడా చెప్పవలసివస్తుంది. యుద్ధవిరమణ పరిస్థితులను బట్టిచూస్తే గడువు పూర్తిగాకముందే ఉభయపక్షాలమధ్యా తిరిగి భయంకర సంఘర్షణ ప్రారంభం కావచ్చునని తోచిన మాట వాస్తవం. యుద్ధవిరమణ నియమాన్ని యూదులు ఉల్లంఘించారని అరబ్బులు, అరబ్బులే ఉల్లంఘించారని యూదులూ ఒకరిమీద ఒకరు తీవ్రఆరోపణలు చేసుకోవడం జరిగింది. యుద్ధవిరమణ పరిశీలకుల ఆధ్వర్యంకింద యూదు ప్రజలసహాయార్థం వస్తున్న ఆహార పదార్థాల కాన్వాయ్‌దళంపై అరబ్బులు ప్రత్యక్షంగా కాల్పులు జరిపి దెబ్బతీసిన సంగతీ, ఐక్యరాజ్యసమితి మధ్యవర్తుల విమానంపైనే ఈజిప్షన్ విమానం ఫిరంగికాల్పులు సాగించిన సంగతి, తర్వాత ఆ దాడి పొరపాటున జరిగిందని ఈజిప్టు క్షమాపణ చెప్పుకున్న సంగతీ పాఠకులకు జ్ఞాపకం వుండేవుంటుంది. మే 15 వ తేదీన బ్రిటిష్‌వారు పాలస్తీనాలో తమ మాండేటరీ ఆధిపత్యాన్ని త్యజించిన మరుక్షణంనుంచీ తమ సంఖ్యాబలాన్ని, ఆయుధబలాన్ని చూసుకొని అరబ్బులు తూర్పు ఉత్తర, దక్షిణదిశలనుంచి ఒక్కుమ్మడిగా దండయాత్ర ప్రారంభించి ఆక్రమణ ప్రారంభించారు. తగిన సంఖ్యాబలం లేకపోయినప్పటికీ యూదులుకూడా హోరాహోరిగా పోరాడినప్పటికీ, యుద్ధవిరమణ గడువు ప్రారంభించేనాటికే అరబ్ రాజ్యాలదే పై చెయ్యిగా వున్నమాట నిజం. యూదు రాజధాని టెల్ అవీవ్‌కు కనుచూపు మేరలోకి సైతం చేరగలిగారు. ఒకటి రెండు రోజులలో యూదు రాజధాని పతన మవుతుందని కూడా అనుమాన పడకపోలేదు. ఇంతలో గుడ్డిలో మెల్లగా యుద్ధవిరమణ అమలు జరిగింది. ఈ నాల్గు వారాల వ్యవధిలో అరబ్బులు తమ స్థావరాలను బలపరుచుకోవడమే కాకుండా, గడువు పూర్తికాగానే తిరిగి యుద్ధం తప్పదనే నమ్మకంతో ప్రబల సన్నాహాలుసైతం చేసుకున్నారు. ఐక్యరాజ్య సమితితరఫున మధ్యవర్తిగా వచ్చిన బెర్నాడోట్ యూదుపక్షపాతి అని కూడా అరబ్ పత్రికలు, ప్రముఖులు ఆరోపణలు సైతం చేశారు.

చివరకు విజయం తమదేనని, దారుణ రక్తపాతం ద్వారా యూదులను లొంగదీయగలమనే ధైర్యంతో అరబ్బులు గత శుక్రవారంనుంచీ యుద్ధకాండకు ఉపక్రమించారు. యూదులు అసమాన ధైర్యసాహసాలతో ప్రతిఘటన సాగిస్తూ శక్త్యానుసారం ఆత్మరక్షణచేసుకుంటూ విజయాలను సాధిస్తున్నారు. ప్రస్తుతం పాలస్తీనా ఉత్తరదక్షిణ రంగాలలో భయంకర యుద్ధం సాగుతున్నది. ఉభయపక్షాలవారూ విజయ పరంపరలను ప్రకటించుకుంటున్నారు.

పాలస్తీనా అంతటిలో అతి ప్రధానమైనదీ, పెద్దదీ అని చెప్పుకొనే లిడ్డా విమానాశ్రయం యూదులవశమైనట్లు యూదుఅధికార ప్రకటన తెలియజేస్తున్నది. ఈశాన్యపాలస్తీనాలో సిరియా సరిహద్దున హూలా సరస్సువద్ద జరిగిన బ్రహ్మాండమైన యుద్ధంలో విజయం మాదంటే మాదని ఉభయపక్షాలవారూ ప్రకటించుకుంటున్నారు. పాలస్తీనా ఉత్తరాగ్రానవున్న మిస్మార్ హాయార్డెన్ అనేచోట దాదాపు 500 మంది యూదులను పూర్తిగా హతమార్చి వేశామని డెమాస్కస్‌లోని అరబ్ వర్గాలు హడావిడి చేస్తున్నవి. సిరియన్ సేనల ఎదురుదాడిని తరిమివేసి ఉత్తర రంగయుద్ధాన్ని క్రమపద్ధతిలో నిర్వహిస్తున్నామని యూదుప్రకటన. టెల్ అవీవ్ జెరూసెలం నగరాలమధ్య అనేకస్థలాలను తాము తిరిగి ఆక్రమించి అరబ్ సైనికులను తరిమి వేశామని కూడా యూదు ప్రభుత్వం అంటున్నది. ఏది ఏమైనప్పటికీ లిడ్డావిమానాశ్రయాన్ని కోల్పోవడం అరబ్బులకు పెద్ద పరాజయమేనని అంగీకరించవలసివుంటుంది. యుద్ధవిరమణ ప్రారంభంలోనే అరబ్బులు ఈ విమానాశ్రయాన్ని బాగా బలపరుచుకొన్నారు.

యుద్ధవిరమణ గడువు సమాప్తం కాబోతున్న దనగానే, మరొక పదిరోజులపాటు వ్యవధి ఇవ్వవలసిందనీ, తాను రోడ్స్‌దీవి సంప్రతింపుల ఫలితంగా చేసిన ప్రతిపాదనలు అంతిమ ప్రతిపాదనలు కావనీ, వాటిని కేవలం ప్రాతిపదికగా మాత్రమే ఎంచవలసిందనీ తిరిగి ఉభయపక్షాలకూ విజ్ఞప్తిచేసిన మధ్యవర్తి బెర్నాడోట్ ఉభయపక్షాలనుంచీ సమాధానాలువచ్చి రాకముందే లేక్ సక్సెస్‌కు ప్రయాణమై వెళ్ళాడు. యుద్ధవిరమణ గడువుకు ఏమాత్రం ఒప్పుకున్నా పాలస్తీనాలో తమ పరిస్థితికి అది ప్రమాదకరమని భావించిన అరబ్బులు బెర్నాడోట్ క్రొత్త సూచనను అంగీకరించలేదు. అరబ్ లీగ్ తరఫున ఈ విషయాన్ని సమితికార్యదర్శి ట్రిగ్వీలీకి అజ్జాంపాషా తెలియజేశాడు. లేక్ సక్సెస్‌లో భద్రతామండలి జరుపుతున్న అత్యవసర సమావేశానికి పాలస్తీనా ప్రస్తుత పరిస్థితిని, తాను చేసిన రాజీప్రయత్నాలను బెర్నాడోట్ సవివరంగా నివేదించడం జరుగుతుంది.

పాలస్తీనా అంతా ఒకే ఒక సర్వస్వతంత్ర ప్రజాస్వామ్యరాజ్యంగా వుండాలనీ, ప్రత్యేక యూదురాజ్య స్థాపనకు-అది ఏ స్వరూపంలో జరిగినా సమ్మతించేది లేదనీ, అల్పసంఖ్యాకులకు తగిన రక్షణలు ఇస్తూ రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగాన్ని ఏర్పాటుచేస్తుందనీ, శాసనసభలో అల్పసంఖ్యాకులకు సంఖ్యాబలానుగుణమైన ప్రాతినిధ్యం మాత్రమే లభ్యమౌతుందనీ అరబ్ లీగ్ కౌంట్ బెర్నాడోట్ పరిష్కార ప్రతిపాదనలకు ఎదురు ప్రతిపాదనలు చేసింది. ఏది ఏమైనప్పటికీ, తమ రాజ్యం తమకు ఏర్పడవలసిందేననీ, సమితి చేసిన విభజనపథకాచరణతప్ప గత్యంతరం లేదనీ, దాన్ని మార్చబూనుకోవడం తమను వంచనచేయడమే అవుతుందనీ వాదిస్తున్న యూదులకూ, పాలస్తీనా అంతా ఒకే రాజ్యమంటున్న అరబ్బులకూ సామ్యపద్ధతిలో రాజీ కుదరడం కల్ల. ఈ పరిస్థితులలో ప్రస్తుతం సమావేశ మవుతున్న భద్రతామండలి ఈ క్లిష్ట సమస్యా పరిష్కారానికి ఏ మార్గాన్ని సూచించగల దన్నది దురూహ్యం. బ్రిటన్ ఈ క్లిష్టసమయంలో ఏదైనా స్థిరవిధానాన్ని అనుసరిస్తుందా లేదా అన్న అంశంపైనే పాలస్తీనాభవిష్యత్తు అంతా ఆధారపడి వున్నది.

పాలస్తీనా గొడవ ఈ విధంగా వుంటే జర్మనురాజధాని బర్లిన్‌లో అగ్రరాజ్యాల మధ్య ఏర్పడిన రగడ అంతకంతకు కృతిమించి రాగానపడుతున్నది. బర్లిన్ నగరానికీ, పశ్చిమ జర్మనీకీ మధ్య వున్న రాకపోక సౌకర్యాలన్నిటినీ బంధుచేసి నవరంధ్రాలనూ బిగించి, 'ఇక ఏమి చేస్తారోచేయండి అని రష్యను లు పశ్చిమ మిత్ర రాజ్యాలైన బ్రిటన్, ఫ్రాన్సు అమెరికాలను సాదలకొడుతున్నారు. అన్ని దిక్కుల నుంచీ రవాణాలు రాకుండా చేసి, ప్రధానమైన జీవితావసరపదార్థాలే లేకుండా చేస్తే పశ్చిమ బర్లిన్‌ను ఆక్రమించిన బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు ఖాళీచేయక ఏమి చేస్తవని రష్యనుల ధీమా. రష్యా అనుసరించిన ఈ అమానుష చర్యఫలితంగా పశ్చిమ బర్లిన్‌లోని మూడు ఆక్రమిత భాగాలలోను వున్న దాదాపు 25 లక్షలమంది ప్రజలు, బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి అధికారులు కాలూ చెయ్యీ ఆడక ఉక్కిరిబిక్కిరవుతున్నమాట వాస్తవం. రోజుకు కొన్నివందల విమానాల చొప్పున ఉపయోగించి పశ్చిమమిత్రరాజ్యాలు తమ బర్లిన్ భాగాలకు అతిప్రధానమైన సామగ్రిని చేరవేసుకొంటున్న మాట నిజమే. కాని అక్కడ వున్న లక్షలాది ప్రజలకు ఎంతకాలమని విమానాలలో సామగ్రి అంతా చేరవేయడానికి వీలవుతుంది? పశ్చిమ జర్మనీని చీలదీసి ప్రత్యేక రాజ్యంగా ఏర్పాటు చేయడానికి బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులు వేసిన పథకాలకు ప్రతిగానే రష్యనులు ఈ పన్నాగం పన్ని నాటకం ఆడుతున్నారు.

అగ్రరాజ్యాలమధ్య సాగుతున్న ఈ ప్రచ్ఛన్న సంఘర్షణ పర్యవసానంగా ఎక్కడికి దారి తీస్తుందోననే భయంతో నేడు ప్రపంచప్రజలందరూ బర్లిన్ నగర క్లిష్టపరిస్థితిని అతి శ్రద్ధాళువులై పరికిస్తున్నారు. తూర్పు పశ్చిమ జర్మనీలలో ఆయా రాజ్యాలు రెండు ప్రత్యేక ద్రవ్యచలామణీవిధానాలను ప్రవేశపెట్టడంతో బర్లిన్‌నగర క్లిష్టపరిస్థితి మరింత అధ్వాన్నంగా పరిణమించింది.

బర్లిన్‌నగరంపై రష్యా దిగ్బంధనను ప్రయోగించడం ఇదివరలో తాము చేసుకున్న అంతర్జాతీయ ఒడంబడికకు పూర్తిగా విరుద్ధమనీ, తమలో తమకు ఏవైనా అభిప్రాయ భేదాలు ఏర్పడినట్లయితే, వాటిని ఐక్యరాజ్యసమితి ప్రణాళికను అనుసరించి సంప్రతింపుల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలిగాని ఇట్టి దుస్సహవిధానంద్వారా బర్లిన్ ప్రజలను నానావస్థలకూ పాల్పడచేయడం దారుణమనీ బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సుదేశ ప్రభుత్వాలు మొన్న 6 వ తేదీన తమ తమ రాజధానులలో వున్న రష్యన్ రాయబారులకు ఏక కాలంలో తీవ్రమైన ఆక్షేపణపత్రాలను అంద

(21 వ పేజీ చూడుడు)



భారతదేశానికి వచ్చిన, జెక్ టెక్నికల్ మిషన్. వీరి నాయకుడు యం. రూబెస్కార్, బొంబాయి ప్రధాని బి. జి. ఖేర్‌తో బొంబాయి పారిశ్రామిక స్థితిని ఉగ్గడిస్తూ సంభాషిస్తూన్నారు,



౨౪

౨

ఉదయానికి కొద్దిగా జ్వరం హెచ్చింది. కొంచెం సంధిలక్షణాలుకూడా కనిపించాయి మొదట పావెల్ పెట్రోవిచ్ అర్థంలేని మాటలేవో గొణిగాడు. తరవాత చటుకుని కళ్లు తెరిచాడు. మంచంపక్కని తన తమ్ముణ్ణి చూచాక, అతను గిన ఆదుర్దాగా మంచంమీద వంగి అన్నగారిని చూస్తున్నాడు. తమ్ముడిని అడిగాడు, "నికొలై, ఫెనీచ్కాకి నెల్లీకి కొంత ఏదో సామ్యం ఉందని నీకు తోచలేదూ?"

"నెల్లీ ఎవరు పావెల్?"

"ఎవరని అడుగుతావేం? ర—రాజకుమారి. ముఖ్యంగా ముఖంపైభాగంలో. ఒక కుటుంబంలో నించి వచ్చినట్టుగా."

నికొలై సమాధానం చెప్పలేదు. మనిషిలో పాతకాలపు ఉద్వేగాలూ, అనుబంధాలూ ఎంత గాఢంగా అంటిపెట్టుకుంటాయో నని మాత్రం వింతగా అనుకున్నాడు. "అవి పైకి ఉబికి నవ్వుకు ఇల్లా వస్తుందిగావును," అనుకున్నాడు.

"ఆహా! ఆ చిలిపిబుర్ర అంటే నాకు ఎంతో ఇష్టం," పావెల్ పెట్రోవిచ్ మూలుగుతూ అన్నాడు. విషాదంగా తలక్రింద తన చేతులు ముడుచుకున్నాడు. "ఎవడన్నా నవమంత్రపు పొగరుబోతు ముట్టుకుంటే నేను సహించలేను...," తరవాత కొద్దినిముషాలకి తనలో తను అనుకున్నాడు.

నికొలై పెట్రోవిచ్ ఊరికే నిట్టూర్చాడు. ఎవరినిగురించి ఈ మాటలు అన్నాడో అతనికి అనుమానమయినా కలగలేదు.

మరునాడు ఎనిమిదిగంటలకు బజరోవ్ అతన్ని చూడ్డానికి వచ్చాడు. ఈలోగా అతను తనకప్పలనీ, పురుగులనీ, పక్షులనీ వదిలివేసి తన సామాను సర్దుకున్నాడు.

"నాదగ్గర శెలవు తీసుకోడానికి వచ్చారా?" నికొలై పెట్రోవిచ్ కూర్చున్న చోటినించి లేస్తూ అన్నాడు.

"అవును."

"మీ పరిస్థితి నాకు పూర్తిగా అర్థమయింది. మీవనరలో నాకు లోపం ఏమీ కనిపించలేదు. పాపం, మా అన్నయ్య—తప్పంతా అతనిదే. దానికి శిక్ష అతను అనుభవిస్తున్నాడు. మిమ్మల్ని తప్పించుకోడానికి వీలులేకుండా చేసినది తనే అని నాతో చెప్పాడు. ఈ యుద్ధంలో మీరు పాల్గొనక తప్పింది కాదనుకుంటాను....అసలు మీ ఇద్దరిమధ్యా నిరంతరం ఉన్న తీవ్రమయిన అభిప్రాయభేదాలను బట్టి చూస్తే కొంతవరకు ఈ ఘర్షణ అర్థమవుతుంది." (నికొలై పెట్రోవిచ్ కొంచెం తడబడుతూ మాటలు తోచక తడుముకున్నాడు.) "అన్నయ్య పాతకాలపు వాడు, కోపం ఎక్కువ, తిక్కమనిషి.....భగవంతుడి దయవల్ల ఈమాత్రంతో ఇది ముగిసింది. ఇది బయటికి పొక్కకుండా తగిన జాగ్రత్త తీసుకున్నాను."

"ఏమయినా గొడవ అయిట్టయితే, నా చిరునామా ఇదుగో," బజరోవ్ యాదాలాపంగా అన్నాడు.

"యువ్గనీ వాసిలిచ్, గొడవ ఏమీ ఉండదని ఆశిస్తున్నాను...........నాకు చాలా విచారంగా ఉంది, మా ఇంట్లోంచి చివరకు మీరు ఇల్లా......అవినయంగా వెళ్లిపోవలసి వచ్చినందుకు. ఆర్కాడీ విషయమయి నాకు మరీ విచారంగా ఉంది.

"బహుశా నేనతన్ని కలుసుకుంటానేమో," అన్నాడు బజరోవ్. "క్షమార్పణలు," "స్పష్టీకరణాలు," మొదలయినవి వింటే అతనికి చిరాకు కలుగుతుంది. "ఒకవేళ అతన్ని నేను కలుసుకోకపోతే నేను శెలవు అడిగానని చెప్పండి. జరిగినదానికి నేను విచారాన్ని తెలుపుతున్నాను మీకు."

"నేను ప్రార్థించేది......" నికొలై పెట్రోవిచ్ జవాబుగా అన్నాడు. కాని ఆవాక్యం పూర్తి కాకుండానే బజరోవ్ వెళ్లిపోయాడు.

బజరోవ్ వెళ్లిపోతున్నాడని తెలిసి పావెల్ పెట్రోవిచ్ అతన్ని చూడాలని ఉందని పిలిపించి అతని కరస్పర్శ చేశాడు. కాని అప్పుడు కూడా మంచుకొండలాగ నిశ్చలంగా ఉన్నాడు. పావెల్ పెట్రోవిచ్ ఔదార్యాన్ని ప్రదర్శిస్తున్నాడని బజరోవ్‌కి అర్థమయింది. అతను ఫెనీచ్కానిమాత్రం కలుసుకోలేకపోయాడు కిటికీలోనించి ఆమెను చూడ్డం మాత్రం జరిగింది. ఆమెముఖం వాడిపోయినట్టు అతనికి అనిపించింది. "బహుశా ఆమె విచారిస్తుందేమో," అనుకున్నాడు తనలో......"కాని ఎవరు చెప్పగలరు? తప్పకుండా తేరుకుంటుంది ఆమె!" పీటర్ మట్టుకు తన విచారం ఆపుకోలేక అతని భుజంమీద కన్నీరు కార్చాడు. అతని కన్నుల్లో అక్షయమయిన జలపాతం ఏమన్నా ఉందా! అని బజరోవ్ అనడంతో అతని ఉద్రేకం చల్లబడిపోయింది. దున్యాషా తన విచారాన్ని కప్పిపుచ్చడానికి చెట్టుతోపులోకి పారిపోయింది. ఈ విషాదానికంతకీ కారణభూతుడయిన బజరోవ్, ఒక చిన్న బండిలోకి ఎక్కి కూర్చుని చుట్ట ముట్టించాడు. మూడుమైళ్లు పోయినతరవాత దారి మలుపు తిరిగింది. ఆమలుపులోనించి చూస్తే కిర్సనావ్ కమతం, అక్కడక్కడ కట్టిన కొత్తఇళ్లతో పొడుగ్గా తెల్లగా కనబడింది. ఆ మానిసేలమీద ఊస్తూ "చచ్చు మూక," అని గొణుక్కున్నాడు తన పైకోటు ఇంకా దగ్గరగా లాక్కున్నాడు.

పావెల్ పెట్రోవిచ్‌కి త్వరలోనే నయమయింది. కాని ఒకవారంరోజులు అతను మంచంమీదనే ఉండవలసివచ్చింది. తన బందిఖానా—అతను అనేవాడు—అతను ఓర్పుతోనే భరించాడు. కాని తన ప్రసాధనమాత్రం అతి జాగ్రత్తగా చేసుకునేవాడు. ప్రతివస్తువునీ యుడికొలోన్‌తో ముంచెత్తేవాడు. నికొలై పెట్రోవిచ్ అతనికి పత్రికలు చదివి వినిపిస్తుండేవాడు. ఫెనీచ్కా వెనకటిలాగే అతన్ని కనిపెట్టుకుని ఉండేది. అతనికి నిమ్మరసం, పులుసూ, ఉడికిన గుడ్లు, టీ తెచ్చిపెడుతూండేది. కాని అతని గదిలోకి కాలుపెట్టేటప్పుడు ఆమెకు లోలోపల భయంగా ఉండేది. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటన అందరినీ తబ్బిబ్బు చేసింది. అందరికంటే ముఖ్యంగా ఆమెను ఎక్కువ తలక్రిందుచేసింది. ప్రొకోఫిచ్ ఒక్కడే ఏమీ ఆందోళనపడలేదు. తన రోజుల్లో గొప్పవాళ్లు ఎల్లాటి ద్వంద్వయుద్ధాలు చేసుకునేవారో వర్ణించేవాడు—కాని వారు గొప్పవాళ్లతోనే తప్ప యుద్ధానికి దిగేవారుకారు. ఇల్లాంటి తక్కువరకపు కుక్కలని గుర్రపుశాలలో కట్టివేసి కొరడాతో కొట్టించేవారు, పొగరు అణగడానికి.

ఫెనీచ్కా ఆత్మలో, జరిగినదానికి పశ్చాత్తాపం కలగలేదు. కాని ఈ యుద్ధానికి అసలు కారణాన్ని తలుచుకొన్నప్పుడల్లా ఆమెకు ఎంతో బాధగా ఉండేది. అదీగాక పావెల్ పెట్రోవిచ్ ఆమెవేపు ఏదో వింతగా చూడ్డం ప్రారంభించాడు...... ఆమె వెనక్కి తిరిగినప్పుడుకూడా ఆ చూపులు తనమీద పడ్డట్టు ఆమెకు అనిపించేది. నిరంతరమూ మనస్సులో ఆందోళన కలుగుతున్నందువల్ల ఆమె సన్నబడింది, కాని మరీ సుందరంగా కనిపించేది—సాధారణంగా యువతులు సన్నగిల్లినకొద్దీ అతిలోకమయిన సౌందర్యాన్ని ధరిస్తారు.

ఒకనాడు—ఈ సంఘటన ఉదయాన్న జరిగింది — పావెల్ పెట్రోవిచ్ కాస్త బలం చేకూరడంచేత మంచంమీదనించి సోఫామీదకి జరిగి కూర్చున్నాడు. అన్నగారికి కులాసాగా ఉన్నసంగతి చూసి ధాన్యం నూర్పుతున్న కళ్లంలోకి వెళ్లిపోయాడు. ఫెనీచ్కా అతనికి టీ తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోతోంది పావెల్ పెట్రోవిచ్ ఆమెను ఆపాడు.

"అంత తొందరగా వెళ్లిపోతున్నావెక్కడికి ఫెదోస్యా నికొలెవ్నా!" అన్నాడు, "తొందర పనుందా?"

"లేదు......నేను టీసంగతి చూడాలి"

"దున్యాషా చెయ్యకూడదా నువ్వు లేకుంటే? కాస్త ఈ నిర్భాగ్యుడి రోగిదగ్గర కూర్చోకూడదా? మరిచిపోయాను నీతో కొద్దిగా మాట్లాడాలి.

ఫెనీచ్కా సమాధానం చెప్పకుండా ఒక పడకకుర్చీ అంచున కూర్చుంది.

"విను" పావెల్ పెట్రోవిచ్ తన మీసాలను లాక్కుంటూ అన్నాడు; "ఒక విషయం నిన్ను చాలాకాలంనించి అడగాలనుకుంటున్నాను. ఎందుచేతో నన్ను చూస్తే నీకు భయంగా ఉన్నట్టుంది."

"నాకా?"

"అవును. నీకే. ఎప్పుడూ నావేపు తిన్నగా చూడవు ఏదో నీమనస్సు తప్పు చేసినట్టు బాధపడుతున్నట్టు అనిపిస్తుంది."

ఫెనీచ్కాముఖం ఎర్రబడింది. కాని ముఖం ఎత్తి ఆమె పావెల్ పెట్రోవిచ్ వేపు చూసింది. అతను చాలా వింతగా ఆమెకు కనిపించాడు. ఆమెగుండెలు దడదడ కొట్టుకున్నాయి.

"నీమనస్సు ప్రశాంతంగా ఉందా?" అని అడిగాడు.

"ఎందుకు ప్రశాంతంగా ఉండదు?" ఆమె తడబడుతూ చెప్పింది.

"భగవంతుడికి తెలియాలి. అయినా ఎవరిఎడల దోషం ఆచరించి ఉంటావు నువ్వు? నాఎడలా? అది అయిఉండదు. ఈ ఇంట్లో ఎవరిఎడల నయినానా? అదికూడా అసంభవం. ఒకవేళ మా తమ్ముడా? కాని అతనంటే నీకు అనురాగం ఉంది. కాదూ?"

"నాకు వారియెడల ఎంతైనా ప్రేమ."

"హృదయపూర్వకమైనదా? ఆత్మపూర్వకమైనదా?"

"నికొలై పెట్రోవిచ్‌ని నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను"

"నిజంగా? నావైపు చూడు ఫెనీచ్కా." (ఆపేరు పెట్టి ఆమెను పిలవడం అదే మొదటిసారి.) "అసత్యం చెప్పటం పాపం తెలుసునా?"

"పావెల్ పెట్రోవిచ్, నేను అసత్యం చెప్పడంలేదు. నికొలై పెట్రోవిచ్‌ని ప్రేమించలేకపోతే—ఆ తరువాత నాకు జీవితం అక్కరలేదు."

"ఇంకెవరికోసమూ అతన్ని విడిచిపెట్టవా?"

"ఎవరికోసము వారిని విడిచిపెడతాను?"

"అవును. ఎవరున్నారు! అయితే ఇంతక్రితం ఇక్కడినించి వెళ్ళిపోయిన పెద్దమనిషివిషయం?"

ఫెనీచ్కా లేచి నిలబడింది "పావెల్ పెట్రోవిచ్, నన్నెందుకిల్లా బాధపెడుతున్నారు? మీ కేమి అపకారం చేశాను నేను? అల్లాంటి మాటలు మీరు ఎందుకుఅంటున్నారు?"

"ఫెనీచ్కా", పావెల్ పెట్రోవిచ్ విషాదంగా అన్నాడు, "నేను చూశా నన్న సంగతి నీకు..."

"ఏం చూశారు మీరు?"

"ఆనాడు ఆ పొదరింట్లో"

ఫెనీచ్కాముఖం ఇటు చెవులవరకూ ఎర్రబారింది. అటు తలకట్టువరకూ ఎర్రబారింది. "అందులో నా దోషం ఏముంది?" అతి ప్రయత్నంతో అంది.

పావెల్ పెట్రోవిచ్ లేచి కూర్చున్నాడు. "అందులో నీ దోషం ఏమీ లేదా? నిజంగా లేదా?"

"నేను నికొలై పెట్రోవిచ్‌ని ప్రేమిస్తున్నాను," ఫెనీచ్కా చటుకుని తోసుకువచ్చే దుఃఖాన్ని అణుచుకుంటూ అంది. ఆమె గొంతుక దుఃఖంతో కొంచెం ఇంచుమించుగా రుద్ధమయిపోయింది. "మీ రన్న విషయం నేను చనిపోయిన తరవాత భగవంతుడి ఎదుట నిలబడి అందులో నా దోషం ఏమీలేదని నేను చెపుతాను. అల్లాంటి పని నేను చేశానని ఎవరయినా అనుమానించినట్టయితే నేను తక్షణం ఆత్మహత్య చేసుకుంటాను."

కాని ఆమె గొంతుక రుద్ధమయిపోయింది. ఆ క్షణంలో పావెల్ పెట్రోవిచ్ ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని నొక్కుతున్నాడు.... ఆమె అతనివేపు చూసి, భయపడిపోయింది. మామూలుకంటే ఎక్కువగా అతడు పాలిపోయాడు. అతని కళ్లు మెరుస్తున్నాయి. అన్నిటికంటె విచిత్రమయిన విషయం—ఒకే ఒక పెద్ద అశ్రుకణం అతని చెక్కిలమీదికి జారింది.

"ఫెనీచ్కా!" అతడు వింతగా గొంతుక తగ్గించి అన్నాడు, "అతన్ని నువ్వు ప్రేమించాలి. మా తమ్ముణ్ణి నువ్వు ప్రేమించాలి. ఎవరికోసమైనా సరే నువ్వతన్ని వదిలిపెట్టకు; ఎవరిమాటా వినకు. ఒకరిని ప్రేమించి వారి ప్రేమను పొందలేకపోవడం ఎంత క్రూరమయిన విషయమో ఆలోచించు. మా నికొలైనిమాత్రం విడిచిపెట్టకు."

ఫెనీచ్కా కన్నీళ్లతడి ఆరిపోయాయి. ఆమెను ఆవహించిన భీతి ఆశ్చర్యంగా మారిపోయింది. కాని పావెల్ పెట్రోవిచ్, కేవలం పావెల్ పెట్రోవిచ్, తన చేతిని, అతని చేతుల్లోకి తీసుకుని తన పెదవులవరకూ ఎత్తి, తాకకుండా తదేకంగా తేరి చూస్తున్నప్పుడు మధ్యమధ్య పైకి వచ్చి పడిపోతున్న ఎగుపులను బలవంతంగా ఆపుచేసుకుంటున్నప్పుడు, ఆమెకు ఏమనిపించింది?...

"అబ్బ!" అనుకుంది ఆమె, "ఏదో బలమైన ఆఘాతం అతన్ని ముంచెత్తుతోంది."

ఆ క్షణంలో తన శూన్యజీవితమంతా అతని కళ్లఎదుట ప్రత్యక్షమయింది.

పైకి ఎక్కుతున్న అడుగుల బరువుతో మేడమెట్లు ఇంతలో కిరకిరమన్నాయి...... ఆమెను వదిలిపెట్టి అతను తలగడమీద తల వాల్చాడు. తలుపు తెరుచుకుంది; నికొలై పెట్రోవిచ్ శ్రమవల్ల ఎర్రబారిన ముఖంతో, వకవకలాడుతున్న ఉత్సాహంతో కులాసాగా లోపలికి వచ్చాడు. మిట్యా, ఒక పొట్టిచొక్కా మాత్రం తొడుక్కుని తండ్రిలాగే వకవకలాడుతున్న ముఖంతో అతని భుజాలమీద

(22 వ పేజీ చూడుడు)

గాంధీమహాత్ముని సందేశము

ఎడ్గార్ స్నో

౨

"గాంధీజీకి ప్రజాసమూహాల నవగాహన చేసుకోగల సహజోపలబ్ధ ఆత్మజ్ఞాన ముంది. నా కది లేదు" అని ఒకసారి నాతో జవ్హార్‌లాల్ నెహ్రూ చెప్పాడు. ఈ ఆత్మోపలబ్ధివలన, ఆ "సత్" పదార్థము ఆయనకు గుప్పిట చిక్కిన ట్లుండేది. ఆయన గ్రహించగలిగిన ఆ "సత్య"జ్ఞాన కిరణాల నాయన ఇతరుల కంద జేస్తూ పోగలిగాడు. ఆనాడు యమునాతీరాన, ఆ పాంచభౌతికశరీరము, అగ్నిసంస్కార మందు కొంటూండగా చూస్తున్నవాళ్ళందరకీ, మహాత్ముడు తన జీవితాంతమూ కృషి చేసిన యత్నంలో, మహోత్కృష్ట విజయ మందు కొంటూన్న క్షణంగా ఆ సమయం గోచరించింది. మహాత్ముడు భగవదైక్యస్వరూపుడయే కర్మ పరిపూర్ణమయింది. అచట మూగిన విస్తృత జనుల విశిష్టప్రవర్తన, ఆ మహాత్ముని పవిత్ర నాటకంలో తుది అంకంగా పరిణమించింది.

యమునానదీతీరాన, మొగలుకోట, షాజహాన్ భవనాలనుంచి దిగువగా, నదిఒడ్డు నంటి, ఒక మైలు పొడుగునా ఉన్న బయలులో, మధ్యగా ఒక ఇటుకరాతి తిన్నెను కట్టారు. తిన్నెపై గంధపుచెక్కల చితి పేర్చారు. ఇంకా దేహాన్ని అక్కడకు తీసుకురాకముందే, చుట్టూ రక్షకభటశ్రేణిని చొరుచుకొని, మేమక్కడకు చేరాము. చితి గంధపుచెక్కలతో పేర్చిఉంది. సుగంధతైలాలు, పూజాద్రవ్యాలు, అన్నీ చితినిండా చల్లి ఉన్నాయి.

బిర్లా భవనంనుంచి బయలుదేరిన, "అనంతశయనం" అక్కడకు వచ్చేందుకు నాల్గున్నర గంటలు పట్టింది. చుట్టూ భారతి మంత్రులు, గాంధీ సహచరులూ, శిష్యులూ, యావన్మందీ, ఆ ఊరేగింపులోనే ఉన్నారు. చితికి దగ్గరగా పచ్చికపై మౌంటుబాటన్ దంపతులు, భద్రరక్షకులు కూర్చుని ఉన్నారు. నెహ్రూ, తదితరులు, పుష్పమాలాలంకృతమైన ఆ దేహంపై గంధపు చెక్కల నమరుస్తూ, పంచామృతాలు చల్లుతున్నారు. దర్శనార్థమై స్త్రీ సమూహము బారులు గట్టి చితి దగ్గరకు వచ్చిపోతున్నారు. మంత్రపఠనాలతో వాతావరణం నిండిపోయి ఉంది.

మేము చితికి దగ్గరలోనే కూర్చున్నాము. మా వెనుకగా పదిలక్షలజనం మూగిఉన్నారు. జనానికీ, చితికీ, మధ్య రక్షకభట రక్షితమై, పచ్చని బయలు మిగిలింది. కానీ ఒక్కసారిగా, రక్షకభటశ్రేణిని భేదించుకొని, జనం చితిదగ్గరకు విరగబడ్డారు. కదలమెదలటానికీ ఊపిరి పీల్చటానికీ కూడా అవకాశం లేకుండా జనం క్రిక్కిరిసి మాపై పడిపోయారు. గాంధీజీ చితి ఉన్నంత కొస్త మేర మాత్రమే మిగిలిఉంది. అంతకంతకు జనం చితి మీదికి తోసేసుకొస్తున్నారు. గవర్నరు జనరల్ దంపతులూ, స్త్రీలూ, వాళ్లకుకూడా ఊపిరాడనీయనట్లుగా జనం లోపలికి పడిపోతున్నారు.

ప్రతివ్యక్తీ, "గాంధీలోకి చొచ్చుకనైనా పోవాలి, లేదా ఆయన ఆత్మను ఎల్లాగైనా ఆ దేహంలో బిగ్గబట్టైనా ఉంచాలి, లేదా ఇన్నాళ్ళు ఆయనలో తనదిగా ఉంటూ ఇప్పుడు దగ్ధమైపోనున్న భాగాన్ని తనకు మిగుల్చుకోవాలి" అనుకొంటూ, ఆ దేహందగ్గిరకు చొచ్చుకొస్తున్నా రనిపించింది. చివరికి ఎల్లాగో రక్షకభటులు జనాన్ని కొంత వెనక్కు నెట్టగలిగారు. సిద్ధమహాత్ముడు, శాంతంగా, ధూమశిఖలంగా మారిపోయి, యమునవైపున అస్తమయం కానున్న సూర్యభగవానునికై పయన మయ్యేందుకు అవకాశ మిచ్చారు. కాని, ఆలోపునే చితిలో బడ నుంకించిన అనేకప్రాణులను రక్షకభటులు వెనుకకు లాగవలసివచ్చింది.

ఆ తర్వాత, అక్కడి ప్రతివ్యక్తీ తన్నుతను ప్రశ్నించుకొన్నట్లే, నన్ను నేను ప్రశ్నించుకొన్నాను. "నిజంగా గాంధీజీ తనతో తన "దర్పణాన్ని" కూడా తీసుకుపోయాడా? ఇంక ఎవరైనా, ప్రపంచా న్నుద్ధరించేందుకు ఆయన పద్ధతి నవలంబించగలరా? ప్రపంచం చూస్తే, ఆయనతోపాటు, ఆ ధూమరేఖలలోనే లీనమై పోయేపద్ధతిలో నడుస్తున్న ట్లుందే!" అని ప్రశ్నించుకొన్నాను.

గాంధీజీ బోధలు, ఉద్గ్రంథాలుగా లిఖిత స్వరూపంలో ఉండనే ఉన్నాయి. కాని, ఆయన రాజకీయవిధాన గుణపాఠాలు, మనకు వాటితోగల ప్రయోజనమూ, వీటి నవగాహన చేసుకొనేందుకే నే నిక్కడ ప్రయత్నిస్తున్నాను. సూక్ష్మంగా చెప్పాలంటే ఆయన "అవతార" మయిన కారణాలు మూడు ఉన్నట్లు నాకు గోచరిస్తున్నాయి. (1) వ్యక్తిగతంగా నైతిక సౌష్ఠవాన్ని, పరిపూర్ణతను సంపాదించేందుకు గాను మానవుడు చేయవలసిన తపస్సును, ఆయన తనలో మూర్తీభవింప చేసుకొన్నాడు. (2) సంఘ ధర్మసంస్కారంలో, సర్వ సమానత్వ సంస్థాపనలో, మానవుని కవసరమైన కృషికి స్వరూపంగా నిలిచాడు. (3) వ్యక్తిపరంగానూ, సమిష్టిపరంగానూ, సంస్కారము మానవుడు సాధించవలసిన ఆవశ్యకతను తదవసానార్థమై, అహింసాకర్మ విధానాచరణాన్నే తనలో మూర్తీభవింపచేసుకొన్నాడు.

మానవుని ఈ ప్రాథమికావసరాలు మూటిలో ఒకటో, రెండో మాత్రమే స్పృశించిన గురువులు మనకు చాలామంది ఉండి ఉండవచ్చును. కాని ఈ మూటిని, తన "ఉజ్జ్వల" సత్యాన్వేషణ దీక్షతో మిళితమొనర్చి, సత్యఫలితాలను చూపించగల్గిన మహామహుడు, ఈ కాలాలకు గాంధీ ఒకడే కనబడుతున్నాడు. అంతటి వ్యక్తీకూడా, తన కృషి వైఫల్యం చూచుకొన్నప్పుడు అతివినమ్రుడై చింతిల్లేవాడు.

ఆయన చనిపోకముందు కొద్దినాళ్ళ క్రిందట ఆయన్ని కలుసుకొన్నప్పుడు, "మా స్వాతంత్ర్యోద్యమము, సంపూర్ణంగా, యుద్ధరహితము కాదన్న విషయాన్ని ఈమధ్యనే నేను తెలిసికోగలిగాను" అన్నాడు.

"ఇన్నాళ్ళూ స్వాతంత్ర్యంకోసం మేం చేస్తూన్న కృషిఅంతా, మా చేతలన్నీ, హింసారహితము అని, నన్ను నేను భ్రమింపచేసుకొంటూ మూర్ఖతలో పడిపోయాను. దైవము నన్ను గుడ్డివాడినిగా చేశాడు. ఆయా సమయాలలో నిజంగా, అహింసాయుతంగానే ప్రవర్తిస్తున్నామని నేను అనుకోటంగూడా, భగవంతుడు తన కార్యసాధనలో నన్ను నిమిత్తమాత్రునిగా ఉపయోగించుకొనేందుకు అవసరమనే అల్లా అనిపింపచేసి ఉండవచ్చును—ఇప్పుడు చూస్తే యథార్థాని కిది బలహీనుల శాంత నిరోధముతప్ప వేరేమీ కాదని నాకు తెలిసి వస్తూంది" అని గాంధీజీ అన్నాడు.

ఈ తేడా ఆయనకు కనబడటానికి, స్వాతంత్ర్యం ప్రాప్తించినతర్వాత, మతవర్గాలూ, రెండూ ఘోరంగా పోట్లాడుకోటమే కారణం. తత్ఫలితంగా, తన బోధల అంతరార్థం జనంలో చాలామంది అర్థమే చేసికోలేదని ఆయనకు తెలిసివచ్చింది.

పై మాటలని అల్లా, ఆ శాంత, వినమ్రమైన, విచిత్రసుస్థిరస్వరంతోనే నెమ్మదిగా అన్నాడు: "కానీ; నేను కూడా ప్రపంచానికి నా చేతనైన స్వల్పం చేయగలిగా ననుకొంటాను. 'అహింస', 'సత్యాగ్రహాలు' కేవలం నైతిక సూత్రాలు మాత్రమే కావనీ, ప్రత్యక్షఫలితాలు సాధించగలవనీ, ప్రయోగపూర్వకంగా చూపగలిగాను."

ఆధునికమానవుని కవసరములైన, మూడు సత్యాలలోనూ, గాంధీజీ రూపొందిన ఈ సత్యత్రయములోనూ, మొదటిది,—అంటే ఆత్మపారిశుద్ధ్యాన్ని పొందటం—అన్నిటికన్నా బహుకష్టసాధ్యమైన దని చెప్పవచ్చును. కాని భారతజాతిపై ఆయన కున్న ప్రభావానికి, మూలకందము అదే. రవీంద్రనాథ టాగోరు మొట్టమొదట ఆయనను "మహాత్ము"డని అన్నప్పుడు—ఆయనలో ఈ "ఆర్యధర్మ" అనుభూతిని గుర్తించే, మహాత్మతత్వాన్ని గుర్తించే, ఆ బిరుదాన్ని ఇచ్చాడు.

గాంధీజీ సనాతనుడు. కాని సంకుచిత ధర్మ ఆవేశుడు కాడు. ఉదాహరణకు, "హిందూ, ముస్లిం, క్రైస్తవ, తదితరమతగ్రంథబోధలలో దేనివలన మీ కీ ఉద్బోధ కలిగిం"దని నే నడిగినప్పుడు—"కేవలం మతంలో కాదు—ఏ బోధనాలించినా, ఆ పాఠం నేర్చుకొనేందుకు, అక్కడ అవకాశం ఉండనే ఉం"దని జవాబిచ్చాడు. సర్వసద్గుణాలకు "సత్యము"తో సమన్వయ ముంటుందని, మొదట "వేదములు" చదివినప్పుడే ఆయనకు తట్టిందికాని ఆయనకు, వేరు మతాలు లేవు "సత్యమే" ఆయన మతము.

హిందూ పురాణాలనుంచి ప్రవచిస్తూ "సత్యమును మించిన ధర్మము లేదని" ఆయన అన్నాడు.

ఆయన భరించలేని దొక్కటే. అబద్ధమాడటం. ఎక్కడ అబద్ధముంటే, అక్కడ అది ఆయనకు కనబడేది. తన ఉద్యమ ప్రచారంలో కానీ, ప్రతిస్పర్థి వాక్యాలలో గానీ, పత్రికలలో గానీ, ఉపన్యాసవేదికలలో గానీ, దేవాలయపీఠాధిపత్యాలనుంచిగానీ, "అసత్య" మెక్కడనుంచి వెలువడినా, ఆయన ఇట్టే పసిపట్టగలిగేవాడు.

"నాకు, 'సాధన', 'ఫలితము' వీటి రెంటి స్వరూపము ఒకటిగానే గోచరిస్తుంది. అసత్యసాధనతో, సత్యఫలితాలను ఏనాడూ పొందలేము" అని అన్నాడు.

ఈ సాధనను, అంతర్బహిరుపాధుల రెంటివల్లనూ సాధించవలెనని గాంధీజీ అనుకొనేవాడు. తన్ను తను జయించలేనిదే, "భారతజాతికి" 'జయం' చేకూర్చటానికి నాయకుడనై నడిపించలే ననే అనుకొనేవాడు.

స్థిరచిత్తం కావాలంటే, సంగపరిత్యాగం కావాలని, స్థిరచిత్తం లేనిదే, "సత్యము" చిక్కదని ముందే గ్రహించాడు. తన ఆహారవిహారవ్యవహారాల నన్నిటిని నియమిత మొనర్చుకొన్నాడు. ఆహారనియమం పాలించాడు. మత్తుపదార్థాలను తననుండి దూరం చేసుకొన్నాడు. 'తనది' అని ఏదీ ఉంచుకోకుండా జాగ్రత్తపడ్డాడు. బ్రహ్మచర్యాది అనేక నియమాలు అవలంబించాడు.

"కపటిసుడా! నీ దృష్టిలోని దూలఅవరోధాన్ని ముందు తొలగించుకో, నీ సోదరుని కంటిలోని చిన్ని నలుసును అప్పుడే తొలగించుకోగలవు" (బైబిలు).


గాంధీజీ తన కంటిలోని దూలఅవరోధాలను తొలగించుకోగలిగానని ఏనాడూ చెప్పుకోలేదు. తనను "మహాత్ముడ"నని ఏనాడూ చెప్పుకోలేదు. అతని సోదరమానవులే ఆ మహత్త్వాన్ని గుర్తించి, ఆయనకు మహాధికారశక్తిని అంకితం చేశారు. తన కా అధికార ముందనికూడా ఏనాడూ ఆయన అనుకోలేదు.

గాంధీజీ బోధలలోనూ, రచనలోనూ, ఎక్కడా అబద్ధాలు కనబడవు. నైచ్యము, పరనింద, సంకుచితత్వము, కుత్సితత్వము, భయము, దుర్గర్వము, దంభము, ద్వేషము, దురభిమానము కనబడవు. "ఇది ఇంతే తిరుగులేదు" అని చెప్పిన దెక్కడా ఉండదు.

ఆయనలో అంతర్వాణి—భగవంతుడంటే, సర్వాంతర్యామియై అనిర్వచనీయమైన ఒక మహాశక్తి, ఆయన భావించాడు—ఆ అంతర్వాణి, అతివినయంతో, మృదులంగా సర్వదా పలుకుతూఉండేది. ఆయనలోని ఆ స్వచ్ఛతాదర్పణంలో, ఇతరులలోని సత్యము ప్రకాశించి, ప్రతిఫలించి, పెరిగి పెద్దదై మహాజ్యోతిగా కనబడేది. మహోజ్జ్వలమైన ఫలితాలను సాధించేందుకు ప్రేమవిధానాన్ని, అవలంబించటంలో "బోధిసత్త్వని" అనుకరించాడు.

"సత్యమునే వచించు. ఆగ్రహాన్ని ప్రేమతో జయించాలి. అసత్యవాదిని సత్యముతో లొంగదీసుకురావాలి" అని బుద్ధుడు చెప్పాడు.

లోకాన్ని పరిత్యజించి, ఆత్మోపలబ్ధికై,



నిర్జనప్రదేశాలలో ముక్కు మూసికొని కూర్చున్న చాలామంది సన్యాసులవలెగాక, బుద్ధునివలెనే, గాంధీకూడా, మానవులమధ్య నుండి, మానవుని విముక్తుని చేయటానికి ప్రయత్నించాడు. ఆయనను రోగి అని, పిచ్చి ఆదర్శవాది అని వెక్కిరిస్తూ అపార్థాలు చేసుకోటం పాశ్చాత్య లోకంలో పరిపాటి అయిపోయింది. కాని "స్వధర్మ" (religion) దూరమైన రాజకీయాలు ఏమీ అర్థం లేనివిగా నాకు గోచరిస్తాయని ఆయన అన్నాడు. ఆ ధర్మసూత్ర పూర్వాపరాలను సాకల్యంగా, ప్రత్యక్ష ఆచరణప్రయోగం వల్ల సాధించి చూపించాడు. ఆయన యథార్థ సంఘసంస్కారి. సరియైన పరిణామసూత్రరీత్యా చూసుకొంటే, మహావిప్లవవీరుడు. సత్సాధన, సత్ఫలితమూ రెంటినీకూడా, సజీవరూపంలో, సమన్వయ మొనరించుకొంటూ, తనలో లీనం చేసుకొని తత్స్వరూపంగానే గాంధీ నిలిచాడు.

గాంధీని అనేకమార్లు అనేకవిషయాల్లో, అపార్థాలు చేసుకొన్న పెక్కుమందిలో నే నొకడిని. బలవంతులూ, కల్మషులూ అయిన ధనికస్వాముల యెడ సహనం చూపుతూ, వారికి కొన్ని ఉనులు బాట్లుకూడా కలిగిస్తున్నాడని ఆయన్ను అపార్థం చేసుకొన్నాను. కాని ఈ మాటు భారతదేశం వచ్చి చూచినపుడు, ఆయన ఎల్లప్పుడూ, పీడితులూ, అధఃపతితులూ అయిన వాళ్ళ పక్షమే అవలంబిస్తూ వచ్చాడని గ్రహించాను. ఆయన గత చర్యల నన్నిటినీ ఒక్కసారి సింహావలోకనం చేసుకొని చూస్తే, ప్రజల విస్తృతక్షేమా న్నభిలషించి తదవసరార్థమై చేసిన పట్లతప్ప, ఆయన ఎప్పుడూ అధికారవర్గంతోటీ, ధనికవర్గంతోటీ,—బ్రిటిష్‌గానీ, భారతీయము గానీ—ఎప్పుడూ లాలూచీ పడలేదని స్పష్టంగా తెలుస్తుంది. అనేకవైవిధ్యాలతోటీ, అనేకవిపరీతాలతోటీ, క్లిష్టతరమై ఉన్న భిన్న భిన్న సాంఘికశక్తులకన్నిటికీకూడా, కేంద్రస్థానంలో నిలచి, వాటిని అన్నిటిని కూడగట్టుకువచ్చి నడిపించవలసిన గురుతరమైన బాధ్యత వహించి మహాజాతీయనాయకునిగా, గాంధీని అవగాహన చేసుకోగలిగితేతప్ప, ఆయన్ను సరిగ్గా అర్థం చేసుకోటం కష్టమవుతుంది. ఒకసారి ఆ జాతీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించగలిగాక, ఆయన తన వ్యక్తిత్వబలాన్నంతనూ, సర్వ మానవజాతి సంస్కరణకూ, పునరుద్ధరణకూ అయిన అభ్యుదయ పథతత్వంవైపుకే మొగ్గనిచ్చాడు.

"గాంధీ ఎప్పుడును అభ్యుదయ విధానముల వైపుననే ఉంటాడు. భారతసంఘంలోని, తిరోగమ ప్రవృత్తుల నెదిరించగలిగేందుకు మాకుగల మహాశక్తి గాంధియే" అని భారత సోషలిస్టు నాయకుడు, జయప్రకాశనారాయణ, మహాత్ముని హత్యకు కొద్దిరోజుల పూర్వమే నాతో చెప్పాడు.

(సశేషము)

ఆంధ్రసామ్రాజ్యప్రాచీన ముఖ్యనగరము శ్రీకాకుళము చరిత్ర

శ్రీ ముక్తేవి శ్రీరంగాచార్యులు

చరిత్ర లేని రోజులలోని లిపి ఉత్పత్తికి ముందు కాలమందు చనిపోయినవారి శవాలకు సమాధుల నేర్పర్చి వారు వాడుకొనెడి వస్తు వాహనములతోనూ, పనిముట్లతోను పూడ్చెడివారు. వీటినే మనవారు రాక్షసగుళ్ళు అంటారు. లిపి ఏర్పడిన పిమ్మట వ్రాతమూలకమైన సాధన సంపత్తి కొంత మనకు లభ్యమైనది. చరిత్ర పరిశోధకులు ఈ యుగాన్ని చరిత్రసాధనసంపత్తి యుగంగా పేర్కొన్నారు. గుహాలు, దేవాలయాలు, స్తూపాలు, కోటలు మొదలైనవి ఈ తరగతిలోకి వస్తాయి. వీటిని స్వభావసిద్ధమైనవనియు, నిర్మితములైనవనియు రెండు తరగతులుగా విభజించవచ్చును. నిర్మితమైనవాటిల్లో చైత్యాలయములని, విహారములని, దేవాలయములని మూడు తరగతులు గలవు. ఇవే చరిత్రరచనకు ఉపయోగకరములైనవి. చైత్యాలయములు, విహారములు బౌద్ధులకున్నూ, దేవాలయములు హిందువులకున్నూ చెందియున్నవి. అజంతా, ఎల్లోరాలలోని చిత్రములుగాని శిల్పములుగాని మొదటి రెండు తరగతులకు చెందిఉన్నాయి. ఆ ప్రాచీనకాలంలో బౌద్ధమతము మన దేశంలో బాగా వ్యాపించి ఉండెడిది. స్తూపములుకూడా పెక్కు వెలసినవి. సుప్రసిద్ధచరిత్ర పరిశోధకులైన మల్లంపల్లి సోమశేఖరశర్మగారు స్తూపమనగా అప్పటి బౌద్ధమతసులలో చనిపోయిన వారి శవములపై కట్టబడిన కట్టడము అని అర్థముచెప్పిరి. అమరావతి, ఘంటశాల, భట్టిప్రోలు మొదలగు చోట్ల నేడు మనం చూచేవి ఇట్టి స్తూపాలే అయి ఉన్నవి. క్రీ. శ. 7వ శతాబ్దము పిమ్మట దేవాలయాలు, వాటిమీద చిత్రాలు, శాసనాలు ఇవన్నీ వచ్చాయి. వీటినిబట్టే మన చరిత్ర తెలుసుకొనుటకు అవకాశము ఏర్పడింది. శాసనాల్లో శైలికములు, లౌహకములు అని రెండు రకాలు గలవు. శిలలమీదవి, శైలికములున్నూ, లోహముల మీదవి లౌహకములున్నూ అయిఉన్నాయి. 7వ శతాబ్దములగాయతు 11వ శతాబ్దము వరకు అనగా నన్నయకాలం వరకూ ఆంధ్రవాఙ్మయ చరిత్ర ప్రారంభమయింది. 9వ శతాబ్దమునుండి పద్యాలు ప్రారంభమయాయి. ఈ శైలికములే 17వ శతాబ్దము వరకు చరిత్రపరిశీలనకు బాగా తోడ్పడ్డాయి. చరిత్రలేని ఆ ప్రాచీన కాలంలో శాస్త్రపరిశోధకులు అప్పటి ఈ కట్టడములనే ఆధారంగా తీసుకొని చరిత్ర రచనకు పూనుకోవలసివచ్చింది. శ్రీకాకుళముచరిత్ర ఆ ప్రాచీన కాలమునాటి దగుటచే ఈ విషయాలన్నీ మనము తెలుసుకోవలసి వచ్చింది.

శ్రీకాకుళము బందరుకు షుమారు 25 మైళ్ల దూరంలో కృష్ణానది ఒడ్డున గల ఒక గ్రామము. బందరునుంచి కొడాలి అను గ్రామంవరకు బస్సులు గలవు. ఆ పిమ్మట నాలుగు మైళ్ళు నడిచి వెళ్లాలి. వేసవిలోమాత్రము సరాసరి ఊళ్లోవరకు బస్సులు వెడతాయి. తెనాలినించీకూడ వెళ్లవచ్చును. కొల్లూరువరకు బస్సుమీదగాని రైలు మీదగాని వెళ్ళి కృష్ణ దాటితే అవతలే శ్రీకాకుళము ఉంటుంది. మార్గంలో చరిత్ర ప్రసిద్ధమైన గాజుల్లంక, ఆముదాల లంకలనుగూడ చూడవచ్చును.

పౌరాణికగాథలు

శ్రీకాకుళమును గూర్చి అనేక పౌరాణిక గాథలు గలవు. అందులో కొన్నింటినిమాత్రము తెలుపుచున్నాను. ఇచ్చట ఉన్న ఆలయములో ఉన్న శ్రీ వల్లభస్వామి కృష్ణానది ఒడ్డున వెలసి ఉండగా తాతగారు అను పేరుతో పిలువబడు ఆ స్వామివారికి పాలు ఆరగింపుచేయమని ఒక స్త్రీ తన కుమార్తెతో చెప్పి గ్రామాంతరం వెళ్లెనట. ఆరగింపు అనగా త్రాగించుట అని తలంచి, తల్లి ఆజ్ఞ ప్రకారము కుమార్తె పాలుతెచ్చి ఎంతసేపు బతిమాలినా పాలు త్రాగనందున తాను చచ్చెదనని ఆత్మహత్యకు ఒడంబడగా స్వామివారు పాలు త్రాగనారంభించెనట. పాలు వేడిగా నుండుటచే ఆ వేడిపాలు త్రాగినందున కంఠము తెల్లబడినట్లున్నూ, పాలు త్రాగినందున పాలనంబి అను వాడుక పేరు వచ్చినట్లున్నూ ప్రతీతి. 18 సం॥ములో కంపెనీవారికి ఇచ్చిన కైఫీయతులో పైన చెప్పిన పౌరాణికగాథలోని పాలుత్రాగిన ఉదంతము బహుశః వండపాలుని కాలంలో (అనగా క్రీ. పి. 1132 లగాయతు 1157 లోగా) జరిగియుండవచ్చునని గలదు. 1159 లగాయతు 142 సం॥ములు ఓరుగంటివారు రాజ్యపాలనము గావించిరి. 1292 A. D. లో ప్రతాపరుద్రుడు స్వామివారిని దర్శించినప్పుడు ఇంకొక గాథ జరిగిందని చెబుతారు. ప్రతాపరుద్రుడు స్వామివారిని దర్శించుటకురాగా, వేశ్యాలోలుడగు ఒక అర్చకుడు వేశ్యతలలోని పూవును తెచ్చి దానిని ఆ మరుపాటుతో రాజున కిచ్చెనట. ఆ పూవుతో పాటు ఒక వెంట్రుకకూడ వచ్చియుండెను. ఆ వెంట్రుకను జూచి రాజనుమానపడి ఆగ్రహపూరితుడై ఇది ఏమని అర్చకుని అడుగగా స్వామివారికి జుట్టు గలదనియు, మరునాటి ఉదయమున చూపెదననియు చెప్పి తప్పుకొనెను. మరునాటి ఉదయమునకు తన్ను అనుగ్రహించనియెడల ప్రాణము వీడెదననియు, తన్ను కనికరించవలెననియు స్వామివారిని అర్చకుడు వేడెను. స్వామివారు కనికరించి ఆ మరునాడు తప్పక కోరిక తీర్చెదననిరి. వెంట్రుకలతో మరునాడు స్వామివారు ప్రసన్నమైరి జుట్టు లాగినట్లున్నూ, నెత్తురుకూడా వచ్చినట్లున్నూ ప్రతీతి గలదు. అందువల్లనే స్వామివారి జుట్టునంబి అనుపేరు వచ్చినట్లున్నూ చెప్పుదురు. ఆలయ ప్రాంగణములో మట్టపల్లి గలదు. అచ్చట ఒక హనుమంతుని విగ్రహము గలదు. 1761 ప్రాంతములో నిజామ్‌నుండి నిజామల్లీ అనువాని ఆధిపత్యమున ఒక మరాటీదండు చల్లపల్లి ఎస్టేటును కొల్లగొట్టుటకై రాగా చెంతన యున్న పెద్దముత్తేవి అను గ్రామములోని భక్తిపరులు, విద్వాంసులు అగు ముక్తేవి పీగంరాజు అను పెరుమాళ్లయ్యగారు ఈ హనుమంతుని ఉపాసించి నూరు పద్యములతో స్తుతింపగా ఆ దండుమీద పిడుగులుపడి మరణించి శేషించినవారు బెజవాడ నుంచి వెనుతిరిగి పోయినట్లున్నూ ఆ శతకములో తెలుపబడి యుండెను.

ఆలయము బహుప్రాచీనమైనది. వి. ఏ. స్మిత్ మొదలగు దేశీయభాషాపండితులు (Orientalists) ఐతరేయ బ్రాహ్మణము చాల ప్రాచీన గ్రంథమనియు, అది మహోద్గ్రంథమనియు అందులో ఆంధ్రులనుగూర్చి పేర్కొనబడినదనియు చెప్పిరి, మరియు బ్రహ్మవివర్త పురాణంలో ఆంధ్రులను శ్లాఘించుచూ ఆంధ్రదేశమంతయు పవిత్రస్థానమనియు పేర్కొనబడెను. ఆంధ్ర అనగా విష్ణువు నివసించు భాగము అని అర్థమైయుండగా భావరాజు కృష్ణరావుగారు ఆ పేరు అచ్చుబాటు గాదనియు పేరుమార్చి "అంధ్ర" అని ఉండాలనియు అంటున్నారు. అట్లెన్నటికి చేయదగదు.

మహాప్రళయమైన పిమ్మట ఆంధ్ర భూభాగమే మొదట వెలువడెనదనియు, ఆ వెలువడినప్పుడు ప్రథమంలో గుంటూరుజిల్లాలోని పొన్నూరు ఆ పరిసరప్రాంతమే వెలువడిందనియు, ఆ చుట్టుపట్లఅంతా దేవాలయము లుండెడివనియు ఒక గాథ గలదు. అందువల్లనే దేవాలయాలు, శిథిలాలను నేడు మనం అచ్చట చూడగలుగుచున్నాము.

శాసనాలు

ఆదిలో శ్రీకాకుళము అనే ఈ గ్రామం శ్రీకాకొలను అనే పేరుతో ఉండెడిది. స్వామివారిని 11వ శతాబ్దము ఆఖరువరకు అనగా రెడ్ల పరిపాలనాంతమువరకు ఆంధ్రవల్లభుడనేవారనిన్నీ, ఆపిమ్మట తెలుగువల్లభుడనేవారనిన్నీ ఈ దిగువశాసనాలను బట్టి తెలుసుకొనవచ్చును.

దక్షిణదేశపు శాసనాల మూలగ్రంథాల సంపుటము IV లో దేవాలయపు రాళ్లమీద 966 నెంబరు (A R No. 145 of 1893.)

1. శ్రీ శకవర్షంబులు 1134 నేటి ఫాల్గుణ బహుళ 5 గురువారంనాడు తళమగా శ్రీకాకొలని శ్రీ వల్లభుని కొల్లురి గత్య అతినేనికి...."

విజయనగరం క్రిష్ణరాయలది:—

981 (A R. 157 of 1893) మండపము మీద 1,2,3, 4 లో శ్రీకాకుళపు తెలుగురాయలను దేవరకోటలోని యార్లగడ్డ మేడూరిస్థలములో ఏలి దేవరలంకపల్లి, సత్రాలభూమి, తోటలు, శ్రీ రామానుజకూటముటము, కొత్తలంక, చింతలంక, పుంద్రేడుకలపిరాట్ల పులుగుదులంక, కంబాలదొడ్డి, కొండవీటిసీమలోని పెద్దగాడిదపట్టు, వినుకొండలోని ముధుమంచిస్వామి నిత్యనైవేద్యమునకు అంగరంగ వైభవాలకు ఇస్తిని.

981, 1 శాసనములో శ్రీకాకుళపు తెలుంగు రాయలకు 1440లో అని పేర్కొనబడెను.

చారిత్రక విశేషాలు

క్రీస్తుపూర్వము రెండవశతాబ్దములో అశోకుని అనంతరము దీపకర్ణి అను ఒక రాజు రాజ్యపాలన గావించెను. ఆ రాజు ఒకదినమున వేటకై పోయి వేట పూర్తి గావించుకొని ఒక తటాకము వద్ద విశ్రాంతి గైకొనుచుండగా సింహముపై నెక్కివచ్చు ఒకబాలుని చూచెను. రాజాశ్చర్యపడి ఆ సింహముపై ఒక బాణము వేయగా అది మాయమై మనుష్యాకృతిలో ఒక మహాపురుషుడు గన్పడి ఆ బాలుని పెంచమని మహారాజుతో చెప్పి అంతర్ధానమయ్యెను. ఆబాలుడే శాతవాహనుడని ప్రతీతి గలదు. ఈయన్నే శాలివాహనుడు అనికూడా అంటారు. ఆంధ్రులలో ప్రథమ స్వతంత్ర చక్రవర్తి ఈ రాజే. ఈ చక్రవర్తితోనే ఆరంభింపబడిన శాలివాహనశకము నేటివరకు స్థిరస్థాయిగా నిలచినది. ఆపిమ్మట పాలించిన చక్రవర్తులందరికి శాతవాహనచక్రవర్తులని పేరు వచ్చింది. ఈ చక్రవర్తులకు "శాతకర్ణి" అనే బిరుదుకూడా గలదు. శాతకర్ణి అనగా రాజ్యాంగవ్యవహారాల్లో నూరుచెవులతో వింటూ రాచకార్యములు నడిపేవారన్నమాట. నాకా నిర్మాణప్రతిభ చాటేటందుకై నాక ఆకారములో ఉండే నాణెములు అమలులో పెట్టాడు శాతకర్ణి. ఆ రోజుల్లో ఈ నాణాలు అన్నీ బెజవాడలో చెలామణిలో ఉండేవి. చిత్రకళకు కూడా వీరు చాల ప్రాధాన్య మిచ్చిరి. ప్రతిష్ఠానపురమువద్ద అనేక స్మారకచిహ్నాలు వెలసాయి. ఇందులో ముఖ్యంగా పడమట హిందూదేశంలోని భాజాగుహ, నానాఘాట్ గుహలోని రాజ కట్టడముల చిత్రములు చెప్పుకోదగ్గవి. హిందూదేశమంతటిలోనూ సాంచీలోని తోరణగేటు మార్గము ఎన్నికగన్నది. ఇది శాతకర్ణుని కాలంలో తయారుచేయబడింది. అజంతా గుహలోని ప్రాచీన చిత్రాలు, అమరావతిలోని స్తూపాలు వీరియొక్క శిల్పసామర్థ్యమును దెలుపుచున్నవి.

చరిత్రకు తెలిసినంతవరకు ఆంధ్రులలో మొదటిరాజు ఆంధ్ర విష్ణువు. ఈతడు నిశంభుడను రాక్షసుని జయించి మహేంద్రగిరినుండి ఉజ్జయిని వరకున్నూ, అచ్చటినుంచి సౌరాష్ట్ర దేశమందలి శ్రీగిరి వరకున్నూ పెద్ద గోడను నిర్మించి శ్రీకాకుళమును రాజధానిగా చేసికొని పాలించెను. క్రీస్తుశకము 3వ శతాబ్దములో ఆంధ్రవిష్ణువు కృష్ణానది ఒడ్డున ఉండెడి శ్రీకాకుళమును రాజధానిగా చేసికొని పాలించెనని బ్రహ్మవివర్త పురాణంలో గలదు. పొన్నూరులో భావన్నారాయణ పేరుతో అవతారపురుషుడుగా వెలసిన ఆంధ్రవిష్ణువుపేరే ఈ మహారాజుకు నామకరణము గావింపబడియుండెను. క్రీ. శ. 600 ప్రాంతములో ఆంధ్రుడగు ఆపస్తంబుడు వేదమునకు సూత్రములు వ్రాసెను. ప్రపంచ సాహిత్యానికి మొదటిగ్రంథమగు ఋగ్వేదంలో మొదటి ఋక్కు వ్రాసింది ఆంధ్రులు. ఆంధ్రులు బహుప్రాచీనజాతివారు ఋగ్వేదంలో దక్కన్ భూభాగంలోని ఎక్కువ భూభాగము వీరి ఆక్రమణక్రింద గలదని పేర్కొనబడినది. ఉత్తరహిందూదేశము మౌర్యులక్రింద ఉండెడిది. వారిపిమ్మట ఆంధ్రులే కీర్తికాములై వెలసిరి. శాతవాహనుడు సామ్రాజ్యము స్థాపించినదాది వ్యాపారము విదేశాల్లో బాగా వ్యాపింపజేసిరి. భట్టిప్రోలులో దొరికిన శాసనాలలో ఆంధ్రుల వాణిజ్యము, ఆర్థికసౌష్ఠవముగూర్చి శ్లాఘించబడియుండెను. గ్రీక్ చరిత్రకారులు కొత్తపట్టణము, బందరు, ఘంటసాల మొదలగు ప్రదేశాలు ఆంధ్రదేశ వ్యాపారానికి ముఖ్యపట్టణాలని పేర్కొనిరి. రోము నాణెములు కడప, వినుకొండ, మొదలగుచోట్ల లభించుటవల్ల రోమ్ సామ్రాజ్యముతోగూడ మనకు వ్యాపార సంబంధముండెడి దని తెలియుచున్నది.

క్షీణగతి

శ్రీకాకుళమునుంచి ముఖ్యపట్టణము ధాన్యకటకమునకు మార్చబడెను. శాలివాహనులు క్రీస్తుపూర్వం 200 సంవత్సరములున్నూ ఆ పిమ్మట 250 సంవత్సరాలున్నూ రాజ్యపాలన గావించిరి. ఆపిమ్మట 7వ శతాబ్దము వరకు ఆంధ్రుల చారిత్రక విశేషము లెచ్చటనూ గానరావు. 11వ శతాబ్దము అంత్యములో కాకతీయుల పాలనలో గణపతిదేవుక్రింద కొంత అభివృద్ధి గనబడినది. ఢిల్లీపాదుషా కనుఎత్రకులోనై 1323లో ప్రతాపరుద్రుని కాలంలో రాజ్యము గోల్పోయిరి. కాకతీయుల పిమ్మట ఆంధ్రదేశములోని దక్షిణభాగము మహమ్మదీయులగు బామినీసుల్తానుల కైవసమాయెను. ఆంధ్రదేశమందలి తూర్పుభాగము 1½ శతాబ్దములు రెడ్ల క్రింద ఉండెను. మరల కృష్ణదేవరాయల కాలంలో ఆంధ్రులు కీర్తి గడించిరి. తూర్పు, పశ్చిమ, దక్షిణభాగమంతా తనక్రిందకు తెచ్చుకొనెను. కృష్ణదేవరాయలు శ్రీకాకుళములోని కాకుళేశ్వరస్వామిని దర్శించి స్వామివారికి అనేకగ్రామములు ఇచ్చినట్లు పై శాసనాల వల్ల తెలుస్తూన్నది. కళింగ దిగ్విజయయాత్ర చేయుచూ ప్రాచీన ఆంధ్రసామ్రాజ్య ముఖ్యపట్టణము అగు శ్రీకాకుళము వచ్చి అచ్చటనున్న కాకుళేశ్వరుని ఏకాదశినాడు ఉపవాసముచేసి దర్శించుకొనెను. ఆరాత్రి దేవాలయమునందే పరుండెను. రాజునకు స్వామివారు స్వప్నములో సాక్షాత్కరించి శ్రీరంగములోనున్న

(17 వ పేజీ చూడుడు)

భారత రాజకీయాలు :

భారతదేశానికి కాశ్మీర్ ఉపసంఘు ఆగమనము

యు. పి. ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులకు అఖండవిజయము

సోషలిస్టులు కాంగ్రెసునుండి వైదొలగినప్పుడు కాంగ్రెస్ టిక్కెట్టుపై సంపాదించిన శాసనసభాసభ్యత్వములకు కూడా రాజీనామా లిచ్చిరి. ఆ ఖాళీలను భర్తీచేయుటకు తిరిగి ఎన్నికలు జరిగినవి. ఈ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్, సోషలిస్టు అగ్రనాయకులందరు ఆయా నియోజకవర్గములలో పర్యటించి, ప్రచారము చేసిరి. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వయముగా ప్రచారము చేసెను. ఉపప్రధాని సర్దార్ పటేల్ కూడ పత్రికా ప్రకటనలు చేసెను. సోషలిస్టు అభ్యర్థుల తరఫున శ్రీ జయప్రకాశ్ నారాయణ ప్రచారము చేసెను.

ఉభయపక్షములు ఎన్నికల ప్రచారము విపరీతముగ జరిపినవి. ఉపన్యాసములు, పత్రికా ప్రకటనలు, కరపత్రములే గాక 'పోస్టర్ల'ద్వారా కూడ ప్రచార-యుద్ధము సాగించినవి. కొన్ని ప్రాంతములలో ఉభయపక్షములు ప్రత్యక్షముగా కొట్లాటకు దిగునని భయముకూడ వేసినది. అదొక్కటి మినహా, జరుగవలసినదంతా జరిగినది. సోషలిస్టుల పక్షమున ఎన్నికలకు నిలబడినవారందరు ఇదివరకు శాసనసభ్యులుగా నున్నవారే. వీరిలో ఆచార్య నరేంద్రదేవ్ కూడ ఒకడు. ఈయన కాంగ్రెస్‌లో అగ్రనాయకత్వము నందుకున్నవాడు. ఎట్టి ప్రత్యర్థియు ఈయనను గెలువలేడనియే కాంగ్రెస్‌వారుకూడ యిందు భావించిరి. కాని ఈ ఎన్నికల—పోరాటము వ్యక్తులకుగాక రెండు రాజకీయ పక్షములకు జరుగుచున్నది కాబట్టి, ప్రతిష్ఠకొరకు, నరేంద్రదేవ్‌తోకూడ పోటీ చేయవలెనని నిశ్చయించి, అందుకు పూనుకొనిరి. కాని ఆ అభ్యర్థి గెలుచునని కాంగ్రెస్‌వారే ఆశించియుండలేదు.

ఎన్నికల ఫలితములు సోషలిస్టులకన్న కాంగ్రెస్‌వారినే ఎక్కువ ఆశ్చర్యచకితులను చేసెను. సోషలిస్టు అభ్యర్థులందరు ఓడిపోయిరి. ఆచార్య నరేంద్రదేవ్‌తో పోటీచేసిన కాంగ్రెస్ వాది ఒక వెయ్యివోట్ల మెజారిటీతో గెలిచెను. ముగ్గురు సోషలిస్టులు తమ 'డిపాజిట్ల'ను సహితము కోల్పోయిరి. ఎన్నికలలో ఒక్క సోషలిస్టు అభ్యర్థి మాత్రము విజయము గాంచెను. అదైనను, అతని ప్రత్యర్థి 'నామినేషన్' కాగితము సరిగా లేదని త్రోసిపుచ్చబడుటవలననే! ఈమధ్య యు. పి. లో జరిగిన జిల్లాబోర్డు ఎన్నికలలో సోషలిస్టులకు 69 స్థానములు లభించినవి. ఇప్పుడా కొంచెముకూడ దక్కలేదు.

యు. పి. ఎన్నికలలో కాంగ్రెస్ వాదులు సంపూర్ణవిజయము పొందిరి. అంతమాత్రాన సోషలిస్టులకు పలుకుబడి లేదనిగాని, కాంగ్రెస్ చేయుచున్నదెల్ల ప్రజామోదము పొందినదనిగాని వారు గర్వించనక్కరలేదు. సోషలిస్టుపార్టీ ఎన్నికలలో పాల్గొనటం ఇదే ప్రథమ పర్యాయం. ఆ పార్టీ ఆశయములు ఇంకా బాగుగా ప్రచారంలోనికి రాలేదు.

యు. పి. లో కాంగ్రెసువాదుల విజయము కాంగ్రెస్‌కు, సోషలిస్టులకు ఒక హెచ్చరిక. పెద్దలు గడించిన ప్రతిష్ఠ కాంగ్రెసుకు కావలసినంత వున్నది. కాంగ్రెస్‌వాదుల ప్రస్తుత చర్యలు ఎంత అసంతృప్తికరముగ నున్నను, వానిని సహించుటకు ప్రజలు సిద్ధముగా నున్నారు. కాని ఆ సహనమునకు హద్దున్నది. కాంగ్రెస్ వాదులు తమ ప్రస్తుత చర్యలవలన పూర్వులు సంపాదించి యిచ్చిన ప్రతిష్ఠను పోగొట్టుకున్నచో తమకే గాక, దేశమునకే అపచార మొనర్చినవారగుదురు. సోషలిస్టులు ఒక రాజకీయపక్షముగా పైకి రావలెనన్న అది వారి స్వశక్తివలననే జరుగవలెను. కాంగ్రెస్ లోపము లెన్నుటద్వారా, కాంగ్రెసును బలహీన మొనర్చుటద్వారా పైకి రాగల్గుదునని అనుకున్నచో వారు ఆశాభంగము పొంది తీరెదరు. సోషలిస్టుపార్టీ యంత్రమే సరిగా ఏర్పడలేదు; ప్రచారము చాల తక్కువగ నున్నది. నూతన రాజ్యాంగము ప్రకారము రెండేండ్లలో ఎన్నికలు జరుగును. ఈ రెండేండ్లైనను సోషలిస్టులు తీవ్రకృషి జరపనిచో, సోషలిస్టుపార్టీ నామమాత్రముగానే వుండిపోగలదు.

యు. పి. కాంగ్రెస్ ఎన్నికలు

ఈమధ్య జరిగిన ఎ. ఐ. సి. సి. తీర్మానము ప్రకారం ఎ. ఐ. సి. సి. సభ్యులు, రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ కార్యవర్గములు తిరిగి ఎన్నిక కావలసియున్నది. జూన్ 13 వ తేదీన అన్ని రాష్ట్రములలోను కాంగ్రెస్ కార్యవర్గములకు ఎన్నికలు జరిగినవిగాని ఒక్క యు. పి. లో మాత్రము కాంగ్రెస్ అధ్యక్షుడు డా. రాజేంద్ర ప్రసాద్ ఆదేశము ప్రకారము ఎన్నికలు వాయిదా వేయబడెను. యు. పి. కాంగ్రెస్ వాదులలోని విభేదములే ఇందుకు కారణము. కాంగ్రెస్‌వాదుల విభేదములను పరిష్కరించుటకు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గత మాసములో 4, 5 పర్యాయములు ప్రయత్నించెను. కాంగ్రెస్ అధ్యక్షుడు డా. రాజేంద్రప్రసాద్ కూడ ప్రయత్నించి చూచెను గాని ఫలితమేమియు లేదు.

యు. పి. కాంగ్రెస్‌లో ప్రస్తుతము సంఘర్షణ జరుగుచున్నది. వ్యక్తులకు, గ్రూపులకుగాక సిద్ధాంతములకే! హిందీయే రాజభాషగా వుండవలెననీ, ఉర్దూలిపి, ఉర్దూమాటలు హిందీలో చొరరాదనీ, 'హిందుస్థానీ' యనుభాషయే లేదనీ ఒక వర్గమువారు వాదింతురు. వీరు కొంతవరకు ముస్లిం వ్యతిరేకు లని చెప్పవలెను. అంటే, కాంగ్రెస్ సిద్ధాంతములపట్ల, అహింస పట్లవారికి శ్రద్ధ, గౌరవము లేవని కాదు. ఈ వర్గమునకు నాయకుడు బాబూపురుషోత్తమదాస్ టాండన్. హిందుస్థానీగాక హిందీయే రాజభాష గావలెనని ఈయన చేసిన ప్రచారము బీహార్, యు. పి. లలో చాలవరకు ఫలప్రదమైనది. పురుషోత్తమదాస్ టాండన్ ఇదివరకు యు. పి. శాసనసభ స్పీకరుగా వుండెను. మహమ్మదీయుల చర్యలను విమర్శించుచు చేసిన కొన్ని ఉపన్యాసములు ముస్లింలీగ్ సభ్యులకు కష్టము కల్గించగా ఎవరెన్ని చెప్పినను వినక ఆయన స్పీకర్ పదవికి రాజీనామా నిచ్చెను. ఈయన రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడు కావలెనని ఒక వర్గమువారు పట్టుబట్టుచుండగా వేరొకవర్గమువారు అధినివేశ మంత్రి రఫీ అహమ్మద్ కిద్వాయ్‌ని అధ్యక్షపదవికి నిలబెట్టుచున్నారు. వస్తుతః జమీందారైనను కిద్వాయ్ అకలంకదేశభక్తుడు, కాంగ్రెస్ వాది. ఈయన జీవితములో చాలకాలము జైళ్ళలోనే గడచిపోయినది.

ఈయన హిందూస్థానీవాది; సోషలిస్టు మనస్తత్వము గలవాడు.

రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గము నెన్నుకొనుటకు యు. పి.-కాంగ్రెస్‌కమిటీ గతవారము లక్నోలో సమావేశమయ్యెను. ఉభయపక్షములకు రాజీకుదుర్చుటకు అప్పటివరకు జరిగిన ప్రయత్నములన్నియు విఫలమైనను, ఆఖరు క్షణములో రాజీకుదురు అవకాశ మేమైన వున్నదేమోనని ప్రధానిపండిట్ పంత్ ప్రయత్నించి చూచెను. ఇదికూడ విఫలముకాగా, చిట్టచివరకు, కాంగ్రెస్‌కమిటీ సమావేశములో పండిట్‌పంత్ ఒక 'రాజీతీర్మానము'ను ప్రవేశపెట్టెను. ఈ తీర్మానము ప్రకారము ముందు అధ్యక్షునిఎన్నిక గాక కార్యవర్గ ఎన్నిక జరుగును. ఆ మర్నాడు అధ్యక్షుని ఎన్నిక జరుగును. వాదోపవాదముల తరువాత ఈ రాజీమార్గము అవలంబించి, 5 గురు ఉపాధ్యక్షులను ఏకగ్రీవముగా ఎన్నుకొనిరి. ఇతరకార్యవర్గముకూడ ఎన్నుకొనబడెను. మర్నాటికి, ఉభయపక్షములు రాజీకివచ్చెను. అధినివేశమంత్రివర్గములో కిద్వాయ్ బాధ్యతాయుతస్థానములో నున్నాడు. అతని నివిడిచిపెట్టుటకు పండిట్ నెహ్రూ ఒప్పుకొనలేదు. అందువలన కిద్వాయ్ పోటీనుండి విరమించగా, పురుషోత్తమదాస్ టాండన్ ఏకగ్రీవముగా ఎన్నుకొనబడెను.

సిక్కుల విభేదాలు

ఆగస్టు 15 వ తేదీ తర్వాత జరిగిన కల్లోలము వలన సిక్కులందరు ఒకరాష్ట్రములో సంఘటితపడిపో గలిగిరి. రెండురాష్ట్రములలోనే గాక, రెండుదేశములలోనికి విడిపోవలసిన ప్రమాదమునుండి తప్పించుకుని, ఇట్లు బైట పడగల్గినందులకు సిక్కులందరు సంతోషించిరి. తూర్పు పంజాబ్‌లో స్థిరనివాస మేర్పరచుకుని సిక్కులు తమతోపాటు ఆరాష్ట్రమునుకూడ అభివృద్ధిలోనికి తేగలరని అందరు ఆశించిరి. కానిసిక్కుల ఐక్యత ఎన్నాళ్ళో నిలువలేదు. ఆగస్టు 15 వ తేదీకి పూర్వముకంటె ఇప్పుడే సిక్కులలో ఎక్కువ భేదాభిప్రాయము లున్నవి.

ఆగస్టు 15 వ తేదీకి పూర్వము సిక్కులలో రెండు పార్టీలే ఉండేవి. మూడింట రెండు వంతులు సిక్కులు అకాలీపార్టీని, ఒకవంతు సిక్కులు కాంగ్రెస్ పార్టీని బలపరుస్తూండేవారు. శాసనసభలలో సిక్కు ప్రతినిధులుకూడా దాదాపు ఈ నిష్పత్తిలోనే వుండేవారు. మహాత్మగాంధి హత్యానంతరం అకాలీపార్టీ వారు కాంగ్రెస్‌లో కలసి పోవటానికి నిశ్చయించారు. భారతదేశంలో మత రాజకీయసంస్థలకు తావుండరాదని నాయకులందరు భావించుటయే ఇందుకు కారణం. అకాలీపార్టీ ఈవిధంగా కాంగ్రెసులో చేరిపోవటం సిక్కునాయకుడు మాస్టర్ తారాసింగ్‌కు ఇష్టంలేదు. అకాలీదళము, అకాలీపార్టీలు వేరుగా వుండకపోతే, సిక్కుపంథ్‌కు ప్రమాదము తటస్థించవచ్చునని ఈయన అభిప్రాయము.

అప్పటివరకు అకాలీదళ్‌కు అధ్యక్షుడుగా వున్న గ్యానీకర్తార్‌సింగ్ ఆ పదవికి రాజీనామా నిచ్చి, తూర్పుపంజాబ్ మంత్రివర్గములో కూడా చేరెను. అందువలన అకాలీదళ్ అధ్యక్షపదవి ఖాళీపడెను. దీనికితోడు ఇదేసమయమున సిక్కు గురుద్వార్ ప్రబంధక్ కమిటీ అధ్యక్షపదవి కూడ ఖాళీపడెను. ఈ రెండుపదవులకు పోటీ చేసి, సిక్కుపంథ్ ఐక్యతను కాపాడుటకు మాస్టర్ తారాసింగ్ నిశ్చయించుకొనెను. కాంగ్రెస్‌తో చేరి పోవలెననే ఏ సిక్కుకూడా ఈ పదవులకు అర్హుడుకాడని ఆయన స్పష్టపరచెను. తూర్పుపంజాబ్ మంత్రివర్గములోని ఇంకొక సిక్కుసభ్యుడు జాతిదార్ ఉద్ధామసింగ్ నాగోక్ మాస్టర్ తారాసింగు నెదిర్చి, గురుద్వార కమిటీ అధ్యక్షతకు పోటీచేసెను. అకాలీదళము కేవలము మతసంస్థ కాబట్టి దాని అధ్యక్షతకు పోటీచేయదలచలేదని నాగోక్ స్పష్టపరచెను. గురుద్వార్ కమిటీ అధ్యక్షత పోటీనుండి మాస్టర్ తారాసింగ్ ఎందువలననో విరమించెను. నాగోక్ ఎన్నికయ్యెను. అకాలీదళ్ అధ్యక్షుడుగా మాస్టర్ తారాసింగ్ ఎన్నికయ్యెను. ఈ ఎన్నికలలో అధినివేశ రక్షణశాఖ మంత్రి సర్దార్ బలదేవ్‌సింగ్, గ్యానీకర్తార్ సింగ్ గారలు మాస్టర్ తారాసింగ్‌ను బలపరచిరి. పాటియాలా మహారాజా, తూర్పుపంజాబ్ మంత్రి సర్దార్ ప్రతాప్‌సింగ్ గారలు జాతేదార్ ఉద్ధామసింగ్ నాగోక్‌ను బలపరచిరి. ఇది జరిగిన కొద్దిరోజులకే, తూర్పుపంజాబ్ మంత్రి, నాగోక్ పక్షపాతిఅయిన సర్దార్ ఇషార్‌సింగ్ మజహిక్‌నుతొలగించి ఆస్థానమును గ్యానీకర్తార్ సింగ్‌కు ఇచ్చిరి. పశ్చిమపంజాబ్‌నుండి కాందిశీకులుగా వచ్చివేసినివారి కొకరికి మంత్రివర్గములో స్థాన మిచ్చుటకే ఈ పని జరిగినను, సర్దార్ బలదేవ్‌సింగ్ నాగోక్‌వర్గముపై దెబ్బతీయుటకే ఇట్లు చేయించెనని వారు అనుమానపడిరి. దీనితో ఈ రెండు వర్గములమధ్య విభేదములు మరింత పెరిగెను. సర్దార్ ఇషార్‌సింగ్ మజహిక్ మంత్రివర్గమునుండి వైదొలగుచు, ఒక పెద్ద విందు ఏర్పాటుచేసెను. ఈ విందుకు పాటియాలా మహారాజును ఆహ్వానించి, సిక్కుల రక్షకుడవనీ, సిక్కుపంథ్ నాయకుడవనీ పొగడుచూ పలువు రుపన్యసించిరి. సిక్కుల నాయకుడుగా సర్దార్ బలదేవ్‌సింగ్ స్థానమును పాటియాలా మహారాజా ఆక్రమించవలెనని వీరు ఆశించుచున్నట్లు ఇందుమూలమున స్పష్టపడినది. ఉభయపక్షములవారును ఒకరిపై ఒకరు దెబ్బతీయుటకు ఇట్లు తీవ్రప్రయత్నములు చేయుచుండిరి.

ఇది ఇట్లుండగా, తూర్పుపంజాబ్ సంస్థానములన్నియు ఒక కూటమిగా ఏర్పడినవి. ఆ కూటమి తాత్కాలిక ప్రభుత్వము త్వరలోనే ఏర్పరుచవలసియున్నది. ఈ సమితికి రాజప్రముఖ్ పాటియాలా మహారాజు. ఈ సంస్థాన కూటమి ప్రజాప్రతినిధులు లోకసేవకసంఘము, ప్రజామండలి, అకాలీదళము అను మూడు పార్టీలుగా నున్నారు. లోకసేవక సంఘము ఒక సంవత్సరము క్రితమే స్థాపింపబడినది. హిందూ-సిక్కు ఐక్యతకొరకు, సిక్కులనందరిని కాంగ్రెస్‌లో చేర్పించుటకు ఈ పార్టీ పని చేయును. ప్రజామండలికి విరుద్ధముగా పనిచేయుటకే ఈ సంస్థ స్థాపింపబడినది. ప్రజామండలి కాంగ్రెస్ అడుగుజాడల ననుసరించియే పని చేయును. అకాలీదళ్ సంగతి చెప్పనక్కరలేదు. వీనిలో లోక సేవకసంఘమును నాగోక్ వర్గము బలపరచుచున్నారు. ప్రజామండలి, అకాలీదళములు సర్దార్ బలదేవ్ సింగ్, గ్యానీ కర్తార్ సింగ్, మాస్టర్ తారాసింగ్‌ల ఆధ్వర్యమున నడుచుచున్నవి. త్వరలో ఈ సంస్థానకూటమి తాత్కాలికప్రభుత్వ మేర్పడవలసినప్పుడు అధికారముకొరకు లోకసేవక సంఘముతో, ప్రజామండలి, అకాలీ దళములు సంయుక్తముగా పోటీచేయును. పాటియాలా మహారాజు నాగోక్‌వర్గమునకు, అంటే లోకసేవక సంఘటమునకు చెందినవాడు. రాజప్రముఖ్‌గా ఆయన ఏపార్టీని ఆహ్వానించి, మంత్రివర్గ మేర్పరుపవలసినదని కోరునో చూడవలసియున్నది. ఆహ్వానము నాగోక్ వర్గమునకే పోయినచో, సిక్కుల విభేదములు ఇప్పటిలో సమసిపోవు. అట్లుగాక, ఉభయవర్గములు సంయుక్తముగా మంత్రివర్గ మేర్పచినచో ఇంతటితోనైన సిక్కుల విభేదములు సమసిపోవుటకు వీలుండును.

కాశ్మీర్ ఉపసంఘు ఆగమనము

భద్రతామండలిచే నియమింపబడిన కాశ్మీర్ ఉపసంఘము ఇండియా, పాకిస్థానులకు వచ్చి చేరినది. కాశ్మీర్ ఉపసంఘసభ్యులు కొంతమంది కరాచీలో దిగి, పాకిస్థాన్ ప్రభుత్వముతో సంప్రదింపులు జరుపుచున్నారు. మరికొందరు నేరుగా ఢిల్లీ వచ్చివేసిరి. పాకిస్థాన్‌లో దిగినవారు ప్రధానిలియాకతాలీఖాన్‌నూ విదేశ శాఖ మంత్రి జఫ్రుల్లాఖాన్‌నూ కలిసికొని చర్చలు జరిపి, అక్కడినుండి ఢిల్లీ వచ్చెదరు. రెండు వారాలపాటు ఢిల్లీలో వుండి, భవిష్యత్ కార్యవిధానమును నిర్ణయించుకుని, అటుపైన కరాచీ వెళ్ళి, అక్కడినుండి కాశ్మీర్‌కు పయనమై వెళ్ళదలంచుచున్నట్లు వారు తెలియజేసిరి. కరాచీలోను, ఢిల్లీలోను వీరు అధికారులతో సంప్రదింపులు జరిపి, కాశ్మీర్‌సమస్య నవగాహన చేసికొనుటకు ప్రయత్నింతురట. ఇప్పటివరకు ఈ ఉపసంఘమునకు అర్జంటైనా ప్రతినిధి అధ్యక్షుడుగా నుండెను. మూడువారముల కొకపర్యాయము అధ్యక్షుడు మారుచుండవలెనని ఒకరితర్వాత నొకరు తమతమ దేశములపేర్ల అకారాదిక్రమమునుబట్టి అధ్యక్షత వహించవలెనని వీరు జినీవాలో సమావేశమై నిర్ణయించుకొనిరి. ఈ నిర్ణయము ప్రకారము బెల్జియం ప్రతినిధి ఇకమీద మూడువారములవరకు అధ్యక్షుడుగా నుండును.

ఇండియా, పాకిస్థాన్‌లమధ్య ఏర్పడిన వివాదములను శాంతియుతముగా పరిష్కరించు

(16 వ పేజీ చూడుడు)

పౌరుల ప్రాథమిక హక్కులు
ప్రజానీకమునకు హెచ్చరిక

శ్రీ కల్లుట్ల రామకృష్ణశాస్త్రి

ఇండియా యూనియన్ రాజ్యాంగ చిత్తు చట్టము ప్రజాభిప్రాయమునకై ప్రకటింపబడినది. ఇందులో మూడవ అధ్యాయములో 9 మొదలు 27 సెక్షనులవరకు పౌరుల ప్రాథమిక హక్కులు వివరింపబడి ఉన్నవి. ముఖ్యముగా 13 సెక్షను 1 వ క్లాజులో పౌరుల వాక్స్వాతంత్ర్యమునకును, సంఘస్వాతంత్ర్యమునకును సంబంధించిన హక్కులు పేర్కొనబడినవి. కాని అదే సెక్షను 2 వ సబ్ సెక్షన్ మొదలు 6 సబ్ సెక్షనులలో పై హక్కులను ప్రాణములేనివానిగా ఒనర్చుటకై హద్దులేని మినహాయింపులు చేర్చబడినవి. ఈ మినహాయింపులను చదివినచో, కుడిచేతితో చూపబడిన హక్కులు ఎడమచేతితో మాయముచేసినవిధముగా ఉన్నవి. పసిబిడ్డల పోరు మానుపుటకై అద్దములో చందమామను చూపుదురు—ఆ విధముగనే రాజ్యాంగ చట్టములో పౌరుల ప్రాథమిక హక్కులకు ప్రత్యేకస్థానము ఇవ్వబడినదని నోరులేని ప్రజానీకమును మెప్పించుటకై రాజ్యాంగ చట్టనిర్మాతలు ప్రజాప్రాథమికహక్కులకై ఒక ప్రత్యేక అధ్యాయమును ఏర్పరచి ప్రజాజీవితములో దినదిన వ్యవహారములకు ఆ హక్కులు ఎంతమాత్రము ఉపయోగపడకుండులాగున హద్దులేని మినహాయింపులను చేర్చియున్నారా? ఏమి, అని పాఠకులకు తోచక తప్పదు. ఇటుల చేయుటకన్న ఇండియాయూనియన్ పౌరులకు ఏ విధమైన ప్రాథమిక హక్కులే లేవని ప్రకటించి ఉండిన బాగుండెడిది.

ఈ చిత్తు రాజ్యాంగ చట్టమును తయారు చేయుటలో ఇండియా ప్రధానమంత్రిగారైన పండిత జవహర్‌లాల్ నెహ్రూగారికి ప్రత్యక్ష సంబంధము లేకుండపోయి ఉండవచ్చును. పరోక్షసంబంధము లేదని చెప్పుటకు కాని, లేక నమ్ముటకు కాని వీలులేదు. ఈ మహావ్యక్తి గడిచిన 25 సంవత్సరములుగా స్వాతంత్ర్యజపము చేయుచూ వచ్చిరి. స్వాతంత్ర్య శంఖారావమును పూరించుచూ ప్రజానీకములో జాతీయ చైతన్యము చల్లారకుండ ప్రజ్వలింపజేసిరి. ఇట్టి నాయకోత్తముడైన శ్రీ జవహర్‌లాల్ గారి అధ్వర్యముక్రింద తయారు అయిన రాజ్యాంగ చిత్తు చట్టమా ఇది అని 13 వ సెక్షను 2 వ క్లాజు మొదలు 6 క్లాజులలో తెలుపబడిన మినహాయింపులను చదువు ప్రతిపౌరునికిని ఆశ్చర్యము కలిగింపక మానదు.

ఇండియా రాజ్యాంగపరిషత్తు మహాసభలో ఇండియా రాజ్యాంగ ఆశయములను స్పష్టీకరించుచూ (Objective Resolution) శ్రీ జవహర్‌లాల్ నెహ్రూగారు ఒక తీర్మానమును ఉపపాదించిరి. ఆ తీర్మానమును ఉపపాదించు సమయములో ఆయన గావించిన మహోపన్యాసమేమి, ఆ తీర్మానములో తెలుపబడిన భావములేమి చాల చరిత్రాత్మకమైనవి. ఆ ఉపన్యాసమును, ఆ తీర్మానమును చదివినప్పుడు ఇండియా యూనియన్ ప్రజానీకమునకు కలిగిన ఆనందము అనిర్వచనీయమై అనన్యసామాన్యమై ఉండెను. ఆ తీర్మానములోని భావౌన్నత్యము ఇండియా ప్రజానీకములో ఒక అపూర్వ ఆశాజ్యోతిని ప్రజ్వలింపజేసినది. అట్టి ఆశాజ్యోతి ఇండియా రాజ్యాంగ చిత్తుచట్టములో, ప్రజల ప్రాథమిక హక్కులకు సంబంధించిన అధ్యాయములో తెలుపబడిన మినహాయింపులను చదివినచో చల్లారిపోవును.

ఈ మినహాయింపులలో ఇమిడిఉన్న అర్థము నోరులేని అతులకోలది ప్రజలకు సులభముగా అర్థముకాదు. ఈ దేశదౌర్భాగ్యమో, లేక ఈ నోరులేని ప్రజానీకముయొక్క దౌర్భాగ్యమో అన్నటుల పౌరహక్కులకు విషబీజములుగా 13 వ సెక్షను 2 మొదలు 6 సబ్ సెక్షనులలోను, ఇతర సెక్షనులలోను తెలుపబడిన మినహాయింపులను తొలగించుటకై దేశ ప్రధాననాయకుల దృష్టి ఆకర్షించు విధముగా ఆందోళన సాగుట లేదు. పత్రికలలో కూడ తీవ్రమైన ప్రతిఘటనము సూచించు వ్రాతలు ప్రకటింపబడుటలేదు.

సాధారణపరిస్థితులలో వయోజన నియోజక వర్గములద్వారా ఎన్నుకొనబడు సభ్యులవల్లనే ఈ రాజ్యాంగపరిషత్తు మహాసభ నిర్మాణము కావలసిఉండెను. అసాధారణ పరిస్థితులలో ఈ సభ నిర్మాణము కావలసివచ్చెను. రాష్ట్రీయ శాసన సభకు ఎన్నుకొనిన ప్రతినిధులే ఈ సభకు నియోజకవర్గముగా ఏర్పాటుచేసిరి. వారిచే ఎన్నుకొనిన ప్రతినిధులే ఈ రాజ్యాంగపరిషత్తు మహాసభను అలంకరించుచున్నారు.

ఈ రాజ్యాంగపరిషత్తు మహాసభకు ఎవరు ఎన్నుకొనబడినను, ఎవరు ఎన్నుకొనబడకున్నను దేశములో ఉండు ఆబాలగోపాలముయొక్క సంపూర్ణ విశ్వాసమునకు పాత్రులై అఖండత్యాగధనులై సర్వసమర్థులైన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దారు వల్లభాయిపటేల్, బాబు రాజేంద్రప్రసాద్ మొదలగు మహానాయకులు ఈ సభతో ప్రత్యక్షసంబంధము కలుగచేసుకొని ఏకదృష్టితో పనిచేయుచున్నందున రాజ్యాంగ పరిషత్తు మహాసభ ఎన్నికలలో ఎన్ని అవకతవకలు ఉండినను ఇండియా ప్రజానీకము వానిని పాటింపరైరి. లాహోరు కాంగ్రెసుమహాసభలో సంపూర్ణ స్వాతంత్ర్యతీర్మానమును శ్రీ జవహర్‌లాల్ గారు ఉపపాదించి ఆమోదింపజేసిరి. కరాచీ కాంగ్రెసుమహాసభలో ప్రజల ప్రాథమిక హక్కు (Fundamental Rights) లకు సంబంధించిన తీర్మానమును ఉపపాదించి ఆమోదింపజేసిరి. 1946 సం॥ సెప్టెంబరునెల 2 వ తేదీ ఇండియా జాతీయప్రభుత్వమును ఏర్పాటు చేయువరకు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూగారు "ఇండియా సివిల్ లిబర్టీసు యూనియన్"కు అధ్యక్షులుగా ఉండిరి. ఇట్టివారి అధ్వర్యముక్రింద తయారగు రాజ్యాంగవిధానములో ప్రజల ప్రాథమిక హక్కులకు ఏలాటి భంగమూ వాటిల్లదు. వానికే ఎక్కువ ప్రాముఖ్యత ఒసగబడునని ఇండియా యూనియన్‌లో ఉండు బాధ్యతగల పౌరులు ఎల్లరు ఆశించుకొనిఉండిరి.

కాని ప్రస్తుతము ప్రకటింపబడిన రాజ్యాంగ చిత్తుచట్టము ఈ ఆశకు ఆస్పద మొసగలేదు. చాల నిరుత్సాహముగ ఉన్నది. నిస్పృహ జనించుచున్నది. సకాలమున ఈ విషయములో విజ్ఞానులై బాధ్యతగల ఇండియా పౌరులు అజాగ్రత్త వహించినచో, తరతరములుగా చింతింపవలసి ఉండును. నోరులేని ప్రజానీకమునకును, భావిసంతతికిని ఉత్తరవాదులై ఉండవలసియుండును.

ఇండియాకు స్వాతంత్ర్యము లభించిన ఈ పదిమాసములుగా కాంగ్రెసుమంత్రివర్గములవారు రాష్ట్రీయప్రభుత్వములను సాగించుచున్న పద్ధతులను ప్రశాంతముగా సింహావలోకనము చేయుడు. అడుగు అడుగునకు పౌరహక్కులకు తీరని భంగపాట్లు కలుగుచున్నవి. వ్యక్తిస్వాతంత్ర్యమును అరికట్టుటకై నిర్బంధశాసనములు కావింపబడినవి. ఆర్డినెన్సులు ప్రకటింపబడినవి. విచారణ లేకుండ అనేకమంది పౌరులు కారాగృహములలో నిర్బంధింపబడినారు. ఇట్టి పరిస్థితులలో ప్రజలకు కట్టకడపటి ఆశ ఒకటి ఉండినది. విచారణ లేని నిర్బంధములో ఉంచబడినవారు కాని, లేక వారిపక్షమున ఇతరులు ఎవ్వరైన కాని ఆ నిర్బంధము సక్రమమా, లేక అక్రమమా అను విషయమును విచారించుటకు ప్రధాన న్యాయస్థానమునకు అర్జీలుపెట్టుకొనవచ్చును. క్రి. ప్రొ. కోడు 491 సెక్షను క్రింద హైకోర్టులు అట్టి పిటిషన్‌లను విచారింపవచ్చును. ఇంతవరకును హైకోర్టులు అట్టి పిటిషనులను విచారించినవి. అయితే రాష్ట్రీయప్రభుత్వమువారు క్రి. ప్రొ. కో. 491 సెక్షనుక్రింద అట్టి పిటిషన్‌లను హైకోర్టువారు విచారింపకూడదని ఆర్డినెన్సులను ప్రకటించిఉన్నారు. సంఘస్వాతంత్ర్యమును అరికట్టుటకై క్రి. ప్రొ. కో. క్రింద ఉండు 144 సెక్షను పలుమారు పలుప్రదేశములలో ప్రయోగింపబడుచున్నది.

వారంటులు లేకుండనే వ్యక్తులను అరెస్టుచేసి 15 రోజులు విచారణ లేకనే పోలీసు డిప్యూటీ సూపర్ ఇంటెండెంటు హోదాగల ఉద్యోగులు తమ స్వాధీనములో ఉంచుకొనుట శాస్త్రీయమని యు. పి. కాంగ్రెసు ప్రభుత్వమువారు ప్రకటించిరి. ఈ రాష్ట్రములో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు హోదా గల ఉద్యోగి, హెచ్చరిక ఒసగి కాని, హెచ్చరికే ఇవ్వకకాని ఒక వ్యక్తిని కాల్చి చంపుట శాస్త్రీయమని శాసనము కావించి ఉన్నారు. కార్యనిర్వాహక ఉద్యోగులు నిర్బంధములో ఉంచదలచిన వ్యక్తికి తెలిసికాని, లేక తెలియకకాని ఎవరైనను అన్నము, నీరు ఇచ్చినచో లేక ఆశ్రయము ఇచ్చినచో, అటుల ఇచ్చినవారు నేరస్థులుగా పరిగణింపబడెదరు. అట్టివారు 3 నెలలు మొదలు 24 నెలలవరకు కారాగృహ శిక్షకు, రు. 1,000/- జులుమాన చెల్లించుటకు బాధ్యులగుదురు. ఇట్టి నిర్బంధశాసనముల వలన కాంగ్రెసు మంత్రివర్గమువారు ఇంతవరకు ఏ పోలీసురాజ్యమును తూలనాడుచుండిరో అట్టి పోలీసురాజ్యమునే తమ అధికారకాలములో కల్పించుచున్నారు.

రాజ్యాంగ చిత్తుచట్టములో 10 వ సెక్షను, 1 వ క్లాజులో ప్రభుత్వము క్రింద ఉండు ఉద్యోగములను పొందుటకు సర్వపౌరులకు సమానమగు అవకాశము లున్నవి. ఇందు స్త్రీపురుష విభేదమును పాటించుటలేదు. మత, జాతి, కులవిచక్షణను పాటించుటలేదు—అని తెలుపబడినది. దీనికిని కొంత మినహాయింపు కలదు. ఈ రాజ్యాంగచిత్తుచట్టము శాసనమై అమలులోనికి వచ్చినతర్వాత ఈ రాష్ట్రకాంగ్రెసు మంత్రివర్గమువారు ఎంతమాత్రము ఈ హక్కును మన్నించెదరో తెలియదు. ఇప్పుడుమాత్రము ఈ హక్కుకు ప్రత్యక్షవిరోధముగా రాష్ట్రీయ ప్రభుత్వమువారి వశములో ఉన్న ఉద్యోగములన్నియు కులసాంప్రదాయముల ననుసరించియే పంచిపెట్టబడుచున్నవి.

రాజ్యాంగ చిత్తుచట్టము 23 వ సెక్షను 2 వ క్లాజులో ప్రభుత్వ యాజమాన్యము క్రింద నిర్వహింపబడు పాఠశాలలలో ప్రవేశము పొందుటకు సర్వులకును సమానమైన హక్కు కలదు. మతము వల్ల కాని, కులము వల్ల కాని, భాషవల్ల కాని, కొందరు వ్యక్తులు మైనారిటీవర్గమునకు చేరినంత మాత్రముననే గాని వారిని పాఠశాలలలో చేర్చుకొనుటకు నిరాకరింపరాదని తెలియచేయబడినది. ఇప్పుడు మాత్రము ఈ పత్రమునకు ప్రత్యక్షవిరోధముగా ఒక వర్గమువారికి ప్రభుత్వ యాజమాన్యమున నిర్వహింపబడు పాఠశాలల తలుపులుమూసి ఉన్నారు. పాఠశాలలలో ప్రవేశముకూడ కులతత్వప్రాధాన్యముపైననే ఆధారపడిఉన్నది. ఇండియా ప్రధానమంత్రిగారైన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూగారు ఇండియాయూనియన్‌లో కులతత్వములను రూపుమాపుటకై ఎట్టి కఠినచర్యనైన తీసుకొనుటకు వెనుదీయనని మసూరీలో ఒసగిన ఉపన్యాసమునకు సవాలుచేయుచున్నారా అను రీతిగా చెన్నరాష్ట్ర మంత్రివర్గమువారు జనడిన పరిపాలనా విధానములో ప్రవర్తించుచున్నారు.

పౌరహక్కుల విషయములో కార్యనిర్వాహకవర్గమువారికి ఎంతమాత్రము అధికారమొసగినను వారు దానిని దుర్వినియోగపరచెదరు. ఈ విషయమై సదా పౌరులకును, ప్రభుత్వ అధికారులకును సంఘర్షణము కలుగుచునేఉండును. కార్యనిర్వాహకవర్గమువారు, శాసనసభలు, ప్రజల ప్రాథమికహక్కులకు భంగము కలిగించుచూ ప్రజలను మృగములకన్న తక్కువగా చూచెదరేమో అను భయముతో అమెరికా సంయుక్త రాష్ట్రములోని రాజనీతిజ్ఞులు, దూరదృష్టి కలవారై ప్రజల ప్రధానహక్కులను ఒక్కొక్క దానిని ప్రత్యేకముగా పేర్కొని రాజ్యాంగ విధానములో చేర్చిఉన్నారు. రాజ్యాంగవిధానములో "బిల్ ఆఫ్ రైట్సు" క్రింద ఈ ప్రధాన హక్కులను వారు చేర్చుటతోనే తృప్తిపడలేదు. ప్రభుత్వమువారు కాని (కార్యనిర్వాహకవర్గము వారు, మంత్రివర్గము వారు), శాసనసభలు కాని ఈ హక్కులను అణుమాత్రమైన భంగపరచుటకు అవకాశము లేకుండ శాశ్వత కట్టుదిట్టములను చేసిఉన్నారు.

పౌరుల ప్రాథమిక హక్కులను సవరించుటకు కాని, లేక వానిని అమలులో లేకుండ శాసనములను గావించుటకుగాని శాసనసభలకు అధికారము లేదు. కార్యనిర్వాహక వర్గము వారికి బొత్తిగా అధికారము లేదు. ప్రభుత్వములకు లోనుకాని కేంద్రన్యాయస్థానమునకు ఈ హక్కులను సంరక్షించు బాధ్యత కల్పించి ఉన్నారు. ఒక వ్యక్తి పౌరహక్కులను దుర్వినియోగపరచినాడా, లేదా అని న్యాయస్థానములు విచారించి శిక్షింపవలసియున్న శిక్షింపవలయును. లేని యెడల విడుదలచేయవచ్చును. ఇందులో కార్య నిర్వాహక వర్గమువారికి ఎట్టి ప్రసక్తియూ లేదు. అమెరికావారు అనుసరించిన ఈ విధానము చాల శ్లాఘనీయముగా ఉన్నది.

ఇండియా రాజ్యాంగ చిత్తుచట్టములో మూడవ అధ్యాయము 13 వ సెక్షను 1 వ క్లాజులు.

"ఏ" తమ అభిప్రాయములను వెల్లడించుకొనుటకు ప్రజలు వాక్స్వాతంత్ర్యము కలిగి ఉండవలెను.

"బి" ఆయుధములు లేకుండా ఒక ప్రదేశములో శాంతముగా చేరుటకు పౌరులు హక్కుకలిగి ఉండవలెను.

"సి" సంఘములను కాని లేక యూనియన్‌లను కాని ఏర్పరచుకొను హక్కుకలిగి ఉండవలెను.

"డి" ఇండియా యూనియన్‌లో తమ ఇష్టము వచ్చిన చోటికి స్వేచ్ఛగా పోవుటకు పౌరులు హక్కుకలిగిఉండవలెను.

"ఇ" ఇండియా యూనియన్‌లో ఇష్టము వచ్చినచోట ఉండుటకును, స్థిరనివాస మేర్పరచుకొనుటకును పౌరులకు అధికారముండవలెను.

"యఫ్" ఆస్తిపాస్తులను సంపాదించుకొనుటకును, వానిని విక్రయించుకొనుటకును పౌరులెల్లరికి హక్కు కలదు.

"జి" ఇష్టమువచ్చిన వృత్తిని అవలంబించుటకును, ఇష్టమువచ్చిన వ్యాపారమును చేసుకొనుటకును ప్రతివ్యక్తికిని అధికారముండవలెను.

అని స్పష్టముగా నిర్వచింపబడినది. ఇంతవరకు మాత్రమే చదివినచో ప్రజలకెంతో ఆనందము కలుగును. ఇదే 13 వ సెక్షను 2 వ క్లాజు మొదలు 6 క్లాజు వరకు తెలుపబడిన మినహాయింపులను చదువుచో ఆ ఆనందము అదృశ్యమై నిరాశ జనించును. ఈ నూతన రాజ్యాంగ చిత్తుచట్టము శాసనమై అమలులోనికి వచ్చులోపల దేశములో ఏయే నిర్బంధ శాసనములు అమలులో ఉన్నవో ఆ నిర్బంధ శాసనములకు ఈ ప్రాథమిక హక్కులకు సంబంధించిన 18 వ సెక్షను, 1 వ క్లాజుకి వర్తింపదు. (అనగా ఈ నిర్బంధశాసనములన్నియూ నూతనరాజ్యాంగము అమలులోనికి వచ్చిన తర్వాతకూడ ప్రాణము కలిగి ప్రజల ప్రాథమిక హక్కులను భంగపరచుటకు ఉపయోగపడును). ఈ నూతన రాజ్యాంగ శాసనము అమలులోనికి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వముకాని రాష్ట్రీయ ప్రభుత్వములు కాని దేశరక్షణ మిషపైకాని, ప్రజల శాంతిభద్రతల

(20 వ పేజీ చూడుడు)

కథానిక :



చెన్నపట్టణం మొదటిసారి వచ్చి సముద్రపు కెరటాలకు దగ్గరగా ఇసుకమీద నుంచున్నాడతను ఏదో భ్రాంతిగా చూస్తూను.

ఆగకుండా కెరటాలు ఒడ్డున బ్రద్దలై నురగలు కక్కుతున్నాయి.

ఆ హోరులో అతని కేదో గోచరించింది. ఆహోరుని అర్థంచేసుకుందామని ప్రయత్నిస్తున్నాడతను. ఆ కెరటాల రొదలో తన కందని భావమేదో ఉన్నదని అతను విశ్వసించాడు.

ప్రతిరోజూ ఆ కెరటాలు అలాగే కొట్టుకుంటాయి. ప్రతిరోజూ, ప్రతినిముషం అవి యేదో మాటాడుతున్నట్లే అతనికి తోస్తుంది. ఆ వేళ మూడోసారి, అక్కడే రోజూలాగే నిలబడ్డాడు. ఆ హోరు అతని మనస్సునిండా కమ్ముకుంది. ఆలోచిద్దామని ఉబలాటం. కానియేమీ అంతు దొరకలేదు. ఆ హోరు, అతనిలోకి అంతగా చొరని కొన్ని క్షణాల్లో మామూలుగా అందరిలాగే అనుకొన్నాడు. ఆహోరు ఏదో ఘీంకారమా? కెరటాలు బ్రద్దలుకావడం యేదైనా ఆటయేమో. ఏదో బాధ అయికూండవచ్చు. లేకపోతే యిలా 'మకరి చేజిక్కిన కరి'లా మూలుగుతుందా? ఇంత జాలిగా మొర పెట్టుకుంటుందో? ఏవో బలమైన సంకెళ్లు నోరు నొక్కి వేస్తున్నారేమో! ఆ పెరిగే కెరటం విరిగే కెరటం చావుబ్రతుకులను సూచిస్తాయి కాబోలు!

ఇదేమీ సరిపడలేదు. అసలు మొదటిరోజున తా నక్కడ నిలబడ్డప్పుడు ఆ కెరటాలతో పందెం వేశాడు. తనంటే కెరటాలకి భయం తన దగ్గిరికి రాలేకపోతున్నాయి. అనుకున్నాడు సగర్వంగా. మరుక్షణంలో యింకోలా తోచింది. తనేదో పాపం చేసినవాడేమో! దుష్టసహవాసం చేయడాని కవి వెరుస్తున్నాయేమో! కాని ఇంతలోనే కెరటం ఒడ్డుపైదాకా తుడిచి వేసింది. పంచెకుచ్చిళ్లు జానెడెత్తుకు తడిసిపోయాయి. పాము పడగను చూచినట్లు కెరటం పాకింది. మళ్ళీ కేరింతాలకోట్లే నూత్న వధువు సిగ్గుపడ్డట్లు మెల్లగా దిగజారిపోయింది.

వచ్చింది కెరటం. సముద్రానికి తనంటే భయం లేదు. తనతో నేస్తంకూడా చేస్తోంది. ఇట్లా అనుకోడం చాలా ఉత్సాహాన్నిచ్చింది కాని తాను చిన్నపిల్లాడు కాదనిజ్ఞాపకం వచ్చి చటుక్కున సముద్రం దగ్గరనుంచి దూరంగా వచ్చేశాడు.

తరువాత రోజున ఒడ్డుపైన కూర్చున్నాడు కెరటాన్ని తనదగ్గరికి రమ్మని సవాలుచేసినట్లుగా ఎలాగా రాదని తెలిసికూడా. కాని కెరటం గట్టుమీదికి పొర్లింది. తను లేవదల్చుకోలేదు. కెరటంయొక్క అనురాగాన్ని సాదరంగా అందుకొన్నట్లుగా అతనికి అనుభూతి కలిగింది. కెరటం పొంగడానికి చంద్రుడు కారణమేమోనని అత డనుకోలేదు.

గోస్తనీ, గోదావరీ, గంగా, అంతర్వేది సాగర సంగమం, ఏవేవో జ్ఞాపకం వొస్తున్నాయి తా నిదివరలో చూచిన జలదృశ్యాలు. అనుకోకుండానే అతడి తలపులు మారాయి. యీ జల సంతతులలోనుంచి తన జీవితా న్నప్పుడు నెమరు వేసుకుంటున్నాడు. సముద్రపు హోరు ఎక్కడో అడుగున దాగిపోయింది. తన్ను పరిచిన ఆ కీర్తిలో ఒక కలంగాగా గాలికెరటంలో తన జీవితం మెదులుతోంది. కాని అప్పటికి ఆ కల మాత్రమే ప్రత్యక్షమైన నిజం. ప్రపంచం కళ్ల తను గొప్పవాడు కాదు. కొద్దివాడూ కాదు. అసలు గొప్పవాళ్లూ కొద్దివాళ్లూ అనేవారు లేరు. ఊరికే కల్పించబడ్డారు. అలా కల్పించుకోవాలంటె తాను ఏ పక్షంలోనైనా చేరవచ్చు. ఇలా ఆలోచించడానికి కారణమతని మనస్సితే! ఆ క్షణంలో, ఒకరికొకరికి సంబంధాలూ, పోలికలూ, తారతమ్యాలూ ఉంటాయని అతడు ఒప్పుకోలేదు. తనూ అందరిలాగే పుట్టాడు, అందరూ తనలాగే పుట్టినట్లు. అలాగే పెరిగేడు మాట్లాడుతున్నాడు. చదువుతున్నాడు. వ్రాస్తున్నాడు.

ఎందులోనూ ప్రత్యేకత లేదు. ఎవరిలోనూ ప్రత్యేకతలేదు. పత్రిక లచ్చుపడుతున్నాయి కెరటాలు కొట్టుకుంటున్నట్టే. కెరటాల్లాగే మనుషులూనూ. అన్నీనూ, కెరటాల్లో ప్రత్యేకత లున్నాయా? తప్పొప్పుల కర్థ మేమిటి? కెరటాల్లో ఎత్తుపల్లాల కర్థమేమి? పెద్దకెరటం గొప్పదా? చిన్నకెరటం గొప్పదా? సముద్రుడు చెలియకట్టని ముట్టుకోడట. నేను ముట్టుకున్నానా? ముట్టుకోగలనా? సముద్రుడు ముట్టుకోగలడా? ముట్టకోగలిగితే ముట్టుకుంటే ఎవ రాపగలరు? ఆపడంవల్ల ప్రయోజనం? సముద్రుడికీ, నాకూ, ప్రపంచానికీ ధర్మపరు లన్న కీర్తిరావాలి గాబోలు. నాకీ కీర్తిమీదగాని, నామీదగాని, ప్రపంచంమీదగాని అంత గౌరవం లేదు. వాటికోసం పాటుబడడంలో నమ్మకం లేదు. నేను సముద్రమంత గొప్పవాణ్ణి. అంత నిర్జీవిని. అంత హోరు పెడుతున్నాను. అంత విశాలమైన లోతైనవాణ్ణి. నేను సముద్రాన్ని. ప్రపంచంకూడా సముద్రమే! అప్పుడు మనుషులూ, గుట్టలూ, పక్షులూ ఒక మాదిరి కెరటాలు!

2

గౌరి వాళ్ళన్నతో చెబుతోంది.

సుబ్బారావుగారి కుటుంబం పదేళ్లనుంచి మా యింటిప్రక్క నుంటున్నారు. నేను కాపరానికెళ్లిన కొత్తలో అతను పన్నెండు పదమూడేళ్ళవాడు. స్కూల్లో చదువుకుంటూ ఉండేవాడు. మా ఇంటికి రోజూ వచ్చి, భోజనంమాటకూడా మరచిపోయి, కాశీమజిలీలు చదువుతూ ఉండేవాడు. మంచంపక్కని కూర్చుని పుస్తకం పట్టుకున్న కుడిచెయ్యి మంచంమీద వేసి అదే పనిగా చదివేవాడు. వెంకటపార్వతీశ్వరకవుల 'శ్యామల' నవల ప్రొద్దున్న మొదలెట్టి సాయంత్రం పూర్తిచేసిందాకా వాళ్లక్క ఎన్నిసార్లు పిల్చినా కదల్లేదు. నేనే పాలవిరుగుడిలో బెల్లంవేసి పెట్టాను. అమాయకంగా రెండు పాటలు పాడి వెళ్లిపోయాడు.

ఒకరోజున యేదో పేరంటానికి వెడుతున్నానుమా తోటి కోడల్తో కలసి. బజారులో కిళ్ళీకొట్టుదగ్గరనుంచుని గ్రామఫోను వింటున్నాడతను మధ్యాహ్నం రెండుగంటలకి. తిరుగుతూ ఉండేవాడు రోజల్లా. స్నేహితు లిళ్లు చుట్టపెట్టి రాత్రి ఏడింటికి వస్తూ గుమ్మందగ్గరనుంచే గొంతెత్తి పాడుతూ తలుపుదగ్గర కొచ్చేవాడు. తలుపుకొట్టకం, తీయమని పిలవడం యెప్పుడూ యెరుగ డతను.

రెండుమూడేళ్ల తరువాత కాలేజీ చదువులకి వెళ్లిపోయాడు మామూలుగా శలవుల కింటికి వస్తూ ఉండేవాడు. ఇప్పటికింకా అతనిలో యేమీ మార్పు లేదు. తను పెద్దవాడైనట్టు గుర్తించిన పరిణామం అతనిలో కనబడదు. ఇదివరకులాగే చనువుగా మాట్లాడతాడు. పాడుతూనే ఉన్నాడు. చదువుతూనే ఉన్నాడు. ఇప్పటికీ అతనిలో సంతోషంగాని విచారంగాని ఉప్పెనలాగా ఉబుకుతూనే ఉంటాయి.

ఈమధ్య ఒక మార్పే అతనిలో చూచాను. ఆరునెలల క్రితం అతను వచ్చినప్పుడు ఇక్కడ ఉన్న రెండు నెలల్లోనూ అతనిలో చాలా మార్పు వచ్చింది. అతని ఒంటికి సంబంధించని నలుపు అతనిచుట్టూ ఉంటోంది. అత నేదో మూగబాధని అనుభవిస్తున్నట్లు కనిపిస్తుంది.

అతని బాధకు కారణా లనుకొంటున్నవి కొన్నిఉన్నా అవి నేను చెప్పదల్చుకోలేదు. నేను చెప్పదల్చుకున్నది ఇదీ. ఇదివరకు తన అక్కయెడల అంత ప్రేమ ఉన్నదని అతడు గుర్తించలేదు. ఆవిడకూడా ఇదివరకు తానంతగా తన తమ్ముణ్ని ప్రేమించిందని యెరుగదు. అతన్ని చూచి వాళ్లక్క ఎంతో సంతోషపడేది. అక్క చెప్పిన మాటలు అంటే అతనికి భగవద్గీతలా ఉండేవి. వాళ్లిద్దరిలోనూ ఒకేరకమైన అభిప్రాయాలూ, శక్తులూ, ఆత్మలూ ఉండేవి. అతని మాటలు విని వాళ్ళక్క అనుకొని పొరపాటు పడేవాళ్లు చాలామంది ఉన్నారు. ఈనాటికి వాళ్ళకి ఒక విభేదం వచ్చింది. ఆ విభేదంవల్ల విడిపోవలసి వస్తుందేమో నన్నంత భయం. విడిపోవడాన్ని తల్చుకుంటే వాళ్ల మనస్సులు తరుక్కుపోతున్నాయి. ఆభేదంనుంచీ విడిపడగల మార్గం వాళ్లకి దొరకడంలేదు. అందుచేతనే ఈనాడు వారిరువురిలోనూ లోపల ఇంత సంఘర్షణ గోచరించింది.

అయితే ఇంతవరకూ వాళ్లక్కనుగూర్చి చెప్పలేదు. అతనిలోగాని వాళ్ళక్కలోగాని వాళ్ళ కుటుంబములోగాని మంచితనంకన్న చెప్పుకోదగ్గ దేమీలేదు. కాని అది చాలును ఈ విషయంయొక్క ప్రాధాన్యతకి. వాళ్లంత జనరంజకంగా ఉండేవారు. అందరితోనూ అంత చక్కగా కలిసేవారు. ఆవిడ మొదటినుంచీ లోకజ్ఞానం అనేది కలిగిన వ్యక్తి. చిన్నతనంలో తెలుగునాటి కళలనీ సాహిత్యాన్నీ తగుపాటిగా తనలో అలవరించుకొన్నది. తనకి మంచిది అని తోచినదానిని ఆచరించడంలోగాని, ఆ ఆదర్శంలో నలుగురికీ అభిరుచి కలిగించడంలోగాని పట్టూపంలేని ప్రయత్నాల నావిడ జరుపుతూనే ఉండేది. పిల్లలను సాదరంగా చేరదీసి వాళ్ల వ్యక్తిత్వానికి వన్నెలు దిద్దుతుంది. పెద్దల పెద్దరికాన్ని గుర్తిస్తుంది. శక్తివంచన లేకుండా లోకక్షేమకరమైనటువంటిన్నీ జనోపయోగకరములైనటువంటిన్నీ కార్యాలకు పాటుబడుతుంది. ఏ వ్యక్తినీ పొగడరాదేమోగాని ఆవిడని గూర్చి మంచిగా చెప్పకతప్పదు. స్త్రీలలో చదువుకున్నవా రున్నారేమోగాని, ఆవిడకున్న సుజ్ఞానం కలవా రరుదు. ఇది నా ఒక్కతె అభిప్రాయమే గాదు. యీ చుట్టుపట్ల యెవరినైనా అడుగు. నీకు వాళ్ళదే చెప్తారు. అటువంటి వ్యక్తి, లోకశ్రేయస్సుని కోరే, రాట్నం తిప్పుకుంటూ కోరిక లెరుగకుండా బ్రతికే యోగిని, ఆవిడ వ్యతిరేకించిందంటే విశిష్టమైన కారణం ఉండితీరాలి. లోకం ఆవిడని కాదని యెప్పటికీ అతనికి సహాయపడజాలదు. భగవంతుడు కూడా ఆవిడ చెప్పినట్టే నడుస్తాడేమో అనిపిస్తుంది.

కాని జనం అతనియెడకూడా సానుభూతి చూపకుండా ఉండలేకపోతున్నారు. వాళ్లక్క కూడా అతనికి సానుభూతి చూపుతూనే ఉంది. ఆ సానుభూతివల్లనే అతన్ని జయించి, తన వైపుకి లాగుకొంటుందేమో. అయినా అతడూ పెనగులాడుతున్నాడు—తను చేయాలనుకున్నది చేద్దామనీ, అక్కనే తనవైపుకి తిప్పుకుందామనీను. ఇంతవరకూ అన్నలతో, అమ్మతో నాన్నగారితో వివాదాలొచ్చినప్పుడు తనూ, తన అక్కా ఒకప్రక్కన ఉండేవారు తనవైపుకి వా.రందరినీ యెప్పుడైనా తిప్పుకోగలడు. కాని అక్క ఆశీర్వాదమే కొరవడితే అతడు అడుగు వెయ్యలేడు. అతను మథనపడుతున్నాడు. ఇక్కడ ఈవిడ బాధ పడుతోంది. ఒకరికొకరు నచ్చచెప్పుకుందామని ప్రయత్నం. కాని యేమీ కొనసాగలేదు.

3

గౌరిఅన్న చదువుతున్నాడు మిత్రుడు వ్రాసిన ఉత్తరం :

మూడు నెలల క్రితం అతనిని నేను మొదటిసారి చూచాను. ఫుట్ బాల్ గ్రౌండులోనుంచి వస్తున్నాడు, నేను కాలేజీకి వెడుతున్నాను. వేళ్లు ముడుస్తూ తెరుస్తూ ఒకటీ రెండూ మూడూ లెక్క పెడుతున్నాడు. ఇంతల్లోకే ముప్పై అయిదు పేలన్నాడు. నేను అతనికేసి చూచాను. చటుక్కున అతనిముఖకవళికలు మారిపోయాయి. ఏమీ యెరగనట్టు నడచిపోయాడతను నాకు ఆశ్చర్యంవేసింది. మూడు రోజు లైనతరువాత అతనూ నేనూ హోటలులో ప్రక్కప్రక్కను కూర్చుని భోజనం చేశాం. నేను పలకరించబోయానుగాని, అతను గబగబా తినేసి లేచిపోయాడు. ఒకరోజున నదిఒడ్డున యెవరో పాడుకున్నారు. చుట్టూ అయిదారుగురు స్నేహితులు కూర్చుని ఉన్నారు. పాట ముగించి అతను సంభాషణలో పడ్డాడు అతి తేలికగా మాటలు ప్రయోగిస్తున్నాడు. మాటలకి అర్థమేమీ ఉండదన్నట్లు. మాటలు అవిసంగా వాడబడటం చాలా అరుదుగా వింటాం. లెక్కలలో అతనొక నిధి అని నా నమ్మకం. అతడి లెక్కలలో అంకెలూ గుర్తులూ ఉండవు. అతడి భావాలే అతని లెక్కలు. అతను లెక్కలు నేర్చుకుంటే, Theory of relativity ని మాటల్లోకి మార్చగలడేమో ననిపిస్తుంది. అతని మాటలు ప్రస్తుతానికి Theory of relativity లా ఉన్నాయి అన్నాడు రమణమూర్తి. కాని ఆ మాటలు యెందుకో అర్థమవుతూ ఉన్నట్లుగా ఉంటాయి. అతని చుట్టూ ఉన్న స్నేహితులకి అతని మాటలు కొత్తగా సరదాగా కనిపించాయి కాబోలు. తెలివితక్కువగా, ఉత్సాహంగా నవ్వుతూ ఉన్నాయి వాళ్ల ముఖాలు.

వాళ్లు లేచారు. వెనకనే నేనూ నడుస్తున్నాను. వాళ్లలో ఉన్న మా రామం నన్ను చూచి పలకరించాడు. మేం నడుస్తుంటే అతను వెనకబడిపోయాడు. మేం ఆగాం. అతను మెల్లిగా ముందుకి నడచిపోయాడు. రామం నన్నడిగాడు —అత న్నెరుగుదువా? అని. యెరగనన్నాను. అతన్ని పిలిసి మా యిద్దర్నీ ఒకరి కొకరికి పరిచయం చేశాడు. తరువాత పదిహేనురోజుల్లో మా యిద్దరికీ చిరస్థాయియైన స్నేహం యేర్పడ్డానికి తగినంత యెక్కువగా మాట్లాడుకొన్నాం.


అతను చాలా అనవసరమైన భావాలు గలవాడు. అనవసరంగా మాట్లాడుతాడు. వ్యక్తి ఒక్కడే అయినా నూరుమంది స్వభావాలు అతడిలో ద్యోతకమౌతాయి. కాని యెందుకో ఆ వైవిధ్యం వెనక ఆ నీటిమాటలవెనక, వ్యాప్తమయ్యే అవిచ్ఛిన్నమైన ఏకత్వం అతనిలో ఉందని నాకు తోస్తుంది.

అతని పుస్తకాల్లో ఒక కాగితం ఉంది.

ఎవరో అన్నారు. 'మీ యెత్తెంత?' 'అయిదడుగుల నాలుగంగుళాలు'. 'ఇంకొక్క అంగుళం ఉంటే మీకు అయిదువేలమంది భార్యలు ఉందురు.' 'నేను నిటారుగా నుంచుంటే నాయెత్తు మరొక అంగుళం ఉంటుంది'. 'మరి అంగుళం తక్కువ చెప్పారెందుకు?' నాకొలత తీసుకునేప్పుడు 5 4 అంగుళాలకంటే ఎక్కువ ఉండకుండా నేను ప్రయత్నించాను'. 'పైఅంగుళాన్ని గూడా మీరెందుకు వినియోగించుకోరాదు?' 'నాకు కావలసింది నాకు లభ్యంకావడం నాకు ఇష్టంలేదు.'

ఈ వ్రాసినదానిచుట్టూ ఒక సున్న ఉంది. అందులో పెద్ద అక్షరాలతో అబద్ధం అని వ్రాసి

(20 వ పేజీ చూడుడు)



క్లాసు జరిగేముందు పిల్లలు స్కూలు పాఠాలు, చదువుకొనేందుకు, తయారయేందుకూ, అనువుగా ఉన్న పెద్దపెద్ద లైబ్రరీహాలులలో ఒకటి.




ఫిజిక్సు లేబరేటరీలో విద్యార్థులు స్వయంగా శాస్త్రప్రయోగాలు నేర్చుకొంటూన్న దృశ్యం.

అమెరికన్ పాఠశాలలలో


అమెరికా సంయుక్తరాష్ట్రాలలో దాదాపు 70 లక్షలమంది విద్యార్థులు పబ్లిక్ పాఠశాలలలో చదువుకొంటున్నారు. వీరి వయస్సు 14 నుంచి 18 సంవత్సరాలవరకు వుంటుంది. వీరిలో కొంతమంది కళాశాలలో ప్రవేశార్హత పొందటానికి చదువుకుంటారు. మరికొందరు ఏదో వృత్తిలో ప్రవేశించటానికో లేక గృహనిర్వహణకో తగిన విద్య అభ్యసిస్తుంటారు. మనం హైస్కూల్లు అనేవాటినే అమెరికాలో పబ్లిక్ స్కూల్లు అంటారు. ఈ పాఠశాలలలో అనేక విద్యాబోధన పద్ధతులద్వారాను, ఆయా ప్రదేశాలకు పిల్లలను తీసుకువెళ్ళి ప్రత్యక్ష బోధన చేయుటద్వారాను, సినిమా, రేడియోలద్వారాను వారివారికి తగినట్లుగా విద్య బోధిస్తుంటారు

అమెరికా ప్రచురించే గ్రంథాలలో బాలుర బొమ్మపుస్తకాల ప్రకటన అతిముఖ్యమైనదీ, అతి విరివిగా సాగుతున్నదీ కూడ.





న్యూయార్కు పట్టణానికి 25 మైళ్ళదూరంలో వున్న స్కార్స్‌డేల్ పట్టణంలోని స్కార్స్‌డేల్ హైస్కూల్‌లో చదువుతున్న ఐజెక్ మిట్టెక్ స్టుఆర్టును అమెరికన్ విద్యార్థులకు నమూనాగా తీసుకొనవచ్చును. ఇతని వయస్సు 17 ఏండ్లు. సహోధ్యాయులు ఇతనిని 'ఐక్' అని పిలుస్తుంటారు. చదువులో ఇతడు ఏవరేజ్ రకపు విద్యార్థికంటె చాల మెరుగే. హైస్కూల్ చదువైపోయినతర్వాత కార్నెల్ విశ్వవిద్యాలయమునకు చెందిన, ఇతాకా పట్టణంలోని 'న్యూయార్క్ స్టేట్ స్కూల్ ఆఫ్ ఎగ్రికల్చర్'లో చేరి పట్టం పొంది, అటుతర్వాత ఆధునిక వ్యవసాయదారుడు కావాలని ఇతను ఆకాంక్షిస్తున్నాడు. చిన్నప్పటినుండికూడ, వేసవి సెలవలలో పశ్చిమ అమెరికాలోని పచ్చిక బీళ్ళప్రాంతాలకు వెళ్లి ట్రాక్టర్లు నడపటము, గోతులు త్రవ్వటము, గొడ్లకు సుద్దులు వేయటము మొదలగు పనులలో ఇతడు సహాయపడుతుండేవాడు.

ఇతడిప్పుడు 'సీనియర్' క్లాసులో చదువుతున్నాడు. ఇతర తరగతులలోకన్న ఇందులో 'బడి-చదువు' తక్కువ. 'సీనియర్' తరగతిలోని పిల్లలు తమతమ ప్రత్యేక వృత్తి విద్య బాగా చదివి, కళాశాలకుగాని, వృత్తిలోనికిగాని పోవటానికి వీలుగా వుండేట్లు వీరికి ఎక్కువ విశ్రాంతికాలం వుంచుతారు. మన 'ఐక్' పాఠశాలలో ప్రతిరోజూ 4 పిరియడ్లు



"స్కార్స్‌డేల్" హైస్కూలు ముఖద్వారం. సాయంత్రం స్కూలు వదలాక బడిపిల్లలు బైటికి వస్తున్న దృశ్యం.





దేశ, ప్రస్తుత, చారిత్రాత్మక, పరిస్థితులను ఎప్పటికప్పుడు, చర్చలు సాగించుకొని, విషయనిర్ణయం చేసుకొనేందుకు విద్యార్థిసంఘాలు స్కూళ్లలోనే ఇల్లా పనిచేస్తాయి.



స్కూలులో సైకిళ్ళస్టాండు. స్కూలులో చాలామంది పిల్లలు బైసికిళ్ల మీదే స్కూలుకు వస్తూంటారు.

విద్యార్థి జీవితము



పరుగుపందెల పోటీలు; ఆటలకు అమెరికన్ విద్యాలయాలు ఇచ్చే ప్రాముఖ్యము కొత్తగా చెప్ప నవసరం లేదు.

విద్యార్థినులు సామాన్యముగా 'గృహనిర్వహణ' విద్య నభ్యసిస్తారు. ఈ తరగతులలో ఆహారము, వస్త్రములు, పిల్లల పోషణ మొదలగు వానిని గురించిగాని స్టేజి, ఫ్యాషన్, వ్యాపార అలంకరణలను గురించిగాని బోధిస్తారు.


స్కార్స్‌డేల్ పాఠశాలకు చుట్టుప్రక్కల ఆరు మైళ్ళనుండి విద్యార్థులు వస్తారు. విద్యార్థుల సంఖ్య దాదాపు 1,200 వుంటుంది. జూనియర్ తరగతులలోను, సీనియర్ తరగతులలోను విద్యార్థులు దాదాపు సమానంగానే వుంటారు.

హాజరవాలి. ఒక్కొక్క పీరియడు 45 నిమిషాల సేపు వుంటుంది. ఆతర్వాత అతడు కాలేజీ పుస్తకభాండాగారంలో చదువుకుంటూనో, 'హోమ్-వర్క్' చేస్తూనో కాలం గడిపేస్తాడు. పాఠశాలలోని 'విద్యార్థి ప్రభుత్వం'లోను, 'సోషల్ ప్లానింగ్ బోర్డు'లోను అతను సభ్యుడు. ఈ బోర్డు యాజమాన్యాన ఇతరుల ఉపన్యాసాలు, పాటకచ్చేరీలు, నాట్యాలు మొదలైన ఇతర సామాజిక కార్యాలు జరుగుకుంటాయి. వీటన్నింటినీ విద్యార్థులే నిర్ణయించి, తమ యాజమాన్యాననే జరుపుకుంటారు. ఉపాధ్యాయులు కేవలం సలహాదారులుగా మాత్రమే వుంటారు. పాఠశాలలోని 'రైఫిల్ క్లబ్'లో కూడా అతడు సభ్యుడు. ఈ పాఠశాల 24 ఎకరాల ఆవరణలో వుంది. ఈ ఆవరణలో బేస్ బాల్ కోర్టు, ఫుట్ బాల్ కోర్టు, రెండు హాకీ కోర్టులు, ఒక పావుమైలు పరుగు సౌకర్యము వున్నాయి.

యునైటెడ్ స్టేట్స్‌లోని 25,600 హైస్కూళ్ళలోని బోధనాసౌకర్యములు స్కార్స్‌డేల్ హైస్కూల్‌లోని వానివలెనే ఉండును. ఈ పాఠశాలలో 65 గురు ఉపాధ్యాయులున్నారు. వీరు గణితము, చరిత్ర, పదార్థవిజ్ఞానశాస్త్రము, వాఙ్మయము, ప్రాచీనభాషలు, విదేశీభాషలు మొదలగు విషయములను బోధిస్తారు. వర్తక వ్యాపారాదులలోనికి వెళ్ళదలచుకున్న విద్యార్థులకు, పాఠశాలలో 'వాణిజ్యవిద్య' బోధిస్తారు. ఇందులో వర్తక విధానము, వర్తక న్యాయశాస్త్రము, అర్థికశాస్త్రము, వర్తకపు లెక్కలు, స్టెనోగ్రఫీ, టైపింగ్ మొదలగు విషయములు బోధిస్తారు. పారిశ్రామిక కళల నభ్యసింపదలచువారికి మెకానికల్-డ్రాయింగ్, ఇంజన్ నడుపుట, కొయ్య, లోహపు పనిముట్లు చేయుట బోధింపబడును.



పిల్లల పుస్తకాలకు అమెరికన్ విద్యాశాలలు అమితమైన ప్రాముఖ్యమిచ్చి, ఆవిషయంలో చాలా జాగ్రత్త తీసికొంటాయి.





అల్లీబిల్లీ లోకంలో అమ్మాయికథ

'ఆలిస్ ఇన్ ది వండర్లాండు'
రచన:
లూయీ కెరోల్

3

అనుకరణం :
"ఆప్లవాన్"

తోటనిండా రంగురంగుల్ల కాయలూ, పువ్వులూ కాస్తున్న చెట్లూ, మొక్కలూ, చల్లదన మిస్తూ నీళ్ళ తుంపురులు వెదజల్లుతూన్న నీటి బుగ్గలూ, అన్నీ చక్కగా ఉన్నయి.

తోట ప్రవేశిస్తూండగా మొదట్లోనే ఒక తెల్లగులాబీ చెట్టు ఉంది. ఆ చెట్టుకు దగ్గిరగా ముగ్గురు తోటమాలులు, కుంచెలు, ఎఱ్ఱరంగు డబ్బాలూ పుచ్చుకొని, తెల్లగులాబీ పువ్వులన్నిటికీ ఎఱ్ఱ రంగు పూస్తున్నారు. పాపకు గమ్మత్తుగా తోచి వాళ్ళకు కొంచెం దగ్గిరగా వెళ్ళింది. వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకొంటూన్న మాటలు పాపకు వినబడుతున్నాయి.

"ఒరేయి, ఐదుగా, కాస్త చూసి రంగు వెయ్యలేవూ? నా వంటినిండా రంగు చిలకరిస్తున్నావు".

ఐదుగాడు మొహంమాడ్పుగా, "నే నేం చేసేది? ఈ ఏడుగాడు నా మోచేయి తోసేశాడు."

ఏడుగాడు మొహంఎత్తి, "అదేరా బాబూ, అదే! అన్నిటికీ తప్పులన్నీ ఇంకోళ్ళనెత్తిని తొయ్యటమేగా నీ పని" అన్నాడు.

"నోరు ముయ్యవోయి, నిన్న రాణిగారు నీ తల కొట్టేయమంటోంటే నే విన్నాలే" అన్నాడు ఐదుగాడు.

"తల ఎందుకు కొట్టెయ్యమందీ?" అంటూ మొదటివాడు అడిగాడు.

"ఒరేయి! రెండుగా! నీ కదంతా అనవసరం; ఊర్కో" అని ఏడుగాడు ఉరిమాడు.

"అనవసర మేమిటి? అనవసరం ఏం కాదు. వాడికి అవసరమే. నే చెప్తా వినరా! నిన్న వంటలక్క ఉల్లికోళ్ళు తెమ్మంటే, వీడు తుంగవేళ్ళు తీసుకెళ్ళాడు -" అంటూ ఐదుగాడు జవాబు చెప్పాడు.

ఏడుగాడు కోపంతో కుంచె, డబ్బా కూడా నేల నేసి కొట్టి అరుస్తూ "ఇల్లాంటి అవక తవక వాగుడు వాగితేనే— అంటూ ఏదో అనబోయి, చటుక్కున పాపను చూసి ఆపేశాడు. తక్కిన ఇద్దరూకూడా, వాడు మాట ఆపేటప్పటికి, తల ఎత్తి పాపవంక చూసి, నిర్ఘాంతపోయినట్టుగా ఏడుగాడితో కూడా కలిసి పాపకు సలాం చేస్తూ ముందుకు వంగారు.

పాప భయంభయంగానే, అతి నెమ్మదిగా, "ఈ గులాబిపూవులకు ఎఱ్ఱరంగు ఎందకు వేస్తున్నారో కాస్త చెబుతారా?" అని అడిగింది.

ఏడుగాడు, ఐదుగాడు మాట్లాడకుండా రెండుగాడివైపు చూశారు. రెండు నెమ్మదిగా సన్నకంఠంలో చెప్పటం మొదలుపెట్టాడు:

"అసలు సంగతేమి టంటేనండీ, ఇక్కడ అసలు ఎఱ్ఱగులాబీ చెట్టు పాతి ఉండవలసి ఉందండీ! మేము పొరపాటున ఇక్కడ తెల్లగులాబీ చెట్టు వేశాము. ఈ సంగతి రాణీగారికి తెలిస్తే, వెంటనే మా తల కాయి కొట్టేస్తుందిగా. అందుచేత ఆమె ఇల్లా వచ్చేలోపలే, ఈ గులాబీపువ్వు లన్నిటికీ ఎఱ్ఱరంగు వేస్తున్నాం".

అంతవరకూ తోటగుమ్మంకేసి, ఆదుర్దాగా చూస్తున్న ఐదుగాడు అడవిడిగా—"రాణిగార్రోయ్! రాణిగారు!" అంటూ ఒక్కకేక వేశాడు. గబాలున ముగ్గురు తోటమాలులూ బోర్లబుక్కలుగా నేలమీద పడుకొన్నారు. వాళ్ళవీపులన్నీ ఒక మాదిరిగా నలుచదరపు పేకముక్కల లాగా వెనుక ఒకేమాదిరి అల్లికగీతలతో ఉన్నాయి. తలా, కాళ్ళూ, చేతులూ



బాల

కథా గేయం :



ఆణి ముత్యం

'ప్రసాదరావు'

౧౨

"వలదన్న వెడలినాడోయ్-
నా స్వామి
కలడో, లేడో, తెలుపవా-
ఓ యప్ప,
కరుణ సంద్రుడ వంద్రు గాదా-
కడలీ,
వరుని వైనము తెల్పవా!- 1

నీవలెనె గంభీరుడూ-
నా యాణి,
నీ వలెనె ఆర్ద్రి మూర్తీ-
నా స్వామి
పౌరుషము నిన్నుబోలూ-
ఇల్విడిచి,
ఉరవడుచు తరలినాడూ- 2

ఎరుగవో! ఆణి నీవూ-
చిననాటి,
పరమమిత్రుడు కాడో! నీకూ—
చిననాడు,
చెంగున్న ఆణి రాగా-
తరగల్ల
పొంగిపో రిద్ద రెటులూ! 3

ఇట నిటనె యాడుకొనుచూ-
జంటగా,
ఇట నిటనె పాడుకొన్నా-
మిర్వురము ;
ఇట నేడ్చుచుంటి నొంటీ-
నా యాణి
ఎట గలడో తెలుపు తండ్రీ!" 4

ఒకటే అవొచ్చు—" అన్నాడు వెంగళప్ప.

"'నాకు కావాలసిందల్లా తెచ్చుకొంటాను'అన్నా 'నాకు తెచ్చుకొన్నదల్లా కావాలి' అన్నా ఒకటే అవవచ్చు గాబోలు" అని కుందేలు అందుకొంది.

వెల్లఎలుక "'నేను నిద్రపోతూన్నప్పుడల్లా ఊపిరి పీలుస్తాను' అన్నా, 'ఊపిరి పీలుస్తూన్నప్పుడల్లా నిద్రపోతాను' అన్నా ఒకటిగాబోలు!" అంటూ నిద్రలో మాట్లాడుతున్నట్లుగా అంది.

"నీ విషయంలో రెండూ ఒకటే" అన్నాడు వెంగళాయి.

మళ్ళీ కాసేపు ఎవళ్ళూ మాట్లాడకుండా కూర్చున్నారు. ఆస్తే అంటే ఏమిటో, ఊస్తే అంటే ఏమిటో—అని పొడుపుకథవిషయం పాప ఆలోచిస్తూ కూర్చుంది. కాని ఎంత సేపటికీ ఏమిటో అర్థమే తట్టలేదు.

మళ్ళీ వెంగళాయే మాట్లాడటం మొదలుపెట్టాడు. పాపవంక తిరిగి "ఇవాళ తారీఖెంత?" అని అడిగి, జేబులోంచి ఒక జేబుగడియారం తీసి దానివంకచూస్తూ మాటిమాటికి చెవికి దగ్గిర పెట్టుకొని, గడియారం గట్టిగా కదుపుతూ, మళ్ళీ చూస్తూ, గడియారాన్ని కదుపుతూన్నాడు.

పాప కాసేపు ఆలోచించి. "ఏడోతారీఖు" అంది.

"అప్పుడే రెండు రోజులు తప్పింది" అని వెంగళాయి ఒక నిట్టూర్పు విడిచాడు. మళ్ళీ కోపంతో కుందేలు వంక తిరిగి, "వెన్నతో గడియారం బాగు చేయకూడదని నీతో చెప్పలా'" అని కోప్పడ్డాడు.

"మంచి వెన్నే మరి" అని కుందేలు, నసుగుతూ సమాధానం చెప్పింది.

"మంచిదైతేమటుకు, ఆ చాకుతో పట్టించావామెను; చాకుకు అంటుకుని, రొట్టితునకలు అవీ ఉండి ఉంటాయామెను." అంటూ వెంగళాయి, మొగం మాడ్చుగా అన్నాడు.

కుందేలు గడియారాన్ని తీసుకొని దానివంక మొహం చిట్లిస్తూ చూస్తూ, టీ కప్పులో ముంచింది. "మంచి వెన్నే నే—నీకూ్కడా తెలుసుగా ?" అంటూ ఇందాకటి మాటే మళ్ళీ సాగించింది.

పాప కుందేలుబుజాల గామీదు వంగి గడియారంవంకే చూడటం మొదలెట్టింది:

"బలే గమ్మత్తు గడియారమే నే! నెలలో తారీఖెంతో చూపిస్తూంది గాని, ఇప్పుడు గంట ఎంతయిందో చెప్పదేం ?"

"ఎందుకు చెప్పాలి? ఇదేం సంవత్సరమో నీ గడియారాలుమాత్రం చెప్తాయా?"

"ఎందుకు చెప్తాయ్? ఎప్పటికీ చెప్పవు. సంవత్సర మంటే ఎంతకాలం దాకానో ఒకటిగానే ఉంటుందామెను" అని పాప వెంటనే జవాబు చెప్పింది.

"నా గడియారంవిషయమూ అంతే" అన్నాడు వెంగళాయి.

వెంగళాయి మాట్లాడింది తెలుగే అయినా పాపకు ఏమీ అర్థమయినట్టే అనిపించలేదు. అతి మర్యాదగా "నాకు సరిగ్గా అర్థంకాలేదు" అంది.

"వెల్లఎలుక అప్పుడే నిద్రపోయినట్లుంది" అంటూ వెంగళాయి ఎలుక ముక్కుమీద 'టీ' పొయ్యటం మొదలుపెట్టాడు.

ఎలుక హడావిడిగా తల విదిలించుకొంటూ కళ్ళు తెరవకుండానే, "ఔనౌను, నిజం; నిజం, నేనూ అదే చెబ్దా మనుకొంటున్నాను" అంది.

"కట్టుకథ ఇప్పటికైనా విప్పావా?" అంటూ వెంగళాయి పాపను అడిగాడు.

"లేదు. నాకు తెలియటం లేదు. ఏమిటో చెప్ప" అంటూ పాప అడిగింది.

"నాకు తెలియనే తెలియదు" అన్నాడు వెంగళాయ్.

"నాకూ అంతే" అంది కుందేలు. పాప విసుగుతో ఒక నిట్టూర్పు విడిచింది. "ఇల్లా తెలియని ప్రశ్నలతో కాలం వృథా చెయడం కన్నా దాన్నింతకన్నా బాగా వినియోగించుకోటం నయం" అంది.

"నీకు 'కాలంతో' నా కున్న పరిచయమే ఉండి ఉంటే 'దాన్ని,' 'అది' అనవు. 'వాడు' అనాలి. కాలం పురుషుడు."

"నువ్వనేదేమిటో నా కర్థం కాలేదు" అంది పాప.

"అర్థం కాదులే! అవటం ఎందుకూ? నువ్వు కాలాన్నెరుగనే ఎరుగవు" అన్నాడు వెంగళాయ్.

పాప విసుగుగా "వెధవకాలం ఎమిటీ వెఱ్ఱిగోడవ; పోదూ—" అంది.

"అదుగో అందుకే నీకు కాలంఅంటే పడదు — కాస్త మంచి మాట చేసికొంటే, కాలం మనకు కావలసినట్లు అల్లా మారుతుంది. పాఠాలు చదువుకొనే వేళ ఏడుగంటలు అయిందిఅనుకో; కాలం చెవిలో కాస్త ఊదితే సరి, ఒక్కక్షణంలో గడియారం గిఱ్ఱున తిరిగి పదకొండుగంట లై పోతుంది. ఇట్టే భోజనాల వేళ అవుతుంది" అన్నాడు వెంగళాయి.

"ఇప్పుడయితే బాగుండును" అంది కుందేలు.

పాప అలోచించినట్లుగా కాస్త ఆగి "అయితే బాగుండును నిజమే, ననుకో. మరి ఆకలి ఎల్లా అవుతుంది?" అని అడిగింది.

"ఆకలి అయేదాకా అల్లా భోజనాల వేళగానే ఉంటుందిగా."


"ఇక్కడ అల్లాచేస్తా రన్నమాట" అని అడిగింది పాప.

వెంగళాయి విచారంగా తల తిప్పి- "ఊహూ! నే నల్లా చెయ్యను-కిందటి సారి, కాలమూ నేనూ దెబ్బలాడుకొన్నాంగా. అప్పుడే వాడికి పిచ్చి ఎత్తే ముందు, అప్పుడు రాణీగారు పాట పాడమంటే నే పాడాను. రాణీగారికి కోపంవచ్చింది. 'రాగానికి తాళానికి కాలం కుదరకుండా చంపేస్తున్నాడు; వీడి తల కొట్టెయ్యండి! అని ఆజ్ఞ ఇచ్చింది."

"అయ్యో! అంత అఘాయిత్యమా?" అంది పాప.

"అప్పటినుంచీ అస్తమానం టీ తాగే కాలంగానే నిలిచిపోయింది.

(16 వ పేజీ చూడుడు)





వేడి నేరేడు పండు

●

పిల్లల కథలు చి॥ యెల్లేపద్ది వీరభద్రయ్య

అనగనగా ఒక ఊరిలో ఒక అవ్వ ఉండెను. ఆమె వ్రాయను చదువను నేర్చినది, తెలివైనది. అందువలన ఆమె సంభాషణలలో పెద్ద పెద్ద పండితులను ఓడించుచుండెను. ఆమె తెలివికి ఆమె గర్వపడుచుండెను.

ఒక రోజున ఆమె ఎక్కడికో పోవుచుండెను. అది వేసవికాలము. ఎండ తీక్ష్ణముగ నుండెను. అవ్వకు దాహము వేసెను. కాని చుట్టుప్రక్కల నుయ్యిగాని, చెఱువుగాని కాన్పించలేదు. బాటకు కొంచెము దూరములో ఒక నేరెడు చెట్టు కాన్పించెను. నల్లనల్లని నేరెడుపండ్లు వ్రేలాడుచుండెను. అవి చూచునప్పటికి అవ్వకు నోరూరుచుండెను. అందువలన నామె చెట్టు క్రిందకు పోయి పైకి చూచెను. ఒక పిల్లవాడు చెట్టుమీద కూర్చొని పండ్లు తినుచుండుట చూచి కొన్ని పండ్లిమ్మని అడిగెను. పిల్లవాడు పైనుం "అవ్వా, అవ్వా, వేడి పండ్లు కావలెనా? చల్లనిపండ్లు కావలెనా? అని అడిగెను. కాని అవ్వకు సమాధానం దొరకలేదు.

నేరేడుపండ్లు వేడిగా ఎట్లా ఉండునని ప్రశ్నింపగా పిల్లవాడు నవ్వి "నీ తెలివియింతేనా" అని అవ్వచేత వేడి పండ్లు తినిపింతునని కొమ్మ ఊపెను. మంచి మంచి పండ్లు క్రిందకు రాలెను. అవ్వ వాటిని ఏరుకొని పండ్లకు అంటిన ఇసుకను ఊదుచు తినుచుండెను. అపుడు పిల్లవాడు అవ్వా పండ్లు వేడిగాలేవా ?" అని ప్రశ్నించెను. అవ్వ చల్లగా నున్నవని చెప్పెను. పిల్లవాడు బిగ్గరగా నవ్వి, "అవ్వా పండ్లు వేడిగా లేనిచో పండ్లను ఊద తినుచున్నావే" మని ప్రశించెను. అవ్వ తెలివి తక్కువకు సిగ్గుపడి అచటినుండి వెడలిపోయెను.



గ్రంథ పరిచయం

'ఆంధ్ర హోమియోపతి ఔషధ విజ్ఞానము'

గ్రంథకర్త:- శ్రీ వే. వెంకటరమణశర్మ కపిలేశ్వరపురం; తూ. గోదావరిజిల్లా. వెల రూ. 12-0-0

హోమియోపతి అనే వైద్య విధానాన్ని హానెమన్ అనే జర్మను వైద్యుడు ప్రారంభించాడు. అమెరికాలో అభివృద్ధిచెంది గడచిన శతాబ్దాంత్యంలో బెంగాల్ రాష్ట్రంలో ప్రవేశించింది. క్రమంగా ఈ విధానం తక్కినరాష్ట్రాలకు కొంత విస్తరించి దక్షిణదేశంలో, ముఖ్యంగా, తెలుగుజిల్లాలలో బాగా పాకిపోయింది. ఇంతకంటె అధికంగా ప్రజాదరణ పొందవలసిన ఈ ఔషధవిధానం ఏవిధంగాను వైద్యులనటానికి అవకాశంలేని వ్యక్తుల చేతులలో పడి కొంతవరకు నలిగిపోయింది. ఈ విధానంలో రోగియొక్క శరీర మానసిక లక్షణాలే ప్రధాన అంశాలు అయినప్పటికీ ఫిజియాలజి, అనాటమి, మొదలైన శాస్త్రపరిచయం ఎంతో అవుసరం. వీటిప్రమేయం లేకుండానే వ్యాధులను కుదర్చటానికి ప్రతివ్యక్తీ ప్రయత్నించటం సాహసకార్యం. ఏవో రెండుపుస్తకాలు దగ్గరబెట్టుకొని ఇతరవృత్తులలో ఉండేవారు అనేకులు తీరుబడిసమయంలో వైద్యులుగా వ్యవహరిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ మందులు అంతే ప్రమాదకరములైనవికాకపోవటం కొంత యనం. రోగి లక్షణానికి సరియైన మందు నిర్ణయించటం విశేషపఠనంవల్లనూ, అనుభవంవల్లనూ తప్ప సాధ్యంకాదు. ఈ పుస్తకంలో సుమారు 130 మందుల లక్షణాలను వాటికితోడుగా వాడదగిన మందులను, విరుగుళ్లను, విరోధులను, పొటెన్సీలను విపులంగా అనేక ఇంగ్లీషుగ్రంథాల సహాయంతో వివరించటమయింది. మందులను ఏఒక క్రమంలోనూ వ్రాయలేదు. అందువల్ల వెతుక్కోటానికి కొంచెం శ్రమ పడవలసి ఉంటుంది. విషాలు, ఖనిజాలు, ఓషధులు మొదలైనక్రమంలోనో లేక వర్ణక్రమంలోనో వ్రాయవలసింది. ఇంత సమగ్రంగా హోమియోపతి మెటీరియా మెడిక తెలుగులో ఇదివరలో రాలేదని చెప్పవచ్చు. స్వభావంలో వైద్యశిక్షణ పొందేవారికి ఎంతో ఉపయుక్తంగా ఉన్నది.

* * *

'మంగళగిరి మాహాత్మ్యము'

రచయిత:-శ్రీ వందిరాజు చలపతిరావు పంతులు, ఎం. ఆర్. ఎ. యస్., ఏలూరు.

ఇది పద్యకావ్యం. గుంటూరుకు బెజవాడకు నడుమ ఉండే మంగళగిరిక్షేత్రానికి సంబంధించిన పురాణగాథ దీనికథావస్తువు. బ్రహ్మవైవర్తపురాణము, స్థలపురాణము దీనికి ఆధారాలు. ఆ క్షేత్రంలో పానకాల లక్ష్మీనరసింహస్వామి ఏవిధంగా వెలసింది ఈ కావ్యంలో వర్ణించబడ్డది. రచనావిధానం పూర్వకవులను అనుకరిస్తుంది. కవిస్తుతి, కృతిప్రశంస, కృతిభర్తప్రశంస, మొదలైన ప్రబంధలక్షణాలన్నీ ఉన్నవి. శైలి ద్రాక్షాపాకం. ఈ పుస్తకంలో మొదటి నూరుపేజీలు దేశంలోని పండితాభిప్రాయాలతో నింపటం జరిగింది. అక్కడక్కడ ముద్రించిన, కవికుటుంబంలోని యావన్మంది చిత్రాలు అప్రస్తుతమేమో ననిపిస్తుంది. చారిత్రిక దృష్టితో గాక పుక్కిటిపురాణానికే ప్రాధాన్యత ఇచ్చి పూర్వపక్కిలో రచింపబడిన ఈ పుస్తకం పండితుల మెప్పుకొరకే వ్రాయబడినట్లు తోస్తుంది. ఇతరులతో నిమిత్తం ఏమిటన్నట్లు పుస్తకంవెలకూడ నిర్ణయించినట్లు లేదు.

* * *

'శ్రీముఖసూక్తి'

[ప్రథమభాగం]

అనువాదకులు:-శ్రీబచ్చు పాపయ్యశ్రేష్ఠి, త్యాగరాయనగరు, మద్రాసు. వెల రూ. 4-8-0

ఒక్కొక్క రాష్ట్రానికి కొందరు మహాభక్తులు ఉంటారు. ఆంధ్రులకు మహారాష్ట్ర భక్తులను గురించి తెలిసినంతగా ఇతర రాష్ట్రాల భక్తులను గురించి తెలియదు. దక్షిణదేశపు భక్తులలో ఆళ్వార్లు ముఖ్యులు. వీరు పన్నెండుమంది. శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో భట్టనాథుడనే పేరుగల పెరియాళ్వారు, ఆండాళ్ చరిత్రలను కొంత వివరించాడు. వైజయంతీ విలాసంలో ఉన్న తొండరడిప్పొడి యాళ్వార్ అనే విప్రనారాయణ చరిత్ర అందరికీ తెలిసినదే. ఈ ద్వాదశాళ్వారులలో ఒకడైన నమ్మాళ్వారు రచించిన నాలుగు భక్తిగ్రంథాలలో ఈ పుస్తకానికి మూలమైన 'తిరువాయ్‌మొళి' ఒకటి. ఇది ఒక కావ్యం. ఈ కావ్యంలోని పద్యాలను పాశురములు అంటారు. గ్రంథకర్త, ఒక పేజీలో తమిళమూలాన్ని, ఎదుటిపేజీలో తెలుగు అనువాదాన్ని అమర్చినాడు. భక్తివిషయంలో శ్రద్ధ ఉన్నవాళ్లు ఈ దాక్షిణాత్య భక్తిప్రబోధాన్ని పోల్చి చూసుకునేందుకైనా చదువతగినది.

* * *

'ధర్మయుద్ధము'

రచయిత:-మహదేవదేశాయి. అనువాదం: యలమంచిలి వెంకటేశ్వరరావు, విద్యావనం గ్రంథమాల, పామర్రు, కృష్ణాజిల్లా. వెల రూ. 1-4-0

ఎప్పుడో అహమ్మదాబాదులో జరిగిన మిల్లు కార్మికుల సమ్మెనుగురించి వ్రాసినపుస్తకం ఇది. ఖేడా సత్యాగ్రహసమయంలో జరిగింది. దీని యథార్థచరిత్ర మహాదేవదేశాయి ప్రత్యక్షంగా చూచి వికరించాడు. దాని అనువారం ఇది. ఈ వినమైన పరిష్కారం ఇప్పటి కార్మిక సంఘాలు ఆమోదించతే వని తోస్తుంది. 'రవి'

భారత రాజకీయాలు

(9వ పేజీ తరువాయి)

టకు తోడ్పడుటయే తమ ఉద్దేశ్యమనీ, ఉభయ అధినివేశముల సహకార, సహాయములతో ఈ పని నెరవేర్పగలమని తాము విశ్వసించుచుంటిమని అర్జెంటైనా ప్రతినిధి కరాచీలో విమానము దిగినతరువాత ప్రకటించెను.

భారత ప్రభుత్వమునకు సంబంధించినంతవరకు, ఈ ఉపసంఘమునకు లభించగల సహాయము సంఘ కార్యక్రమముపైననే ఆధారపడియుండును. భద్రతామండలి తీర్మానములోని కొన్ని లోపములు సవరింపబడవలెనని భారత ప్రభుత్వ మిదివరకే స్పష్టపరచినది. ఆ విషయములను యథాతథముగా అమలుజరుపుటకు భారత ప్రభుత్వము సహకరించదు. ఇతర విషయములలో వీలైనంత సహాయము చేయును.

భద్రతామండలి కాశ్మీర్ ఉపసంఘము మొట్టమొదట పూనుకొనవలసినది దుండగులను కాశ్మీర్ నుండి తొలగించి, శాంతియుత వాతావరణము నేర్పరచుటే. దుండగు డొక్కడైనను కాశ్మీర్ భూభాగముపైనుండగా ఇతర విషయములను తలపెట్టుట అసంభవము. శాంతియుత పరిస్థితు లేర్పడినతరువాత, ప్లెబిసైట్ విషయమై ఆలోచింపవచ్చును. అంతవరకు ఆ ప్రసక్తి అనవుసరము. దుండగులు పాకిస్థాన్ ప్రోద్బలముతో వస్తున్నారా, లేదా? దుండగులకు పాకిస్థాన్ అనేకసహాయములు చేస్తున్నదా, లేదా? దుండగులలో అనేకులు పాకిస్థాన్ సైనికులు, పౌరులు ఉండిరా, లేదా? కాశ్మీర్‌లో వీరు అక్రమించుకొన్న భాగములలో, ఆక్రమించుకుని వుండగా ఎట్టి దుష్కృత్యములు జరిపిరి? దుండగుల నుపసంహరించుటకు పాకిస్థాన్ పూనుకొనునా?-అను విషయములనే వీరు ముందుగా ఆలోచింపవలెను. దుండగులకు విదేశములనుండి, ఖండాంతరములనుండి కూడ సహాయము లభించుచున్నదట. ఇవిఏయే దేశములో ఈసంఘము కనిపెట్టవలెను. దుండగులను కాశ్మీర్‌నుండి తొలగించుటకు ఈసంఘమునకు ఎట్టి సహాయము కావలసినను భారతప్రభుత్వముచేసి తీరును. కాశ్మీర్‌లో పాకిస్థాన్ సైన్యమే మూడు దళములు యుద్ధములో పాల్గొనుచున్నట్లు తెలుస్తున్నది. వీనిని పాకిస్థాన్ ప్రభుత్వ ముపసంహరింపదు. వీరు పాకిస్థాన్ సైనికులని ధృవపడ నివ్వరు. షేక్ అబ్దుల్లా ప్రభుత్వమును తొలగించి భారత సేనల నుపసంహరించిననే దుండగులు వైదొలగెదరని పాకిస్థాన్ వాదించును. కాని అప్పుడు



పుదుక్కోట సంస్థానంలో మద్యపాన నిషేధము జూలై 1 నుంచి ప్రారంభమయింది. మద్య పిశాచి విగ్రహమును తగులబెట్టేందుకు ఊరేగిస్తున్నారు.

దుండగులు వైదొలగుటగాక కాశ్మీర్‌ను ఆక్రమించుకొనుటమాత్రమే జరుగును. ఇట్లు పరస్పర విరుద్ధ భావములను వెలిబుచ్చుచు, తమ ఉద్దేశ్యములకు విరుద్ధముగా నున్నచో సహకారము లభింపదని ఉభయ నివేశములు చెప్పుచున్నప్పుడు, ఈ ఉపసంఘము ఏమియు సాధింపలేక పోవచ్చును. కాబట్టి ఈ ఉపసంఘముపై ఏ ఆశలూ పెట్టుకొననవుసరములేదు. వీలైనంత త్వరలో దుండగులను తరిమివేసి, శాంతి నెలకొల్పుటకు భారతప్రభుత్వము ఇదివరకుకన్న తీవ్రముగ కృషిచేయవలెను. ఈ మధ్యనే పఠాన్‌కోటనుండి జమ్మూకు రోడ్డు పూర్తిఅయి, తెరువబడినది. ఇకముందు భారతసేనలు, సామగ్రి కాశ్మీర్ రంగమునకు త్వరగా చేరగల్గును. అందువలన కాశ్మీర్ యుద్ధము త్వరలోనే పూర్తియగునని ఆశించవచ్చును.

పాకిస్థానునుండి ముస్లిముల వలస

తామధిక సంఖ్యాకులుగానున్న ప్రాంతములను ప్రత్యేక దేశముగా ఏర్పరచుకుని, దానిని పవిత్రదేశ మొనర్చుకొనెద మని భారతముస్లింలు గత దశాబ్దమునుండి ప్రచారము చేసి, పాకిస్థానును స్థాపించుకొనిరి. పాకిస్థాన్ ఏదో స్వర్గతుల్యముగ నుండునని వా రప్పుడు భావించిరి. భారత దేశంలోని ముస్లిం ఉద్యోగులు, ముస్లింవర్తకులు సామాన్యప్రజలుకూడ అనేకులు పాకిస్థాన్ స్థాపనానంతరము అచ్చటికి వలసవెళ్ళిరి. తమ స్వప్నసామ్రాజ్యమును ప్రత్యక్షముగా చూచిన తర్వాత వారి అభిప్రాయములు చాలవరకు మారిపోవుచున్నవి. పాకిస్థాన్‌లో పనిచేయుటకు వెళ్ళిన ముస్లింఉద్యోగులు తిరిగి భారతదేశము వచ్చివేసెద మనుచున్నారు. దాదాపు 12 వేలమంది ఉద్యోగులిట్లు వచ్చివేయుచుండుటచే, వారిస్థానే నియమింపబడినవారికి చాల ఇబ్బంది, కలుగుచున్నది. ఇది ఇట్లుండగా, ఇదివరకు పాకిస్థాన్ వెళ్ళిపోయిన ముస్లింలు చాలమంది ఇప్పుడు తిరిగి వచ్చివేస్తున్నారు. పశ్చిమపాకిస్థాన్‌లో, ముఖ్యముగా సింధురాష్ట్రంలో ఇంకను చిక్కుపడివున్న ముస్లిమేతరులను తీసుకుని వచ్చుటకు పంపబడిన రైళ్లు, నౌకలన్నియు ముస్లింలను నింపుకుని వస్తున్నవి. సింధునుంచి వెళ్ళదలచిన ముస్లిమేతరులపై అనేకనిర్బంధములను విధించుచున్నారు. వారు ఎవ్వరికీ అప్పు లేరనీ, వారు వెళ్ళిపోవుటకు ఎవ్వరి ఆక్షేపణా లేదనీ సర్టిఫికెట్లు పొంది, తర్వాత 'ప్యాస్‌పోర్టు'కు దరఖాస్తుచేయవలెను. ఆ 'ప్యాస్‌పోర్టు' రావచ్చును; రాకపోవచ్చును; ఎప్పుడు వచ్చునదీ ఎవరూ చెప్పలేరు. ముస్లిమేతరుల వలసపై ఇట్టి నిర్బంధములుండగా ముస్లిముల వలసపై ఎట్టి నిర్బంధము లేదు. హిందువులను తీసుకురావటానికి వెళ్లిన రాకపోకల సౌకర్యములన్నియు ముస్లిములను పంపివేయుటకే వినియోగిస్తున్నారు. ఒక్క బొంబాయికే, కరాచీనుండి ప్రతిదినము 500 మంది ముస్లింలు వలస వస్తున్నారు. వీరుగాక రైలుమార్గముద్వారా జైసల్మేర్, అజ్మీర్ సంస్థానములోనికి, ఢిల్లీకి అనేకులు వస్తున్నారు ముస్లిమేతర కాందిశీకులకు సౌకర్యములు కలిగించుటకే కాలమునంతను వినియోగించుచున్న భారతప్రభుత్వము, వీరికి కూడ సౌకర్యములు కలిగించుట కష్టమేకదా. ఒకమతమువారికి, అన్నిసౌకర్యములు చేస్తున్నారను ప్రచారముకూడ ప్రారంభముకావచ్చును. భారతయూనియన్‌నుండి ముస్లిమేతరులు పాకిస్థాన్ వెళ్ళకుండా, ముస్లిములు భారతయూనియన్ వచ్చివేయుట, భారతయూనియన్‌కు ఆర్థికముగా కూడ నష్టదాయకము. అంతేగాక ఈ తిరుగువలసకు రాజకీయకారణములు లేవని చెప్పుట కూడ కష్టమే. ఇట్టి తిరుగువలసను అరికట్టవలసిందని విషయజ్ఞులు చాలరోజులనుండి భారతప్రభుత్వమును కోరుచునే యున్నారు. ఏనాడు భారతప్రభుత్వము నిషేధించునో యను భయముతో ఈమధ్య ఈ తిరుగవలస మరింత వృద్ధియైనది. అందువలన భారతప్రభుత్వము జోక్యము కలిగించుకుని, అనుమతిపత్రములు లేని ముస్లింలు భారతదేశమునకు తిరిగి రాకూడదని ప్రకటించెను. అనుమతి పత్రముల నిచ్చు అధికారము పాకిస్థాన్‌లోని ఇండియా హైకమీషనర్‌కు ఇచ్చెదరని తెలుస్తున్నది. భారతదేశమునుండి వెళ్ళిపోయిన ముస్లిముల లెవ్వరిని శాశ్వతముగా తిరిగి రానివ్వరాదనే సూత్రముపైననే ఈ అనుమతిపత్రముల నీయవలెను. ఈ దేశమును వదలిపెట్టి వెళ్ళినవారు తిరిగి ఇచ్చటికే రాగోరుటకు పాకిస్థాన్‌లోని అసౌకర్యములే కారణ మన్న నమ్ముట కష్టము. అందును తిరిగి వచ్చెడివారు విద్యావంతులైనప్పుడు, వారుపాకిస్థాన్ స్వరూపమునుగూర్చి మోసపోయి, ఇప్పుడు పశ్చాత్తాపపడుచుండిరని భావింపకూడదు. పాకిస్థాన్ పద్ధతులు వీరికి నచ్చకపోయినచో, ప్రజలలో ఆందోళన లేవదీసి వ్యవహారములను చక్కబరచుటకు ఎందుకు ప్రయత్నింపరాదు? ఏమైనను, దక్షిణమున హైదరాబాద్ సమస్య సంతృప్తికరముగా పరిష్కారమగువరకు పాకిస్థాన్ ముస్లింలను భారతదేశము రానివ్వరాదు.

సాహిత్య మీమాంస :

సంస్కృతనాటకాల సాహిత్యోత్కృష్టత

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

ప్రతిభాషయందునూ నాటకము లుండును. కానీ మన సంస్కృతభాషలో ఉన్నంత ప్రాచీన నాటక సాహిత్యమే యితర భాష యందునూ లేదు. ప్రాచీనకాలమందే మన సంస్కృతమందు రంగస్థలమున కనుకూలమైన నాటకములు నిర్మితమైనవి. కానీ మన నాటకములు ఎప్పుడుద్భవించినవో, స్పష్టంగా నిర్ధారణ చేయడం కష్టమే. వేదాల్లో నాటక సామగ్రి ఉన్నదికానీ ఆ సమయంలో నాటకాలు ఆడబడుచుండెననుటకు తగిన ప్రమాణములు లేవు. మన నాటకముల పుట్టుకనుగురించి ఒక కథ ఉన్నది. దేవతల ప్రార్థనవలన బ్రహ్మదేవుడు ఋగ్వేదమునుంచి పాఠ్యమునూ, సామవేదమునుంచి గానాన్నీ, యజుర్వేదంనుంచి అభినయాన్నీ, అథర్వణవేదమునుంచి రసమునూ గ్రహించి నాటకాన్ని నిర్మించెను. శివుడు తాండవనృత్యంతోనూ, పార్వతి లాస్యనృత్యంతోడనూ నాటకాన్నలంకరించెను. నాటకాభినయభారం భరతమునికప్పగించబడెను. యీవిషయాన్నిబట్టి నాటకాలు అలౌకికభక్తిభావనచే ఉద్భవించెనని చెప్పవచ్చును.

యూరోపు చరిత్రకారులు, యీ నాటకముల పుట్టుకను గురించి అనేకసిద్ధాంతాలు లేవదీశారు. మాక్సుమూల్లరు, లేవీ (Levi) మొదలగు ప్రొఫెసర్లు వైదికఋక్కుల గానంద్వారా యీ నాటకము లుద్భవించెననియు, డాక్టర్ రిజవేగారు మృతవీరపూజద్వారా ఉద్భవించెననియూ, పిషల్ (Pischel)గారు కట్టె బొమ్మలద్వారానే నాటకోద్భవ మయ్యెననియూ చెప్పుదురు. ఈ విద్వాంసులు భారతదేశమందు లౌకికాలౌకిక విషయాలకు భేదం లేదను విషయాన్ని గ్రహించినట్లు లేదు. మనం లౌకికవిషయాలయిన వివాహాదులనుకూడా అలౌకికమైన ధర్మానికి అనుబంధంగా ఎంచుదుము. అందువలన లౌకికాలౌకికాలకు భేదమే కన్పించదు. ఏకారణమువల్లనయితేనేమి, అలౌకికభక్తిభావనచేతనే ఆ భావనా ప్రచారంకోసమే నాటకాలుద్భవించెనని చెప్పనగును. రామకృష్ణలీలలనుగురించి సంస్కృతంలో అనేక నాటకములు వ్రాయబడియుండడమే దీనికి నిదర్శనము. నాటకాలత్యంత ప్రచారము పొందినది కాళిదాసుని సమయంలోనే; కొందరు కాళిదాసును 4 వ శతాబ్దంవాడనీ, మరి కొందరు ఒకటవ శతాబ్దంలోని వాడనీ అంటారు. కాళిదాసు ఎప్పటివాడైనప్పటికిన్నీ అతడు మాలవికాగ్నిమిత్రంలో "భాసు నవకవి"నని వ్రాయడాన్నిబట్టి అతనికంటే పూర్వంకూడా, భాససౌమిల్లకాది ఉత్తమ నాటకకారు లున్నమాట నిజం.

సరే, యిప్పుడు నాటకలక్షణాలని గురించి కొంత తెలిసికొనవలెను. మనం యిప్పుడు "నాటకం" అని చెప్పునది దశవిధరూపకాల్లో ముఖ్యమయినది. రూపకాల్లో "నాటకం" ముఖ్యమైనది కాబట్టి రూపకానికే పర్యాయపదంగా మనం నాటకాన్ని పిలుస్తాం. ఈ దశవిధరూపకాలపేర్లు: నాటకం, ప్రకరణం, భాణము, వ్యాయోగము, సమవకారము, డిమము, ఈహామృగము, అంకము, వీథి, ప్రహసనము అనబడును. వీటికి ఉపరూపకా లెన్నో ఉన్నవి. వాటి వివరణ యిచ్చట అప్రస్తుతం.

మన పూర్వులు అభినయానికత్యంత ప్రాధాన్య మిచ్చేవారు. భావాల్ని పరిపూర్ణంగా వ్యక్తీకరించడానికి అభినయమే, ముఖ్యసాధనము. అభినయము—ఆంగికము, వాచికము, ఆహార్యము, సాత్త్వికము అని నాలుగువిధాలు. భావాలకు, అనుగుణమైన దృష్టులనుగురించి కూడా వివరించబడినది. నాటి నాటకాల్లో కథావస్తువును ప్రారంభ, యత్న, ప్రాప్త్యాశ, నియతాప్తిఫలాగమము లని ఐదు భాగాలుగా విభజించారు. ప్రారంభములో నాటకం ఒక ఫలేచ్ఛతో, కూడుకొన్నదై ఫలాగమములో ఏదోయొక ఫలప్రాప్తితో నాటకం ముగుస్తుండేది. శాకుంతల నాటకమునే ఉదాహరణగా తీసికొనవచ్చును. ఈ నాటకం శకుంతలను చూడవలెనను కోర్కెతో ప్రారంభమై శకుంతలా దుష్యంతుల పునస్సమాగమముతో ముగుస్తుంది. మనయొక్క ప్రతినాటకమున్నూ సుఖాంతంగానే ముగుస్తుండేది. దుఃఖాంతనాటకం మన రసానుభూతికి విఘాతాన్ని కల్పిస్తుంది. కనుక సంస్కృత నాటకాలు సుఖాంతంగానే వ్రాస్తుండేవారు. సుఖదుఃఖాలను సమన్వయం చేయడానికిగాను మన పూర్వులు, నాటకాన్ని దుఃఖభరితంగా వ్రాసియున్నా ఆఖరున ఆనందానుభూతికొఱకు సుఖాంతంగా ముగించేవారు. దీనికి "ఉత్తర రామాయణం" మొదలగు నాటకాలు నిదర్శనము. సంస్కృతంలో యే నియమానికి అపవాదంగా ఒకే ఒక "ఊరుభంగ"మను నాటక మున్నది. ఆ నాటకంలోకూడా దుర్యోధనుని ఊరుభంగముతో ఎవనికిన్నీ దుఃఖము కలుగదు గనుక దానినిన్నీ దుఃఖాంత మనడానికి వీలులేదు.

సంస్కృత నాటకాల్లో, మృత్యువు స్నానము, భోజనము, విప్లవములను రంగస్థానమ చూపించకుండా నిషేధించారు. ఈ దృశ్యాలవల్ల మనకు ఒకవిధమైన అసహ్యత కలుగును కనుక వీటిని రంగస్థలంపై చూపించకుండా సంభాషణలద్వారానో లేక, నేపథ్యమునుండీ చెప్పడంద్వారానో తెలియబఱచేవారు. అభినయాయోగ్యమయిన కథాభాగాన్ని సంభాషణలద్వారా, విష్కంభకంద్వారా తెలియబరచేవారు.

నాటకశాలల నిర్మాణానికిన్నీ అనేకరీతులు తెల్పబడినవి. సాధారణంగా నాటకశాల మూడు భాగాలుగా ఉండేది. ముందరభాగంలో ప్రేక్షకులు కూర్చొనేవారు. మధ్యభాగం అభినయానికి, వెనుకభాగం వేషనిర్మాణమునకూ ఉపయోగపడేది. రంగభేదము కల్పించడానికి వేయు పర్దాను"యవనిక" అందురు. పూర్వమీ యవనికలను యవనకదేశమునుంచీ తెప్పించేవారనీ, అందువలననే యవనిక అను పేరు వచ్చినదనీ కొందరు భావింతురు. (యవనదేశ మనగా గ్రీసు) సోపానాకారంగా నిర్మింపబడే పీఠములలో ప్రేక్షకులు కూర్చొనేవారు. ప్రతికులంవారికిన్నీ వేర్వేరుగా పీఠములు నిర్మించేవారు.

ఒక నాటకంలో నాయక (హీరో) పాత్రధారికి అనేక సుగుణములు కావలసివచ్చేవి. చూడండి : "నేతా వినీతో మధురస్త్యాగీ దక్షః ప్రియంవదః, రక్తలోకః శుచి ర్వాగ్మీ రూఢవంశః స్థిరో యువా, బుద్ధ్యుత్సాహస్మృతిప్రజ్ఞాకలామానసమన్వితః, శూరో దృఢశ్చ తేజస్వీ శాస్త్రచక్షుశ్చ ధార్మికః" ఈరూల్సులన్నీ నేడు హాస్యాస్పదంగా కన్పించును; పోనిలెండు, నాయికలలోనూ, నాయకులలోనూ ఎన్నో అవాంతర భేదాలు ఏర్పరచిరి. నాయకులలో ముఖ్యభేదములు నాలుగు: ధీరోదాత్త ధీరప్రశాంత ధీరలలిత ధీరోద్ధతు లను యీ నలుగురు నాయకులలోనూ శ్రేష్ఠమైన నాయకుడు, ధీరోదాత్తుడే. శ్రీరామచంద్రుడు మొదలగు చాలామంది ముఖ్యనాయకులను ఈ లిస్టులోనే చేర్చారు. దుష్యంతుడు మొదలగు విలాసులు, కళాభిమానులయిన నాయకులను ధీరలలితులుగానూ బ్రాహ్మణ నాయకులను ధీరప్రశాంతులుగానూ, ఉత్సేక, దర్పగుణాలు గలిగిన, యింద్రజిత్తు మొదలగు వారిని, ధీరోద్ధతులనుగానూ, వర్ణించారు.

విదూషకుడు ఆ నాటకాల్లో ముఖ్యపాత్రధారి, హాస్యరసాన్ని పోషించేవాడు, కథాసంవిధానానికి, సహాయకుడు విదూషకుడే ఇంగ్లీషువారియొక్క "క్లౌను" మన విదూషకుని ననుసరించియే బహుశా నిర్మించబడియుంటాడు. యితడు బ్రాహ్మణుడుగానూ. తిండిపోతుగానూ ఉంటాడు. యితని అంతఃపుర ప్రవేశాని కెటువంటి నిషేధమూ లేదు. రాణులను "భవతీ"యనీ రాజుని "వయస్య" యనీ యితడు పిలుస్తాడు. రాజుకు విదూషకుడే అంతఃపుర విషయాల్లో సలహా యిస్తాడు. సంస్కృత నాటకాలకు సజీవత నిచ్చునది ఈ విదూషక పాత్రయే. యితడు అందర్నీ దూషిస్తూ తన నామాన్ని సార్థకపరచుకొంటాడు.

మొట్టమొదట మన సంస్కృత మహత్త్వాన్ని పాశ్చాత్యులకు తెల్పినది కాళిదాసుని నాటకాలే. పాశ్చాత్యులు మనల్ని పశువులతో తుల్యంగా భావించే సమయంలో మన సంస్కృతినీ, నాగరికతనూ పాశ్చాత్యులకు తెలియపరచి మనల్ని మానవుల్నిగా నిరూపించినది యీ కాళిదాసు నాటకరాజములే. యితని విక్రమోర్వశీయమూ, మాళవికాగ్నిమిత్రమూ, శాకుంతలమూ ప్రాచ్యపాశ్చాత్యాల్లో అఖండయశస్సు నార్జించినవి. విక్రమోర్వశీయనాటకకథకూ గ్రీసులోని ఒక ప్రాచీనగాథకూ అత్యంత సామ్యమున్నది. తాము అత్యంతప్రేమతో ఆరాధించే గ్రీకు సాహిత్యానికీ బానిసలైన భారతీయుల సంస్కృతానికీ ఉన్న ఈ సామ్యాన్ని చూచి పాశ్చాత్యు లబ్బురపడిరి. వాస్తవంలో ప్రాచీన గ్రీకుభాషకూ ఋగ్వేదీయ సంస్కృతానికీ ఎక్కువ సామ్య మున్నది. ఈ రెండుభాషలూ ఒకటే కులానికి సంబంధించినవి. కాలక్రమేణా ఈ భాషలు విడిపోయినవి. మీ శృంగార శాకుంతలాను వాదాన్ని మాత్రమే చదవగా మహాకవి "గెటే" తన్మయుడై పద్యరూపంలో శాకుంతలంయొక్క మహత్త్వాన్ని వర్ణించాడు. మీ విషయాన్ని వేరొకచోట వివరిస్తాను.

రంగానికి సరిపడు నాటకాల్ని రచించేవారు సంస్కృత నాటకకారులే. మన ఆంధ్ర సాహిత్యానికి సంస్కృతం మాతయైననూ పూర్వం మన తెలుగులో నాటకాలే సున్న. ప్రబంధాల్నీ, కావ్యాల్నీ యింత హృదయంగమంగా రచించిన మన ప్రాచీనాంధ్ర కవులు నాటక సాహిత్యాన్ని ఎందుకు విస్మరించిరో తెలియకున్నది. మన నాటకసాహిత్యం ఉన్నతి జెందవలెనన్న మనం సంస్కృత నాటకములనే ఆదర్శంగా గ్రహించవలెను. కానీ సంస్కృత నాటకములను యథాతథంగా అనుకరించ నవసరంలేదు. విష్కంభం, నాంది మొదలగునవి ఈనాటి నాటకాల్లో అనవసరం. నేటి మన నాటకకారు లనేకులు రంగస్థలానుకూల్యతను గమనించడమే లేదు. నాటకం వ్రాస్తే అందులో ప్రదర్శనకు అసాధ్యమైన, సింహాలు రావడం, నదులు దాటడం మొదలైన ఘట్టా లుంచుదురు. మన తెలుగునాటకాలు మనం ప్రదర్శింపదలిస్తే ఎన్నో రంగాలు (ఒమిట్) చేయవలసివస్తున్నది. దానితో నాటకధార ఎక్కడికక్కడ విడిపోయి, భావోద్వేగాన్ని కల్గించలేకపోతున్నది. ముందుగనే నాటకకారులు సంక్షేపంగా ఏదుకు వ్రాయకూడదు? సంస్కృత నాటకాల్ని ఆదర్శంగా గ్రహించి, ప్రదర్శన యోగ్యంగా రచిస్తేనే మన రంగస్థలం కీర్తినీ ప్రజాదరాన్నీ పొందగలదు.

శ్రీకాకుళము చరిత్ర

(8వ పేజీ తరువాయి)

రంగనాథుడే తానని తన కథ అంతా తెలుగులో చెప్పమని ఆనతిచ్చెనట. అంతకు పూర్వము వరకు సంస్కృతభాషకు ప్రాధాన్యమిచ్చినవాడు ఆలగాయితు తెలుగువాణి విద్యానగరవీథులలో పండుగ చేసుకునునట్లు చేసెను. శ్రీ జయతీర్థ, పురందరదాసు, వేదాంతదేశికులు, శఠమునుడు, మొదలగు ప్రఖ్యాతపురుషులు వీరి సమకాలికులై వెలసి తమ బోధనల నన్నియు ప్రపంచమంతయు వెదజల్లిరి. తళ్లికోట యుద్ధంతో ఆంధ్ర సామ్రాజ్యము క్షీణించెను.

చుట్టుప్రక్కల గ్రామాలు చాలా మార్చబడ్డాయి. అందులో తెలుగు రాయుడిపాలెం ఒకటి. ప్రస్తుతమున్న తెలుగురాయుడిపాలెం ఇప్పటికి షుమారు 25 సం॥రాల పూర్వము 70 ఇండ్లతో మాలపల్లిగా ఉండెడిదనిన్నీ, దాన్ని మార్చి లెక్కలలో తెలుగురాయడు పాలెంగా చేశారని తెలియుచున్నది. ప్రస్తుత తెలుగు రాయడు పాలెం శ్రీకాకుళముకు ఒకమైలు దూరంలో ఉన్నది.

పురాతన శాసనముల నన్నింటినీ సేకరించి వాటి ప్రతిబింబాలను గైకొని తద్వారా చరిత్ర పరిశోధకులకు వస్తుసామగ్రిని సేకరించుటకు భారతదేశమునకు కేంద్రముగా భారతీయశాసన పరిశోధకశాఖ అనునది గలదు. దేశము మొత్తము మీద శాసనాల్లో 98% మన దక్షిణదేశంలోనూ 2% ఉత్తరదేశంలోనూ గలవు. ఇట్లున్న ఈ శాఖలో ఉద్యోగాల్లో పంజాబీయులు, బెంగాలీలు ప్రథమస్థానం అలంకరించిరి. పదకొండు తెలుగుజిల్లాలకు ఒక్క ఆంధ్రుడున్నూ అరవజిల్లాలకు ఇద్దరు తమిళులూ నియమితపబడి తెలియుచున్నది. ఈ తేడాలను సరిచేసి ఆంధ్రులకు సరియైన ప్రాతినిధ్యము ఇవ్వాలి. ఆ నియమించే ఆంధ్రులలో గూడ తెలుగుభాష బాగ తెలిసిన వారినే నియమించవలసి యున్నది. ఆనాడే మన శాసనాల ప్రతిపత్తి రాణిస్తుంది. ఇంతేగాక ఆదిలో నేను తెలిపిన రాతిసనుల్ల విషయమై ఇంతవరకూ కృషి యేమీ జరుగలేదు. వాటినిగురించిగూడ వీరు కృషిచేయాలి.

కొడాలినుంచి శ్రీకాకుళమునకు కంకర రోడ్డు లేదని పైన తెలిపియున్నాను. ఆ మార్గమును సరిచేసి శ్రీకాకుళమువరకు కంకరరోడ్డు వేయించవలెను. ప్రతి సం. రము వైశాఖశుద్ధ ఏకాదశి లగాయితు స్వామివారి కళ్యాణోత్సవములు జరుపబడతాయి. ప్రస్తుతము ఈ ఆలయ నిర్వహణ చల్లపల్లిరాజావారికి లోబడి జరుగుచున్నది. కృష్ణరాయలు ఇచ్చిన ఆ గ్రామాలన్నీ ఏమయినాయో తెలియదు. ఈ ఆలయపురోభివృద్ధికై ఏమాత్రము నేడు ధనము వెచ్చించబడుటలేదు. మట్టపల్లివద్ద నున్న హనుమంతుని విగ్రహము ధూప, దీప, నైవేద్యములు లేకుండా పడియున్నది. రాజాగారు సం॥రమునకు ఒకతూరి గూడ ఆలయము పనిమీద రారు. వారి పనులు వచ్చినప్పుడు మాత్రము వస్తూ ఉంటారు. ఆ వచ్చినప్పుడైనా ఆలయమువిషయమై ఏమాత్రము ఆలోచించనైనా ఆలోచించరు. రాజాగారి స్వంతబంగళా తప్ప పరిశోధకులుగాని, యాత్రికులుగాని వస్తే ఉండుటకు వసతి లేదు. ఆ బంగళాఅయినా రాజాగారి ఆప్తులకు మాత్రమే ఇవ్వబడుతూ ఉంటుంది. ఇకనుంచైనా పూర్వసంస్కృతి నిలబెట్టుటకై రాజాగారు కృషిచేస్తూ, బాటసారులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయవలసినదిగా కోరుచున్నాను. దేవాలయశాసనాలన్నీ భద్రపరచాలి. సమీపములోనే ఘంటసాల, భాగవతుల కూచిపూడి మొదలగు గ్రామాలు గలవు. ఇటీవల చినముత్తేవి అను గ్రామంలో పాళీ లిపిలో ఒక శాసనము బయల్వెడలిన దని తెలుస్తూంది. ఈ శాసనాలన్నీ భద్రపరచాలి.

మన ఆంధ్రులలో నున్న అనైక్యత చూస్తే మనము పూర్వసంస్కృతిలో వెయ్యవవంతైనా నిలబెట్టగలమా అని తోచకమానదు. కాంగ్రెసులో గ్రూపుపద్ధతులు నిర్మూలన కానంత వరకు మనము ఏకార్యము చేబట్టుటకు అర్హులము గాము. మాటలతోగాక చేతలతోనే కార్యక్రమము కొనసాగించాలి. ఒకరికి కార్యవర్గ సభ్యత్వము ఇస్తే వెంటనే రెండవవారు వారు పనికిరారని తెలియపరచుటాయె! ఒకరి మీద ఒకరు దోషములను ఆరోపించుకొంటూ తగాదాలను నడిబజారులోకి తెస్తుంటే, ఇంకా ఆంధ్రజాతి బాగుపడుతుం దని ఏలా అనుకోగలము. హాతోఽస్మి! నామనస్సు ఎప్పుడూ ఆంధ్రులము సమిష్టికీర్తి గోల్పోయితిమే అని ఆందోళన నందుచుండుటచే ఇంతవరకు ముచ్చటించితి. గాన ఆంధ్ర ఔన్నత్యమునే సంస్మరించుకొని ఐక్యతతో పనిచేయవలసిందిగా మరొక్కమారు ఆంధ్రకాంగ్రెసు అగ్రనాయకులకు విన్నవించుచున్నాను. ఆంధ్ర ప్రజానీకమంతా అందుకొరకై తీవ్ర ఆందోళన చేసి తోడ్పడుట విధియని మనవి చేయుచున్నాను.

క్రీ. శ. ౧౬ వ శతాబ్దమందలి

వెన్నెలకంటి రామన్నయే మర్యాద రామన్న

శ్రీ కోన వేంకటరాయశర్మ

'త్రెట్టు' సంస్థానాధీశుడగు వేజెళ్ల సత్తారాజు నొద్ద వెన్నెలకంటి వేంగన యను బుద్ధిసముద్ర గణ్యుడు మంత్రిగా నుండె ననే—

" ఘనులు నే గుడిలోపల గంగరాజు
అతని పుత్త్రుకు వేంగన యనినవాడు
సరసు డైనట్టి వేజెళ్ల సర్వఘనుని
మంత్రియై యొప్పె రాజసమ్మానమునను."

" వేజెళ్ల సత్తారాజు విభవాధిపత్యంబు
పూనిన సర్వజ్ఞ పుణ్యమూర్తి
పాలుపొంద నా కృష్ణభూపాలు బాలుని
దొర జేసికొని కార్య మరసి నడిపె
శ్రీ రంగరాయలచే నొప్పు గొనితెచ్చి
పంచవన్నెల డాలు పరగజేసె
కొండవీటి సరద్దు గుడ్లూరి దనుకను
ఏలించె కృష్ణ భూపాలు నెమ్మి
సకల ప్రజ్ఞాన దక్షుడై జనుల బ్రోచె
రాజసన్మానముల చేతదేజములరె
బంధుజనముల సకల సంపదల దనిపె
మహితయశు డగు వేంగనమంత్రి యపుడు."

—అను పద్యములు సాటుచున్నవి. శా. శ. ౧౪౧౬ మొదలు శా. శ. ౧౪౪౪ వఱకు నిఱువది దెన్మి దేడుల నడుమ సత్తారాజు 'త్రెట్టు' ను రాజధానిగా జేసికొని పరిపాలించినట్లు లగపడుచున్నది. ఈ సత్తారాజున కగ్రజాడు అయ్యపరాజు ననువాడు హైదరాబాదునకుం జని, యచ్చటినుండి 'కొడగు చక్రవర్తి' యను రెడ్డికి జాగీరుగా నడచుచున్న 'గుడ్లూరు' సీమకు జాగీరు తెచ్చికొని, తన తమ్ముడగు సత్తారాజును హైదరాబాదునం దుంచి, తాను 'టంగుటూరు' నకు దాపున నున్న "సోమరాజుపల్లె" యను గ్రామమున గోటను గట్టికొని, యా జాగీరు ననుభవించుచుండెను.

కృష్ణమరాజు బాల్యమున నుండగా ప్రభువునుగా నొనర్చి పౌజుదారు నొద్దకు దీసికొని పోయి మరల రాజ్యమును గృష్ణను రాజునకు గైవస మొనర్చినవాడు వెన్నెలకంటి వేంగన. ఆ కారణమున వేంగన పుత్త్రులను గూడ "వేజెళ్ల" వారి సచివోత్తము లగుట దటస్థించినది. కృష్ణమరాజు శా. శ. ౧౪౮౦ మొదలు శా. శ. ౧౫౨౨ వఱకు బ్రదికెను. శ్రీరంగరాయల మెప్పుంది పంచవన్నెల డాలు తెచ్చి తన యేలిక యగు కృష్ణమరాజునకు "వేంగన మంత్రి" యొసంగినట్టును, తొలుత సదాశివరాయని మంత్రులుగా ప్రవేశించి, యావల దిరుమలరాయ, శ్రీరంగరాయలకు సచివోత్తములుగ వ్యవహరించినట్టును, శాసనములు దెలుపుచున్నవి.

కొండవీడు మొదలు గుడ్లూరు వఱకును కృష్ణమరాజు రాజ్యము కలయట్లు లవగత మగుచున్నదిగదా! వేంగన మంత్రి కొమాళ్లలో జివఱివాడగు వెంకన్న తక్కిన వారితో బాటు 'గుడ్లూరు' నకు దమ యేలికవెంట బోకయే చిన గంజాము దగ్గఱనున్న 'భీమవరము' నందే యుండుచుండె ననే—

" సకల ప్రజ్ఞా విచక్షణ శాలియైన
వేంకటయ సాటివారిని వినగలేము
దాన శీలుడు నిరతాన్న దానపరుడు
పరగ నతడుండె నా 'భీమవరము' నందు."

—అను పద్యమును, మూడవ కొమారుడగు రంగప్ప—

" రంగప్ప రూప సంపద
రంగప్పడు బుద్ధి నమర రాట్ప్రతిముండౌ
సంగరవిజయు డుదారుడు
రంగుగనా గోలకొండ రాజులు మెచ్చన్."

అనియు, రెండవ కొమారుడగు రామన్న—

" రామన్న 'మర్యాద రామన్న', వేజెళ్ల
నారాయణేంద్రుడు గారవమున
జన వీయ నాయన సంస్థానకర్తయై
పాలించు బ్రజల సంపదల బొదల
'గోలకొండ' వజీర్ల గూడి దుర్గాల పై
ముత్తిక హత్తించి మొత్తి మొత్తి
కడు మన్నె సరదార్ల వడిసెడగా గొట్టి
రాజుచే మెచ్చులు రమణ నంది
పాదిలె లింగప్పతో గూడి భూము లెల్ల
గొట్టి విప్రుల కన్నంబు బెట్టి మించె
గలియుగంబున వెన్నెలకంటి రామ
మంత్రికిని నీడు లేరని మహికి నెక్కె."

—అను పద్యమును, ప్రతిభావ్యుత్పత్తులుగలవారని, లోకమున నాదరాభిమానములు గడించి విశ్రుతులయినారని, తెలియజేయుచున్నవి.

ఇతడు వెన్నెలకంటి గంగరాజు పౌత్త్రుడనియు, వేంగన పుత్త్రుడనియు నారాయణేంద్రుని సంస్థానకర్తయై పాలించెననియు, గోలకొండవజీర్లను గూడి దుర్గాలపై ముత్తిక హత్తించి మొత్తి, మన్నె సరదార్ల వడిసెడగా గొట్టి, రాజుచే బహూకృతుల నందె ననియు, పాదిలె లింగప్పతో గూడి భూము లెల్ల గొట్టి, బ్రాహ్మణుల కన్నంబు వెట్టె ననియు దెల్లమగుచున్నది.

అంతియకాక, యుద్ధ విద్యా విశారదుండయి యుద్ధముల జేసినట్టుల విడుచున్నది. పెదనారాయణరాజు 'గుడ్లూరు' పరగణాను బాలించుచు 'భువనగిరి' పైకి బోవలసియుండి పోయి యుద్ధసన్నద్ధుడు కాగా, న యుద్ధమున క్షతగాత్రుండయ్యెను. గాని చివఱకు విజయలక్ష్మిని జేబట్టి, 'గుడ్లూరు' సేరి యావల గొన్నాళ్లకు జనిపోయెను. శా. శ. ౧౫౨౨ ప్లవ సంవత్సరము మొదలు శా. శ. ౧౫౫౮ ధాతృ సంవత్సరము వఱకును బెదనారాయణరాజు బ్రదికియుండెను. కాబట్టి యాతని మంత్రి సత్తముండగు రామన్నయు నక్కాలమందె యుండెననియు, 'భువనగిరి' యుద్ధములో బెదనారాయణ రాజుతో పాటు ఇతని మంత్రియగు రామన్నయు బోల్గొనె ననియు,—దెలియం దగును. ఈ రామన్న జ్యేష్ఠ సోదరుండగు సూరపరాజు సైతము "వేజెళ్ల" వారి యొద్ద మంత్రిత్వము నెఱపినవాడె! రామన్న రెండవ తమ్ముడు "ఉదయగిరి" యనువాడును వేజెళ్లవారియొద్ద సచివత్వము సాగించినవాడే యని తెలియనగుచున్నది. వివరము లింకను కాలగర్భమున నొదిగియున్నవి. ఇతని మధ్యవర్తిత్వమున ననేక తీర్పు లుదయించినవి. న్యాయైకపక్షపాతి యని పేరందెను.

వెన్నెల కంటివారిది హరితస గోత్రము. మొదట బాపట్లకు చేరువ నున్న "పెదచెఱుకూరు" గ్రామము నివాసముగా గలయట్లు సూరన తన తండ్రి చెఱుకూరి యమరన మంత్రి యని యుల్లేఖించుటవలన దెల్లమయ్యెడిని. ఆవల నుదరపోషణార్థమై యిట్లంశ్యులైయ్యె తావులకుం జని తమ ప్రతిభావ్యుత్పత్తుల కనుగుణముగా వర్తించి 'టంగుటూరు' మొదలగు చోటుల స్థిరపడి రని తెలియుచున్నది.

ఇమ్మహనీయమూర్తులకు నమోవాకములు.

కొరాపుట్టి జిల్లా

శ్రీ వి. వి. ఆర్. ఎల్. శర్మ

1936 ఏప్రిల్ 1వ తారీకునాడు ఆంధ్ర ప్రాంతాలు కొన్ని విశాఖజిల్లా నుంచి వేరు చేయనుబడి కొరాపుట్టి జిల్లా పేరుతో ఒరిస్సాలో కలుపబడ్డాయి. అతఃపూర్వము యీప్రాంతమంతా ఏజన్సీకింద భావింపబడి, చెన్న రాజధానికి ధాన్యపుకొట్టుగా ఉపయోగపడేది. లక్షలకొలది మిగులుధాన్యాన్ని, విశేషమైన కలపను అన్యప్రాంతాలకు సరఫరాచేసేది. ఈ కొరాపుట్టి జిల్లా వైశాల్యం 11 వేల చదరపు మైళ్లని ఒరియా ప్రభుత్వపు లెఖ్ఖలలో (Statistics) ఉంది. దీని జనాభా 12 లక్షలుంది.

ప్రభుత్వపు జనాభాసంఖ్యలబట్టి తెలుగువారికన్న, ఒరియాలకన్న, ఆదిమవాసుల జనాభాయే ఎక్కువని ఋజువవుతుంది, ఈ జిల్లాను ఒరిస్సాలో కలిపిన "ఒడోనెలు కమిటీ" తీర్మానం ప్రకారం ఆదిమవాసుల సంఖ్య అర మిలియ నుంది. ఇక్కడ కోదు, సవర, గదబ, పొరజ మొదలగు తెగల వారున్నారు. ఆదిమవాసులను మినహాయిస్తే తదితరుల సంఖ్యకంటే, ఆంధ్రులసంఖ్య హెచ్చు. రాయగడ, గుణుపురం తాలూకాలలో ముప్పాతికవంతుకూడా తెలుగువారున్నారు. ఈ కారణాన్ని చూపించే ఈ జిల్లాను ఆంధ్రరాష్ట్రములో కలపాలని ఇక్కడి వారు ఆందోళన సాగిస్తున్నారు.

ఇంతేకాదు. ఆదిమవాసులలో ముఖ్యులగు కోయలు ఆంధ్రులకిందనే పరిగణింపబడుతారు. గ్రిగ్సనుగారు ఈ కోయలగురించి వ్రాస్తూ, ఈ కోయలలో తెలుగువారి ఆచారవ్యవహారములు, భాషా బాగుగా కలిసిపోయినవని వివరించారు. కాని బ్రిటిషుప్రభుత్వమువారిచే నియమింపబడిన "ఒడోనెలు కమిటీ" వారు ఈ కోయలంతా కొంతకాలములో ఒరియాలతో మిళితమైపోవ గలరని నిర్ణయిస్తూ, ఈ ప్రాంతాలను ఒరిస్సాలో కలిపివేశారు. అది చాలా అక్రమం. నేడు కోయలలో చదువుకున్నవారంతా, ఆంధ్రరాష్ట్రములో చేరిపోవుటయే తమ అభిమతమని తెలియజేస్తూ, తెలుగువారితో కలిసియీప్రాంతాలను రాబోవు ఆంధ్రరాష్ట్రములో చేర్చుటకు ఆందోళన చేస్తున్నారు. రాయగడ, జయపురం, గుణుపురం ప్రాంతాలలో అనేకమంది ఆదిమవాసులు ఆంధ్రకాంగ్రెసు సంఘములో చేరి వర్కర్లుగా పని చేయుచున్నారు. పలాసాలో ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సేవాదళ ఆఫీసరులుగా యిరువురు కోయ యువకులు తరిఫీదు పొంది కోయలను వాలంటీర్లులుగా సంఘటితపరచుచున్నారు. దీనిని బట్టి కోయలకు ఆంధ్రులకు మధ్యగల సామరస్యము, ప్రేమ, గౌరవాదులు వెల్లడి యగుచున్నవి.

నేడు కొరాపుట్టిజిల్లాలోని ముఖ్య పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, కంపెనీలు ఆంధ్రుల వైయుండి, ఆంధ్రుల పెత్తనముకిందనే పని చేయుచున్నవి. వాటిలో గల కార్మికులందరూ తెలుగువారే. ఒరిస్సాలోకల్ల పెద్దదియగు జయపూర్ షుగర్ ఫ్యాక్టరీ నూటికి నూరుపాళ్లు ఆంధ్రులదే. కొరాపుట్టిజిల్లాలోని మాంగనీసు, అభ్రకము మొదలగు గనులన్నియు ఆంధ్రుల పెత్తనముకిందనే యున్నవి. ఇంతేకాదు. యీ జిల్లాలోని విద్యాధికులు (ఉద్యోగస్తులను మినహాయించి) ఎక్కువమంది లాయర్లు, డాక్టర్లు, కంట్రాక్టర్లు ఆంధ్రులైయున్నారు. వర్తకులందరూ తెలుగువారే. జయపురం సంస్థానంలోని కీలకమగు అధికారములన్నియు ఆంధ్రులే నిర్వహించుచున్నారు. పైచ్చు జయపురం సంస్థానాధీశ్వరులు కళాప్రపూర్ణ శ్రీ విక్రమదేవ వర్మగారు ఆంధ్ర భాషాభిమానులును, ఆంధ్రరాష్ట్రమునకు సుముఖులును గూడనైయున్నారు. ఒరియా రాష్ట్రమునకు యీ జిల్లానుంచి ఎక్కువగా రాబడిపన్ను, వృత్తిపన్ను, భూశిస్తు వగైరాలు తెలుగువారే చెల్లించుచున్నారు.

పైకారణములచే కొరాపుట్టిజిల్లా ఆంధ్రులదే యని నిర్ణయింపక తప్పదు. ఉత్కళులు దీనిని అన్యాయముగా తమరాష్ట్రములో కలిపివేసి యీ జిల్లాను పూర్తిగా ఓఢ్రప్రదేశముగా మార్చివేయుటకు తీవ్రప్రయత్నములు చేయుచున్నారు. ఉద్యోగములన్నియు ఒరియాలవే. స్కూళ్లలో ఒరియాలే తప్పక చదువవలెనని శాసించుచున్నారు. ఈ జిల్లాలలోని తెలుగు ఉద్యోగులను కటక్, పూరీజిల్లాలకు బదిలీచేస్తూ, తిరిగి యిచ్చుటకు ఒరియా ఆఫీసర్లను దిగుమతి చేయుచున్నారు. కాని వారు ఎన్నివిధాలా యీ జిల్లాను ఓఢ్రజిల్లాగా మార్చివేయ ప్రయత్నించినను, ఆంధ్రజనబాహుళ్యతను తొలగింపజాలరు.

అదిగాక యీ జిల్లా రాజకీయంగా, వైజ్ఞానికంగా ఎంతో వెనుకబడివుంది. రాయగడా, గుణుపురంప్రాంతాలు తప్పిస్తే మిగతా ప్రాంతాలకు రైలుసౌకర్యాలుకూడా లేవు. ప్రజలలో ఎక్కువమంది అనాగరికులే. ఇనుము, బంగారము, అభ్రకము వగైరా గనులున్నను వాటిని తవ్వించే నాథుడు కానరాడు. కాబట్టి యీజిల్లా మున్ముందు ఎన్నోరెట్లు అభివృద్ధి కావలసిన ఆవశ్యకత గలదు. ఇక ఒరిస్సా రాష్ట్రమా ఆర్థికంగా కేంద్రప్రభుత్వముపై నాధారపడియున్నది. పైపెచ్చు నూతనముగా సంస్థానములుకూడ రాష్ట్రములో కలిసినందున ప్రభుత్వముపై బరువు, ఒత్తిడి ఎక్కువైనది. ఇట్టి పరిస్థితులలో ఒరిస్సా రాష్ట్రము కొరాపుట్టిజిల్లాను అభివృద్ధిచేయలేదు. గాన ఆంధ్రప్రాంతమగు యీ జిల్లా ఆంధ్రరాష్ట్రములో కలియక తీరదు.

1936లగాయితూ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు న్యాయాధికృత (Jurisdiction) క్రిందనే యీ జిల్లా యున్నది. విశాఖజిల్లా కాంగ్రెసుసంఘమునకు యీజిల్లాలోని తాలూకా కాంగ్రెసు సంఘములు అనుబంధశాఖలుగా పని చేస్తూ, సోదర ఆంధ్రులతో తమ సంబంధమును దృఢతరము చేసుకొంటున్నవి.

ఆంధ్రరాష్ట్రము త్వరలో రాబోతున్నది. ఆ ముక్కోటి ఆంధ్రులు యింతకాలమునుంచి కంటున్న కలలకు ఒక స్వరూపము ఏర్పడనున్నది. ఆ సమయములో సరిహద్దులను నిర్ణయించుటకొరకు ఏర్పడబోయే సంఘము కొరాపుట్టిజిల్లా ఆంధ్రులదే నన్న నగ్న సత్యమును గుర్తించి యీప్రాంతమంతటినీ ఆంధ్రరాష్ట్రములో కలపాలి. 1036 నుంచికూడా కొరాపుట్టి జిల్లా ఆంధ్రులదేనని ఒరిస్సా ఆంధ్రులు చేస్తున్న నినాదాలను ఫలింపజేయాలి.

గ్రంథాలయాలు: మునుపూ, ఇప్పుడూ

శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

వేదకాలంనాటికి మనుషులే గ్రంథాలయాలు. ఏవో నాలుగు పుస్తకాలుమాత్రం బ్రహ్మగారిదగ్గర ఉండేవిట! వాటిని కాస్తా ఎవడో చదివి—లోంగ—అంటే చదువుకుందామని అపహరించుకొని చేతిలో దెబ్బ కొట్టాడట! అప్పుడు బ్రహ్మ తొందరపడి పుస్తకం అపహరించిన గ్రంథాన్ని పశ్యలో సంపాదించగల్నా? అనే నిరాశతో "పుస్తకం......పరహస్తగతం" అని పిరికా పెట్టుకొని ఆ ఉన్న జ్ఞాపకం కాస్తా పోతుందేమోనన్న భయంతో ఓ కొందరు గట్టి బుర్రలవాళ్లకు జ్ఞాపకం ఉన్నవరకూ నంది చెప్పి, వల్లె వేయించి, వాళ్లను పుస్తకభాండాగారాలుగా చేసి, ఇలాగే మీరూ చెప్పి పుణ్యం సంపాదించుకోండి, పొండి, అని చెప్పాట్ట! తర్వాత ఆ పుస్తకాల్ని బ్రహ్మగారు ఎల్లాగో మళ్లీ చేజిక్కించుకుని గనపరచుకుండా. తనమటుకు చదువుకోటం, మళ్లా మూతవేసుకోటంగా వాడుకుంటూ, ఇతరుల కంటబడకుండా స్వంతగ్రంథాలయంగా వుపయోగించుకుంటున్నాడట! ఎవరు చెప్పారు? అంటే!! మనకు శ్రుతిసంగతి పక్కాగా ఎవరుచెబుతారు—ఏదో, 'నూ' అంటే కోటిపాటగా మనపై ఎల్లుకుపోవాలి, "బుద్ధి, కోచినంత—బుధులు చేవిన్నంత—తెలియవచ్చింది" అన్నారా ఎంతో పెద్దలు! అంతా అంతేననుకోండి! ఇది మొదటి గ్రంథాలయచరిత్ర!..

ఈవిధంగా జరగ్గా జరగ్గా చాలాకాలం పోయాక, భూర్జపత్రాలూ, తాళపత్రాలూ, వగైరాలు గ్రంథాలై ఉంచేవాట్ని యింటిని, గ్రంథాలయం, అన్నారనుకోండి. అని శాసనాదులెక్కడైనా ఉన్నాయా అంటే యిటువంటి నేను చూడ్లేదు విన్లేదనుకోండి నేను కూడా,—గాని పెద్దలు చెప్పగా ఇంకో మక్కా గూడా విన్నాను అది: తాటాకుల మొదలైన పుస్తకాల్ని పెద్ద బాన(భాండం)లో పెట్టి ఆ బానలను ఓయింటిలో వుంచేవార్ట! అందుకే 'పుస్తకభాండాగారము' అనే పేరు కలిగిందట! నమ్మదగిందిగానే వుంది.

క్రీస్తుపూర్వం ఆరవశతాబ్దిలో బౌద్ధమత ప్రచారం జరుగుతోన్నప్పుడు ఇప్పటి బీహారు అప్పుడు మగధగా వాడబడేది. ఆ మగధ రాజ్యంలో నలంద—విక్రమశిల—ఓదంతపురం—జగద్దల—అనే నాలుగు విశ్వవిద్యాలయాలుండేవి. అందులోని నలందా విద్యాపీఠంలో, 'ధర్మగంజ్' అనే పేరుతో ఒక పెద్ద పుస్తకభాండారం వుండేదట తొమ్మిదంతస్తుల మేడలో!

తర్వాత అవగా క్రీస్తుపూర్వం రెండో శతాబ్దంలో శ్రీశంకర భగవత్పాదుల వారి జమానాలోనన్నమాట, వారి అధికారంతో నాల్గు దేశాలలో నాల్గు పీఠాలు నెలకొల్పారు. వాటిలో అనేక వైజ్ఞానిక గ్రంథసముదాయమూ ముఖ్యంగా, మతధర్మ గ్రంథాలూ ఎక్కువగా సేకరించి, నాడు దేశం దేనికోసం తహతహలాడి, ముందుకు దుమికి, అవసరమైతే ప్రాణాలనుసైతం పణంగా ఒడ్డేదో అమహాకార్యాలకు, ప్రచార-ప్రబోధాలు సాగించుకుని చరితార్థులైనారు. ఈ పీఠాల్ని విద్యాపీఠాల నవచ్చుకూడా, కాని. ఇందుల్లో వుండే గ్రంథాలను పరహస్తగతం కానీయకుండా, మఠ్ఛాపాత్రిలలోనూ, పండితగోష్ఠీ—వేదాధ్యయనమూ. జరుపబడుతూ, మత-ధర్మసందేహాలు తీరుతూ పరిష్కరిస్తూ ఉండేవిష! నిత్యమూ ఆ గ్రంథభాండాగారాలకు పూజాపురస్కారాలు దసరాకు గొప్ప కార్యక్రమంతో పుస్తకరూపసరస్వతీఉత్సవాదికాలూ జరుపుతూ పవిత్రంగా వుంచేవారవ!—

మరో పెద్దలు ఇల్లాగాకూడా సెలవిచ్చారు. దేవాలయాలు చాలాకాలం గ్రంథాలయాలుగా పనిచేసినైట. పురాణ గ్రంథాలూ—శాస్త్ర గ్రంథాలూ వుంచి, పౌరాణికులచేత ప్రజాసామాన్యానిక్గూడా చక్కగా తెలిసేట్టు పురాణాలు ప్రవచనాలు చేయించడం-పండితుల్లో అనుశాస్త్ర చర్చలు జరపడమూ చేస్తూండేవిట ఈ గ్రంథ దేవాలయాలు!......

ఆ పిమ్మట కాలచక్రపరిభ్రమణంలో, నోవాబులూ—నజీర్లూ—సర్దార్లూ, రాజులూ, మంచిమంచి గ్రంథాలయాలూ పాఠశాలలూ స్థాపించి భాషాసేవ జేసి తరించిన వారుండేవారని, చరిత్రలూ, శిథిలాలూ వక్కాణిస్తున్నారు దీనినిబట్టి మహ్మదీయుల హయాంలోనూ గ్రంథాలయాలు ప్రబలవ్యాప్తి పొందాయనే చెప్పాలిమరి. ఆ శ్రేణిలో 'ఖుదాబక్ష్' ఎల్లప్పుడూ తప్పకుండా తలపుకు రాదగ్గవాడు. ఇదీ నాదాపు, గ్రంథాలయాల రెండవ—మూడవ దశల చరిత్రే అనుకుంటాను.—

ఇహ ఇప్పటి గ్రంథాలయాల్లో ప్రవేశిద్దాం. ఆవరసలో ప్రప్రథమంగా గణ్యతకు వచ్చేది ఇండియన్ యూనియన్లో బరోడా; నిర్బంధ విద్యావిధానం ద్వారా, ఉచిత గ్రంథాలయ ప్రణాళిక ద్వారానూ పదేళ్లలో నూటికి అరవైమందిని చదువుకున్న ప్రజగా తయారు చేసుకుంది. అక్కడ ఉన్నత గ్రంథాలయాలేగాక, సామాన్య గ్రంథాలయాలూ—సంచార గ్రంథాలయాలూ, పఠన మందిరాలూ కావల్సినన్ని అమర్చినై! ఈ మహోద్యమానికి ప్రభుత్వమూ, అధికార్లూ ఎనలేని సేనరు జారీ చేస్తున్నారు. ప్రజలు వీటిని శ్రద్ధాసక్తులతో అర్పిస్తున్నారు. భావిభారత మహాచరిత్రలో బరోడా గ్రంథాలయోద్యమాన్ని కెంపులతో చెక్కుతారు.

గ్రంథాలయోద్యమంలో బ్రిటిషాంధ్రదేశంలో శ్రీ పరవస్తు రంగాచార్లుగారు మొదలు, సూరి నరసింహశాస్త్రి, అయ్యంకి వెంకటరమయ్యగార్లవరకూ ప్రశస్యకృషి చేసేరే దాదాపు 800 గ్రంథాలయాలు ప్రజాసర్వస్వమై ప్రకాశిస్తున్నట్లు వింటున్నాం. అధికారం అధికారభేదాలనే ఘోషాకీటల్లో అంతరించిందట! చాలా గొప్ప మాటగాదూ ఇది మనకు!—మన రాష్ట్రంలోనే ననుకుంటా మాడపాటి తాతగారే గ్రంథాలయోద్యమానికి పురస్కులేమోనని! ఒక వేళ వారికంటె ముందే ఒకటి రెండు గ్రంథాలయాల్ని స్థాపించిన పుణ్యాత్ములుంటే, ఉన్నారుగాక;—నేడు తెలంగాణంలో సుమారు 200 గ్రంథాలయాలు సజీవాలుగా పనిచేస్తున్నవని వినాల్గుతున్నందుకు మనవాతావరణాన్ని బట్టి మనమూ ధన్యులమే ననిపిస్తోంది. గాని, తృప్తి అని చెప్పలేను. నేనే గాదు, ఎవరూగూడా. ఇప్పట్లోనూ—ఇంకా కొంతకాలందాకా అనుకుంటూ, ఎప్పుడో చెప్పే మాటంటే అది, ఇంకా గ్రంథాలయాలు విరివిగా స్థాపించబడాలి. అవి సక్రమపద్ధతుల్లో నడపబడాలి......

గ్రంథాలయాలు ధనికులకంటే బీదలకూ, విద్యాధికులకంటే సామాన్యచదువరులకూ ఉపయోగపడడంలో అద్వితీయమైనవని నేననుకుంటాను. కాని. ధనికులూ, విద్యాధికులూ ధర్మకర్తలై ఈ ఉద్యమాన్ని నడిపించాల్సిన భారం వారిపైనే ఉంది;—పుస్తకదానమూ, పుస్తకభాండాగారదానమూ వేలూ, లక్షలూ వెచ్చించి సత్కార్యాలు చేసే దాతుల దృష్టిలో పడకపోవడం మనదేశపు దురదృష్టాల్లో ఒకటి; సప్తసంతానాలు అని చెప్పబడే వాటికంటే ఈమహాయోవి ఆధికాధిక మనిపిస్తుం దినాకు. దీనిలో మానవుకి జీవితపరమావధి లక్ష్యసిద్ధి పొందటానికి వీలున్నది గనుకనే దీని కింత గొప్ప. అంచేత ఈ బరువంతా భాగ్యశాలుల భుజస్కంధాలమీదే ఉంది. ఉండాలిగూడానూ. అని అదరూ తొలిగిపోచోకూడదు. ప్రభుత్వం పరిపాలనాదక్షతతో చూడాలి—ప్రజలు సక్రమంగా ఆరాధించుకోవాలి, ప్రజలూ ప్రభుత్వమూ అనన్యంగా వుండనిదాడు గ్రంథాలయ నిర్వహణమూ కత్తిమీదిసామే. అన్ని హంగులూ సరిగా ఉన్నవాడే నిర్వాహకులు ఎంతో ఓపిగ్గా, సాక్షిగా ఉంటేనేగాని సాగదు రథం; గిల్లికజ్జా పెట్టకోటానికి అనేకమంది ఎదురు చూస్తోంటారు గోముఖవ్యాఘ్రాలు! చందాదారుగా చేరండని బ్రతిమిలాడినా అంగీకరించడానికి వినకాడేవారంతా ఇంట్లకు పుస్తకాలివ్వంచమని కాలుకాలిన పిల్లిలాగా వెంటతిరుగుతారు ఆ కాస్సేపూ! వీట్టేదంటే ముక్తిమోక్షవచ్చినంత కోపమూ వస్తుంది ఆ ఉత్తముపురుషులకు!

ఇంకోరకం: ఉన్న ఒక్క పత్రికనూ నలుగురు చందాదార్లూ మాకంటె మాకియ్యమంటారు. ఆ తఫీరీకు కుదరదు, తదాబోయినా నాకు మదంటే నాకు ముందటారు. ఈనియామకంతో కృతఘ్నత అవుతుంది. ఈ చిక్కు గుక్కతిప్పుకోలేకనీ స్థాలిది!

మరోరకం: చందా అడిగడానికి వెళ్లితే, రేపూ. మాపూ, వాయిదాలూ. లేక, రుసరుసలూ, అంతకూ మొండికేస్తే ఏదో తెలియని వంక కల్పించుకుని పేరు తీసెయ్యమని నోటితోనో నోసలుతోనో చెబుతారు కొందరు. దాంతో కొంప కూలిపోతుంది కోశం!

తడవకు పెద్ద పుస్తకమైతే ఒకటే, చిన్నవైతే రెండూ, ఇంటికు, (చందాదార్లకు) ఇచ్చే నియమం ఉందనుకోండి, ఉన్నా అరడజనూ, డజనూ పుస్తకాలబొత్తులు నలుగురి పేర్లా రాసి తీసుకుపోయి, అన్నిటికంటే నిర్లక్ష్యమైనవాటినిగా ఈపుస్తకాల నటూయిటూ పారేసి, కొన్ని చింపి, మరికొన్ని అపశేఅహుతి చేసి, ఎక్కడిగితే కొప్పడి, ఘట్టిగా అడిగితే పోయిందని చెప్పి ఖరీది యిమ్మంటే పోట్లాడి, పేరే తీసేయించుకుంటారు గ్రంథాలయ నాశకులు ఒకకొందరు!!

తెలియని తనాన్నంతా తెలివితేతనం అనుకొని చాలా మూలా లేని సూచనలు తెచ్చి నెత్తిమీద విసిరి వాటిని ఆచరణలో పెట్టించడానికి యత్నించి, సాధ్యం కానివాటినె పంపరాయివాళ్లమీదా—అయిన పనన్నీ తమకీర్తులుగా ధరించాలని చూసేవాళ్లూ ఉంటారు అసలు కొందరు—ఇల్లాంటి విపుంఖానుపుంఖాలుగా చూపవచ్చును ఇంకా;—కాని ఈ అమూల్యమైన సమయాన్ని ఎక్కువగా నేనే వెచ్చించటం ఏమంతి బాగ్యకాదు!! కనుక ఈ చేటభాగానికి ఉటంకింపు పెడతాను.. పైన పేర్కొన్న రకాలన్నీ కాక, వర్గభేదాలూ—మత భేదాలూ-అదికా భేదాలూ--ఆఖరికి అభిప్రాయభేదాలూ. సిద్ధమై నానాకలతలూ--అలతలూ వచ్చి, నిర్వాహకులను నిరుత్సాహపడజేసే!—అందుకే పెద్ద తొడుగులాంటి సంహారాన్ని లాగే ఓప్పికావాలన్నాను. ప్రజలు గ్రంథాలయాల్ని సొంత హక్కుగానూ—పవిత్రమైందిగానూ, అనుమానమైనా వాడుకోవాలి, గ్రంథాలయంలో ఖర్కాయితమ్మక్క పోయిందంటే నలుగురూ ఉక్కుకుక్కగా నిలవడి మళ్లా దాన్ని గ్రంథాలయప్రవేశం చేయించేటంత పట్టుదల వుంటేనేగాని గ్రంథాలయాలు ఎదుగుబొదుగుగా సాగవు! గ్రంథాలయ నిర్వహణకు ప్రభుత్వంకంటేగూడా ప్రజల బాధ్యతే గురుతరమైంది.

ఇహ, గ్రంథాలయంలో ఉండాల్సిన పుస్తకాలు: వర్తమానకాలపు విజ్ఞానాన్ని సామాన్యులు చదువు చదువుకున్న ప్రజాబాహుళ్యానికి సుబోధమయ్యే విధంగా రాసిన వేకావాలి. కేవలం పాండిత్య గ్రంథాలే లైబ్రరీలో నింపితే ఆటకదుతుంది. ఈమాటల్ల అచ్చం తేలికబారు పుస్తకాలే పోగుచేసి నారక్తిగా ఉండదు--గ్రంథాలయ మహాసభవారు ముఖ్యంగా గ్రంథాలయాలకు తెప్పించాల్సిన పుస్తకాల పట్టికను సిద్ధపరిచే యత్నం చేస్తోన్నారట! చేశారో!! మొత్తంమీద గ్రంథాలయపు డబ్బు ఖర్చుపెట్టి తెప్పించే పుస్తకాల విషయంలోనే పై వ్యాఖ్యానాలు అన్వయిస్తాయిగాని--ఉచితంగా వచ్చేపుస్తకాలు ఏవైనా ఎల్లాటివైనా--ఆఖరికి కేట్లాగైనా సరే, గ్రంథాలయంలో స్థానంఇవ్వాల్సిందే! ఈ పుస్తకం గ్రంథాలయంలో ఉండకూడదు అన్నమాట ఉండకూడదు!

కాని, గ్రంథాలయాలవారు గ్రంథరచయితలను ఉచితంగాపుస్తకాలు పంపమని, అపుస్తకం అచ్చాఫీసుగడప దాటుతుందో లేదో, ఉత్తరాలు కొరవరింపు; ఇదులో పొక్కిటే పుస్తకమని కవి కోరినా, ఈయనిచ్చే మహాభాగ్యానికి ఇదో చక్కటో అని ఈసడించుకోటమూ ఉంటుంది. ఇది పాపతూ అసహ్యమైన దిరేవాటు. ఈ పద్ధతి మానకుంటే ఒక సంస్థ పురజీవింజడుతుంది. కనక గ్రంథాలయాల తప్పకుండా కవుల (గ్రంథకర్తల) దగ్గర పుస్తకాలు డబ్బిచ్చి కొనాలి:--నేనూ ఏ కొంచెమో కవిత్వం అటూ రాసేవాణ్ణే అందుకే ఇల్లా జెప్తుంటేననీ అని పిస్తుంది మీకు!--వినా ఆత్మ ప్రేరేపించిన పరమసత్యాన్ని గుండెలో కుదించి భ్రుంగించుకోలేకపోయా—

అచ్చుపుస్తకాలే ఎంతో గొప్పవని ఎంతోమంది అనుకోటం నే నెరుగుదును. కాని, చేతిరాతపుస్తకాలు దొరికితే వాటికుండే విలువ వీటికి ఎంతమాత్రమూ—ఏకోశానా ఉండదు. వాటిని జాగ్రత్తచెయ్యాలి,—తాళపత్రగ్రంథాలు గూడా మన కాయితంపుస్తకాలకంటే గౌరవనైనవే! వాటిని సంపాయించి భీరువాలు నింపాలి—యామహోన్నత నిజాం ప్రభుత్వంవారు పాకీం మొహమ్మదఖాసిం అనేవారిద్ద, ఏవిధంగా ఉన్నారో మనకు తెలియదుగానీండీ! ఉన్నట్టి తాటాకుల పుస్తకాల్ని పదివేలను వెలిచ్చికొని, ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీలో భద్రపరిచార్ట! వాటిలో అనేక సంస్కృత ఆంధ్రగ్రంథాలూ—ఇంకా ఇతర భాషా పుస్తకాలూ-అమూల్యమైన విలక్షమైనా యాట!! ఇందులో క్రీస్తుపూర్వం మూడో శతాబ్దివని పండితులనుకుంటోన్న రెండు బ్రాహ్మీ (లిపి) గ్రంథాలున్నాయిట—ఒకపుస్తకం ఉర్దూ ది తెలుగు (లిపి)లో ఉందిట! ఈ గ్రంథ-మదాయాన్ని పాకీంసాహెబుగారు దాచిపెట్టి ఉంచటమూ, సర్కారువారు కొని జాగ్రత్తపెట్టడమూ విలువైనపనులు కావూ! వారుభయులూ అభినందనార్హులు కాకుండా పోరు. కాని ఈ పుస్తకాలను అపేక్షగలవాళ్లంతా చదువుకోటానికి అధికారం కలిగి వుండాలి. అప్పుడింకా—నిజంగా—విలువ హెచ్చుతుందిగాదూ!!

ఈ సందర్భంలో దేశీయ సోదరులతో ఒక ముఖ్యమైన అభ్యర్థన చేస్తున్నాను. అటకలపైన బూజుపట్టీ— చెదలుపట్టీ—జీర్ణించిపోతున్న తాళపత్రగ్రంథాలను అల్లాగే వాడి పాండని ఉపేక్షబూనక ఒక్కు తిరిగిచ్చిచూసే ఓపిక వుంటే చూసి. తమకు అనవసమని తోచిన గ్రంథాలను దగ్గరి గ్రంథాలయానికి ఇవ్వటమో, ఆ మంచిపుస్తకాలు ఏ పబ్లిషరుకన్నా ప్రకటనార్థం యిచ్చి ఫలితం పొందినాపరే. లేక పరమేశ్వరుడు తమకే ఆ శక్తి యిచ్చివుంటే తమరే ప్రచురించి దానివల్లనైన లాభాన్ని దేశానికీ, తమకూ కలిగించకోవడమో, అసలు పుస్తకాల్నే విప్పేఓపికే కొరత ఐతే దగ్గరలోవున్న బీద గ్రంథాలయమైతే ఉచితంగానూ, డబ్బుగలదైతే విత్తానికీ, మొత్తంపుస్తకాలన్నీ ఏటా విక్రయించటమో,ఈ పద్ధతుల్లో ఏది అవలంబించినా, తాటాకు పుస్తకాలు మటుకూ అటకలు దిగితేనేగాని ఇంకా మనకు, అస్తి. నాస్తి. విచిత్రాహేతువులైన అనేక అమూల్య గ్రంథాలెన్నోట్టా తెలియదు. కనుక ఈ పుణ్యాన్ని కట్టకోవడమునకు కాళిమంతా నడుంగట్టుకోవాలి—శాసనాలుగూడా జాడా దొరకితే జాప్యంచేయకూడదు. కూడబెట్టాలి గ్రంథాలయాల్లో; ఇవే మన పూర్వచరిత్రను త్రవ్వి తలకత్తే బనిలోపకరణాలు.

ఇంకా అనేకం ఉన్నాయి—గ్రంథాలయాలు విజ్ఞానకేంద్రాలుగా ప్రకాశించటానికి. ఇప్పుడు నేనా గ్రంథాలయశాస్త్రం యావత్తూ మీ యెదుట ఏకరువు పెట్టడానికి విద్యాంసుణ్ణిగాను—

వెనుకటికి మనవాళ్ళు శివాలయం లేని వూళ్లో భోంచెయ్యకూడదు. అనేవారు, నన్నడిగితే గ్రంథాలయం లేని వూళ్లో ఉండకూడదంటాను. ఎంచేతనంటే: ఆత్మవికాసమూ—తద్వారా ముక్తి. శివాలయంవల్ల కలిగే ప్రయోజనాలే ఐతే, గ్రంథాలయం ఆ అంతస్సుకే మీదిగదని మనం గుర్తుంచుకోటం అవసరం.

జపానులో ప్రతియేటా పుస్తక సప్తాహం చేస్తూంటారు.

వెలుగును పొందటానికి అందరూ అర్హులే. వాయువును పీల్చడమునకు అనర్హులెవరూ వుండరు. జలం సేవించటానికి అనిభాజ్యమై

చ్యుతి

(11 వ పేజీ తరువాయి)

ఉంది. అతన్ని సూర్యనారాయణ ఒకసారి అడిగాడు. 'ఏమిటోయ్ గొడవగొడవ చేసేస్తున్నావు?' 'గాలిలో గంధర్వులతో యుద్ధంచేస్తున్నా' నన్నాడు. 'నేల మీద చెయ్యగూడదూ?' 'మీరంతా చూశేస్తారు' 'ఒకసారి నేను గాలిలోకి వస్తానుండు' 'వచ్చావంటే తల పగలగొట్టేస్తాను.'

అతనెందుకో తన్నంతగా మాటుబరచడానికి ప్రయత్నిస్తాడు. అబద్ధమాడలేడు. అందుకే అర్థంకాకుండా మాట్లాడేవాడు. వఱ గురి దృష్టిలోనూ అతడు బాగుపడ్డాడనిపించుకోడం చస్తే వప్పుకోడు. బాగుపడతాడేమోనని ఆశ మాత్రం అందరికీ కలిగిస్తాడు. ఒడ్డు ననుసరించే యీదుతాడుగాని ఒడ్డుమాత్రం యెక్కడు: యెప్పుడైనా యెక్కిపోవచ్చుగదా అని ఉద్దేశమో, ఎక్కరాదని నిశ్చయమో తెలియదు.

అసలువిషయం నాలుగుమాటల్లోనే ఉంది. అతడు ఫలానా పిల్లని పెళ్లాడదామని నిశ్చయించుకున్నాడు. వాళ్లకద్ది ఒప్పుకోలేదు.

ఈసమస్యలోనించి ఇట్టే బయలుపడవచ్చు! కాని బయటపడడం అతని స్వభావానికే విరుద్ధమేమో! ప్రస్తుతం దేనినో వెతుక్కుంటూ వెళ్లిపోయాడు. అయితే అతడు తను వెతికేదాన్ని పొందబోవటంలేదనీ, పొందినది కాక మరేదో వెతుకుతూ ఉంటాడనీ, ఆ వెతకటానికి అంతు లేదేమోననీ నా కనిపిస్తోంది......

గౌరి అన్న ముగించాడు.

౪

అతను సముద్రం ఒడ్డుకి వెళ్లడం మానేశాడు. అతను సముద్రపుఒడ్డుకి వెళ్లిన ఆఖరిరోజున అతని కేదో కథ జ్ఞాపకం వచ్చింది. ఆకథకీ సముద్రానికీ తనకీ కనపడని సంబంధం యేదో ఉంది.

క్రైస్తవులగాథలో, సేటన్ అనే వాడు దేవేంద్రపదవిలో ఉండేవాడు. భగవంతుడు అతనిని ఎంతో కరుణతో చూచేవాడు. అయినా అతనిలో ఎందుకో ఒక భావం పుట్టింది. తన జీవితంమీద తనకే హక్కు లేదనీ, అది భగవంతుడి చేతిలో వుందనీ పిరికిపడ్డాడు. అందువల్ల భగవంతుడి చేతులోనించి లాక్కుందామని గుంజుకున్నాడు. భగవంతుడు పట్టు వదిలాడు. తనజీవితం మీద తనకి హక్కు సంప్రాప్తమయింది. ఆ కారణంగా, అతనికి పట్టుకొమ్మ లేకుండాపోయింది. ఆ మహోన్నతమైన దేవేంద్రపదవిలోనుంచి, తొమ్మిది రాత్రిళ్లు తొమ్మిది పగళ్లుపాటు పాతాళంలోకి దిగజారిపోయాడు.

తను ప్రస్తుతం ఆ తొమ్మిదిపగళ్ల తొమ్మిది రాత్రిళ్ల ప్రయాణంలో ఉన్నాడా? ఆప్రయాణంలో తానే కాదు, తనతోపాటు సముద్రం, యీప్రపంచంకూడా అదేప్రయాణంలో చిక్కుకున్నాయేమో!

సేటన్ దేవేంద్రపదవిలోనే ఉండిపోతే? అది వీల్లేదు.

దుర్యోధనుడన్నాడుకదూ భారతంలో? "నాకు ధర్మంతెలుసును. కాని ఆచరించలేకపోతున్నాను. నాకు అధర్మంగూడా తెలుసును, కాని దాన్నుంచి తప్పించుకోలేకపోతున్నాను. ఎవరో నాలో కూచుని నన్ను శాసిస్తున్నారు. నేను తలొగ్గుతానంతే?"

అందుచేతనే అతడు తిరిగి పోదల్చుకోలేదు. అధర్మానికి వెన్నుచూపి ధర్మంలోకి పారిపోదల్చుకోలేదు. అయితే అధర్మానికీ ధర్మానికీ పేరులు పెట్టిం దెవరు? ఈ కవల పోలికలు యెంత మోసం చేస్తాయి! ధర్మం నోట్లో వేలు పెట్టి, కటిక్కన కరిస్తే అధర్మం అని తెలుసుకోవచ్చు. అందాకా ఏది అధర్మమో!

సేటన్ తన కష్టాలు తను పడ్డానికికూడా అనుమతినడిగాడు. తన సుఖాలకోసమే తాను స్వతంత్రుడు కాలేదు. కాని భగవంతుడు కరుణామయుడు గనుక నీవు, నేనూ, కోరి కష్టాల్లో దూకడం వప్పుకోడు. ఆయనకూడా బోధించి చూస్తాడు. మంకుపట్టు పట్టిన బిడ్డని, చూస్తూ చూస్తూ దీపాన్ని ముట్టుకోనిస్తుందా తల్లి?

అయినా, సేటన్‌కు తను చేయాలనుకున్న దానిలో అంత ప్రీతి. తనకుకూడా తన కర్తవ్యం మీద, సేటన్ కున్నంత ప్రీతి. కాని అనుమానం ఏమంటే, తన ప్రీతి, భగవంతునికి తన కృత్యం యందుండే ప్రీతివంటిదేమోనని. అది సేటన్ వంటిదే యెందుకు కావాలి? ఒకవేళ అయితే తప్పేమిటి?

ఇంతకీ అతను సముద్రాని కెళ్లడం మానేశాడు.

హక్కుంది సర్వే సర్వత్రా. విద్యగూడా వీటి సన్నిహితజ్ఞాతే; విద్యంటే భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించే మహాదృష్టి అన్నమాట. ఈ దృష్టి సమ్యగ్దర్శనాసక్తిచేతగాని కలుగదు. తద్దర్శనానికి విజ్ఞాన విశ్వవిద్యాలయాలైన గ్రంథాలయాల్లో ఉపాసించి, సాధించుకోడానికి బాగా వీలుంది. ఆచార్యుడూ—ఛాత్రుడూ. తానే ఐ; అధికారీ—అనధికారీ తానే ఐ; స్వార్థుడూ—పరార్థుడూ. తానేఐ; చక్కగా విద్యా వ్యవసాయం సాగించుకోవచ్చును. అది లౌకిక మనండి, పారలౌకిక మనండి—ఈ సాధనలో రెండు బీజాలూ ఉన్నాయి. దేనికి తడి తగిల్తే అది ఫలితంలోకివస్తుంది. వక్తవ్యం ఫలితాంశాలు కాదుగాబట్టి సాధారణంగాసర్వ్యాగ్రంథాలయాల్ని గురించి ఏ అభిప్రాయాలు కలిగి ఉన్నారో వాటిమీద విమర్శ కురిపించి ఏదో మహా మార్గం చూపించబోవటం నాయొక్క శక్తీ యుక్తీ—కాదు గనుకనూ, చాటలో వెలక్కాయల్లాంటి ఈ మూడుముక్కల్లో మీవద్ద సెలవు తీసుకోగోరుతున్నా. కాలాతీతం అయినందుకు మన్నించండి!

గ్రంథాలయ మహాసభవారు ఏడాదికో ఉత్సవం చేసుకుని తృప్తిపడి ఊరుకుంటం ఏమంత మంచిదికాదు. సంవత్సరం పొడుగు నాదేశంలో సంచారం—ప్రచారం సాగించాలిమరి! అలా అలా అసాధ్యమనుకున్నా ప్రతి గ్రంథాలయమూ వార్షికోత్సవంచేసేలా చేసి, ప్రతి గ్రంథాలయ సభకున్నూ తప్పక వచ్చి, ఉపన్యాసాలూ వగైరాలతో ప్రబోధం చెయ్యాలి.

ఇప్పుడిది గ్రంథాలయ మహాసభారంగంగనుక గ్రంథాలయస్థాపనా—పోషణా—నిర్వహణా-మొదలయిన ఇత్యర్థాలను ఈ వేదికనించి ఇప్పుడే వింటూ, పెద్దపెద్దలంతా విచ్చేశారు. ప్రసంగించారు. ఇంకా మాట్లాడ్తారు. మనకొక్కటల్పం దల్లా వింటానికి ఓపిక—నా ఉపన్యాసం ముగింపు అయినట్టే. నా మాటల్లో ఉంటే ఏమన్నా ఒడుదుడుకుల్ని అనుగ్రహంవల్ల మీరు సవరించుకుంటూనే వింటున్నారుగనుక, మళ్ళా సవరింపుల ధ్యానం చేయక అశ్రమ మీ కిచ్చినందుకు మీలో ప్రతి ఒక్కరికీ నమస్కృతాలర్పిస్తూన్నా......

షరా:-ఈ ప్రసంగం 1944 లో సింగరేణీ కాలరీసులో జరిగిన ఆం. దే. గ్రం. మహాసభలో చేసినది.

పౌరుల ప్రాథమికహక్కులు

(10వ పేజీ తరువాయి)

కాపాడవలెనను మిషపైకాని ఈ ప్రాథమిక హక్కులకు ప్రత్యక్షవిరోధముగా శాసనములు చేయవలసిన అవసరము ఏర్పడుచో అట్టి సమయములలో కూడ ఈ 13 సెక్షను 1 వ క్లాజు బాధింపజాలదని 13 వ సెక్షను 2 వ క్లాజు మొదలు 6 వ క్లాజు వఱకు మినహా ఇంపులలో తెలియజేసి ఉన్నారు.

ఈ మినహా ఇంపులు పౌర ప్రాథమిక హక్కులకు ప్రత్యక్షవిరోధముగా ఉన్నవి. వీని ప్రాముఖ్యతను తొలగించుటకు కార్యనిర్వాహకవర్గమువారికిని, శాసనసభలకును అడ్డులేని అధికారములు రాజ్యాంగ చట్టములోనే కల్పింపబడినవి. పౌర ప్రాథమిక హక్కులపై రాజ్యాంగ చట్టములోనే కార్యనిర్వాహకవర్గము వారికిని, శాసనసభలకును ఇట్టి హద్దులేని అధికారములను కల్పించుట చూడ ప్రభుత్వములు సాగుటకొఱకే ప్రజలు జీవించుచున్నారను భావము ఇండియా స్వతంత్ర దేశమైనను పోలేదని తోచుచున్నది. ప్రజల ప్రాథమికహక్కులను రక్షించుటకొఱకే ప్రభుత్వములను ఏర్పఱుపవలెనన్న భావములు స్వాతంత్ర ఇండియా దేశనాయకులకు తట్టలేదు కాబోలు. ఇది ఎంతటి ఘోరము. ఇందుకా—ఇట్టి నిర్వీర్యమైన రాజ్యాంగ విధాన కొఱకా అనేకమంది నాయకోత్తములు, స్వాతంత్ర్యయోధులు పడరాని బాధలు పడి తమ సర్వస్వమును త్యాగముచేసి అసువులను బాసిఉన్నారు?

ఇండియాకు స్వాతంత్ర్యము లభించిన ఈ 10 నెలలుగా పౌరహక్కులకు భంగకరమైన నిర్బంధ శాసనములను రాష్ట్రీయకాంగ్రెసు ప్రభుత్వములవారు గావించిఉన్నారు. ఎంతోమంది పౌరులను విచారణ లేక నిర్బంధములలో ఉంచిఉన్నారు. అన్నవస్త్రములకు బీదప్రజానీకము దూరమై మలమల మాడుచున్నది. ఇన్ని కష్టములు పడుచున్నను దేశ ఉత్తమనాయక వర్గమునకు చేరిన శ్రీ జవహర్‌లాలు నెహ్రూ, సర్దారు వల్లభాయిపటేలు, బాబు రాజేంద్ర ప్రసాదు మొదలగు వారిపై గల అఖండవిశ్వాసమువలన దేశీయులు ఓర్పుపట్టుకొని ఉన్నారు. నూతన రాజ్యాంగ చట్టము అమలులోనికి రాగానే ప్రస్తుత నిర్బంధశాసనములెల్ల రద్దు అగును. ఇప్పుడు విచారణ లేక నిర్బంధములో ఉంచబడిన పౌరులు ఎల్లరు విడుదల చేయబడుదురు. పౌరుల ప్రాథమిక హక్కుల సంరక్షణ విషయమై ప్రభుత్వమువారే అన్నివిధములైన హామీల నిచ్చెదరు. కార్యనిర్వాహక వర్గమువారికిని శాసనసభలకును ఇందులో ఏలాటి జోక్యము ఉండబోదు కులతత్వములపై ఉద్యోగములను పంచిపెట్ట, విద్యాలయములలోనికి ప్రవేశ మొసగుద తొలగిపోవును. బీద ప్రజానీకమునకు వలయునంత అన్నము కావలసినంత గుడ్డ చౌక ధరలకు లభించును. మీదుమిక్కిలి రామరాజ్యమే స్థాపింపబడును ఇప్పుడు. తయారు చేయబోవు రాజ్యాంగ చట్టము పౌరుల స్వాతంత్ర్యపత్రముగా (Charter of Liberties) పై తెలిపిన ఉత్తమశ్రేణికి చేరిన నాయకులు తయారుచేసి ప్రజానీకమునకు అర్పించెదరని గంపెడు ఆశతో ఉవ్విళ్ళూరుచున్నారు.

కాని ఇండియారాజ్యాంగ చిత్తుచట్టములో పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరముగా - విషబీజములుగా - సూచింపబడిన మినహాయింపులన్నిటిని సంపూర్ణముగా తొలగింపవలెను. ఈ హక్కులపై ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గము వారికి కాని శాసనసభలకు గాని అణుమాత్రమైనను అధికారము ఇవ్వరాదు. పౌరహక్కులను సంరక్షించు బాధ్యత కేంద్రన్యాయస్థానమునకున్నూ, ఆ న్యాయస్థానము యొక్క అధికారులకు లోనైన రాష్ట్రీయ ప్రధాన న్యాయస్థానముల కైనను ఒప్పగింపవలెను. ప్రధానన్యాయస్థానములపై కార్యనిర్వాహక వర్గము వారికి ఉండు అధికారమును తొలగింపవలెను. ఇట్లు చేసిననే కాని పౌరుల ప్రాథమిక హక్కులు రక్షింపబడవు.

దేశీయుల అదృష్టవశమున జూలై నెలలో కూడ వలసిన రాజ్యాంగపరిషత్తు మహాసభ కారణాంతరములచే రెండునెలలు వాయిదా వేయబడినది. ఈ అవకాశమును బాధ్యతగల పౌరులెల్లరును గైకొని ప్రతిగ్రామములోను సభలను జరుపవలెను. ఇండియా రాజ్యాంగ చిత్తుచట్టములో మూడవ అధ్యాయములో సూచించిన మినహాయింపులను సంపూర్ణముగా తొలగింపవలెను. వానితో కార్యనిర్వాహక వర్గమువారికిగాని శాసనసభలకుగాని జోక్యము కలిగించుకొను అధికారము ఉండకూడదు. ఆ హక్కులను కాపాడు బాధ్యత ఇండియా కేంద్ర న్యాయస్థానమునకు ఒప్పగింపవలెను. ఆత్మరక్షణకై స్వతంత్ర ఇండియా పౌరులెల్లరు తగుమైన ఆయుధములను కలిగి యుండవచ్చును. ఇండియా యూనియ పౌరులలో పనిలేని వారికి పనులు చూపించికాని, పనులు చూపింపజాలనిచో వారికి అన్నవస్త్రములను ఒసగు బాధ్యత ప్రభుత్వమువారే వహింపవలెనని కూడ రాజ్యాంగ విధానములో స్పష్టముగాను, అసందిగ్ధపదములతోను ప్రకటింపవలెనని తీర్మానములను కావింపవలెను. ఈ తీర్మానములను ఇండియా ప్రధానమంత్రిగారైన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ గారికిని రాజ్యాంగ పరిషత్తు మహాసభ అధ్యక్షులైన బాబు రాజేంద్ర ప్రసాదుగారికిని సత్వరముగా అందచేయవలయునని విన్నవించుచున్నాము. ఈ సమస్యకు బాధ్యత గల వార్తాపత్రికలన్నియు ఎక్కువ ప్రాముఖ్యత ఒసగి తీవ్రమైన ఆందోళన సాగించవలెనని ప్రార్థించుచున్నాము.

బాలానందం.

(15 వ పేజీ తరువాయి)

రాణీ ఈలోపల గులాబీ పూలను చూసింది. చూసి "అదా సంగతి! తెలిసిందిలే! వీళ్ళ తల కొట్టెయ్యండిరా!" అని ఆజ్ఞ ఇచ్చి పరివారసమేతంగా ముందుకు కదిలి పోయింది. ముగ్గురు సైనికులు మాత్రమే తోటమాలుల తలకాయలు కొట్టేసేందుకు మిగిలారు.

సైనికులు పట్టుకోటాని కొస్తూంటే, తోటమాలులు తప్పించుకొని పరుగెత్తి, పాపవెనక్కి చేరి, "రక్షించాలి! రక్షించాలి" అంటూ పాపగౌను పట్టుకు వేళ్ళాడటం మొదలు పెట్టారు.

"మీ కేం భయంలేదు; మీ తలకాయి ఎవళ్లూ కొట్టేయకుండా చూస్తాగా." అంటూ పాప వాళ్లకి ముగ్గురినీ అక్కడ ఉన్న ఒక పెద్ద పూలమొక్కల కుండులో దాచింది. సైనికులు వాళ్లకోసం రెండు మూడు నిమిషాలు అటూ ఇటూ వెదకి, రాణీగారి పరివారంతో కలుసుకొనేందుకు పరుగెత్తారు.

"వాళ్ల తలకాయలు కొట్టేశారా?" అంటూ రాణి కేకపెట్టింది.

"చిత్తం. మహారాణీగారు, తమ దయుండి, వాళ్ల తలకాయలు ఎగిరిపోయాయండి" అంటూ ముగ్గురు సైనికులూ కేకవేశారు.

"అబ్బా! నీకు పచ్చీస్ ఆట వచ్చునా?" అని మళ్లీ కేక వేసింది.

ఈ మాటు పాప నడుగుతోందని సైనికులు ముగ్గురూ మాట్లాడకుండా పాపవంక చూశారు.

"ఆ! వచ్చును" అంటూ పాప గట్టిగా కేకవేసింది.

"అయితే ఇల్లా రా!" అంటూ రాణీ గావుకేక పెడ్తూ అరిచింది.

"ఏం జరుగుతుందో, తమాషా చూద్దా" మనుకొంటూ కులాసాగా పాప, వాళ్లమందలో కలుసుకొని నడవసాగింది.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

తూర్పు బెంగాల్ పారిశ్రామికాభివృద్ధి

పాకిస్థాన్ పరిశ్రమల శాఖమంత్రి ఫజ్లుర్ రహమాన్ ఈమధ్య తూర్పుబెంగాల్ రాష్ట్రములో పర్యటించి, పరిశ్రమాభివృద్ధికి గల అవకాశములను పరిశీలించెను. పర్యటన ముగిసిన తరువాత ఢక్కాలో పత్రికా విలేఖరుల సమావేశములో ఉపన్యసించుచు తూర్పుబెంగాల్ పారిశ్రామికాభివృద్ధికి గల అవకాశములను వివరించెను.

తూర్పుబెంగాల్‌లో ముఖ్యమైన పారిశ్రామిక ముడిపదార్థము జనపనార. భారతదేశము విభజితమైపోయిన తర్వాతకూడా ప్రపంచ ఉత్పత్తిలో సగభాగము జనపనార తూర్పుబెంగాల్‌లోనే పండును. కాని జనపనార మిల్లు ఒక్కటికూడ తూర్పుబెంగాల్‌లో లేదు. మిల్లులన్నియు కలకత్తా పరిసరప్రాంతములోనే వున్నవి. తూర్పుబెంగాల్‌నుండి జనపనార ధారాళముగా దిగుమతి కాకపోయినచో ఈ మిల్లులలో ఎక్కువభాగము మూసివేయవలసి వచ్చును. కలకత్తా జనపనార మిల్లులపై దెబ్బ తీయుటకు పాకిస్థాన్ ప్రభుత్వము జనపనార ఎగుమతిపై ఇదివరకే సుంకములను విధించినది. తూర్పుబెంగాల్‌లో జనపనార మిల్లులను స్థాపించుకుని, చిట్టగాంగ్ రేవును అభివృద్ధిపరచి, రెండువిధముల అభివృద్ధిజెందవలెనని తూర్పుబెంగాల్ ప్రభుత్వము ఆశించుచున్నది. ఈ విధానము ప్రకారమే, అయిదారు సంవత్సరములలో కనీసము పది జనపనారమిల్లులైనా తూర్పుబెంగాల్‌లో స్థాపింపదలచినట్లు ఫజ్లుర్ రహమాన్ ఢక్కాలో ప్రకటించెను. రోడ్లు, కాలువల మార్గములుగావుండి, ఇతర సౌకర్యములుకూడ కలిగివున్న నారాయణగంజ్, ఛాంద్‌పూర్, భైరబ్‌బజార్ మొదలగు పట్టణములలో ఈ మిల్లులు స్థాపింపబడునట. జనపనారమిల్లులుగాక, జనపనారను బేళ్లుగా కట్టు మిల్లులు రాష్ట్రమంతటా ఒకటిన్నర సంవత్సరములో స్థాపించదలచినట్లు కూడ ఈయన స్పష్టపరచెను. ఈ మిల్లులు స్థాపింపబడిన తర్వాత తూర్పు బెంగాల్ జనపనార ఆ రాష్ట్రములోనే బేళ్ళుకట్టి, చిట్టగాంగ్ రేవుగుండా విదేశములకు ఎగుమతి చేయుటకు వీలగును.

తూర్పుబెంగాల్ అడవులలో కాగితపరిశ్రమకు పనికివచ్చు వెదురు విరివిగా లభించును. దీనిని వినియోగించి, భారీగా కాగితపుపరిశ్రమ నభివృద్ధి చేసెదరట. ఈపరిశ్రమను స్థాపించుటకెవ్వరైన పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చినచో వారికన్ని సౌకర్యములు కలుగజేసి, యంత్రసామగ్రి వెంటనే లభించునట్లు చేసెదమని మంత్రి ప్రకటించినాడు.

తూర్పుబెంగాల్ తోళ్ళు ఇప్పుడు ఎగుమతి చేయబడుచున్నవి. వానిని శుభ్రపరచుటకు తోళ్ళ కంపెనీలను తూర్పుబెంగాల్‌లోనే స్థాపించవలెనని మంత్రిగారు హెచ్చరించిరి. తోళ్ళను శుభ్రమొనర్చు పరిశ్రమ ఏర్పడిన తర్వాత త్వరలోనే చెప్పుల పరిశ్రమను స్థాపించెదరట. కొబ్బరి, పొగాకు, సిమెంటు, పంచదార, నిప్పుపెట్టెలు మొదలగు పరిశ్రమలను స్థాపించుటకు గల అవకాశమునుకూడ మంత్రి వివరించెను.

పరిశ్రమలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేయుటకు ఒక పెద్ద హైడ్రో-ఎలక్ట్రిక్ ప్రాజెక్టు తలపెట్టబడినది. ఇదే కర్ణఫూలీ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు స్థలనిర్ణయము తప్ప తక్కిన ఏర్పాట్లు, ప్లాన్లు అన్నీ తయారైనవి. దీనితోపాటు కొన్ని థర్మల్ స్టేషన్లు కూడ అవుసరమైనచోట్ల నిర్మించి, సంవత్సరం పొడుగునా విద్యుచ్ఛక్తి సరఫరా అగునట్లు చేసెదరు. ఈ ప్రాజెక్టు నిర్మాణము అయిదుసంవత్సరాలలో పూర్తియగును. అప్పుడు 40 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తియగును.

ప్రత్తి పరిశ్రమ నభివృద్ధిపరచు పథకములను గురించి గూడ ఈయన ప్రస్తావించెను. త్వరలోనే పాకిస్థాన్‌కు ఒక లక్ష మరకదుర్లు రానున్నవి. వీనిపై తయారైన నూలు మరమగ్గములకుగాక చేనేత మగ్గములకు సరఫరా చేసెదరట. కుటీరపరిశ్రమలను ప్రోత్సహించవలెననియే పాకిస్థాన్ ప్రభుత్వ అభిప్రాయము. దేశమంతటా రాట్నముపై నూలు వడకుటను ప్రోత్సహించుటకు ఇప్పుడు పథకములు తయారు చేయబడుచున్నవి.

పరిశ్రమలను జాతీయముచేయుటను గూర్చి ప్రసంగించుచు, ప్రస్తుత సమయమున అదికూడదని రహమాన్ చెప్పెను. పారిశ్రామికాభివృద్ధి బాగుగా జరిగి, అనుభవశాలురు ఎక్కువమంది తేలికగా లభించుచున్నప్పుడు, ప్రభుత్వమునకు ధనము పుష్కలముగా నున్నప్పుడు పరిశ్రమలను జాతీయము చేయవచ్చును. ప్రస్తుతము పాకిస్థాన్‌లో అట్టి పరిస్థితుల లేవు కాబట్టి దేశస్థులైనా సరే పరిశ్రమలను స్థాపించుటను ప్రోత్సహించవలసినదే, విదేశస్థులైనా సరే విదేశముల పెట్టుబడి దేశమునకు ప్రమాదకరము కాకుండ తగు జాగ్రత్తలు తీసికొనబడినవని ఫజ్లుర్ రహమాన్ తెలియజేసెను.

మద్రాసు పారిశ్రామిక వేత్తల సమావేశము

చెన్నరాష్ట్ర పారిశ్రామిక శాఖమంత్రి శ్రీ సీతారామరెడ్డిగారు, రాష్ట్రపారిశ్రామిక వేత్తలను సమావేశపరచి, రెండుమూడేండ్లలోపల మన రాష్ట్రములో స్థాపింపదలచిన పరిశ్రమలను గూర్చి చర్చించిరి. పారిశ్రామికాభివృద్ధికి పథకములు, విధానములు తయారైనవి; ఇక ఇప్పుడు కార్యాచరణ జరుగవలసియున్నది. ఈ సమావేశము అందు మొదటిమెట్టు. పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల శాఖ ఉద్యోగులు తరచు ఇట్లు సమావేశమగుచు, స్థాపింపదలచిన పరిశ్రమలనుగురించి, పారిశ్రామికవేత్తల సాధక బాధకములనుగూర్చి చర్చించుకొనుచుండుట పరిశ్రమాభివృద్ధికి మిక్కిలి తోడ్పడగలదు.

మొన్నటి సమావేశములో ఇనుము, ఉక్కు, 'లిగ్నైట్', అల్యూమినియం, మెగ్నీషియం, ఎరువులు, గాజు, రంగు, వార్నీషు, చేపలపరిశ్రమలనుగురించియే ఆలోచింపబడినది. దక్షిణాదిన సేలంలో ఇనుము, ఉక్కుపరిశ్రమను స్థాపించవలెనని కొందరు గట్టిగా పట్టుపడుచున్నారు. ఇచ్చట ఈ పరిశ్రమ సాధ్యము కాదని భారతప్రభుత్వము, మద్రాసు ప్రభుత్వము కూడ అభిప్రాయపడినవి. ఐనను, అవకాశములను పునరాలోచించవలెనని వారు కోరుటచే అందుకు నిశ్చయించిరి.

దక్షిణఆర్కాట్‌లో 'లిగ్నైట్'ను బొగ్గుగా మార్చుటకు గల అవకాశము చాల తక్కువయని ఈ మధ్య మనదేశమునకు వచ్చిన జెకోస్లవేకియా నిపుణులు చెప్పిరి. దీనినిగూర్చికూడ పూర్తి పరిశోధనలు జరిపించుటకు నిశ్చయించిరి.

అల్యూమినియం పరిశ్రమ ఇప్పుడు స్థాపించటం సాధ్యము కాదని, రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి సరఫరా పూర్తిగా అభివృద్ధిచెందిన తర్వాతనే దాని విషయము ఆలోచించవలెననీ నిర్ణయించిరి.

సేలంజిల్లాలో ఎక్కువగా లభించుచున్న మెగ్నీషియం లోహము ఇప్పుడు బ్రిటన్, అమెరికాలకు పూర్తిగా ఎగుమతిచేసివేస్తున్నారు. ఈ పరిశ్రమ మెళుకువలు తెలిసి, ముడిపదార్థమును సక్రమముగా ఉపయోగించగల నిపుణులు మన దేశములో లేరు. మెగ్నీషియం పరిశ్రమాభివృద్ధి బాధ్యత రాష్ట్రప్రభుత్వం వహించటంకన్న కేంద్రప్రభుత్వం వహిస్తే బాగుంటుందని అందరూ అభిప్రాయపడినారు.

రాసాయనిక ఎరువుల ఉత్పత్తి ప్రారంభించవలసిన అవుసరమునుగూర్చి ఎట్టి అభిప్రాయభేదమూ లేదు. తిరుచునాపల్లి, దక్షిణార్కాటు జిల్లాలలో ఇందుకు కావలసిన ముడిపదార్థము పుష్కలంగా దొరకును. అమ్మోనియా ఫాస్ఫేట్, ఎమ్మోనియా సల్ఫేట్, సూపర్ ఫాస్ఫేట్‌లను మన మిప్పుడు ఎక్కువగా దిగుమతిచేసుకొనుచున్నాము. ఈ మూడురకములు మనరాష్ట్రములోనే తయారుచేయవచ్చును.

అయితే, మూడురకముల ఎరువులకు వేర్వేరు ఫ్యాక్టరీలను ఏకకాలమున స్థాపించుటకన్న ఏది ఎక్కువ అవుసరమో అది ముందు స్థాపించుట మంచిది. ఎమ్మోనియా సల్ఫేట్, ఫాస్ఫేట్‌లకు రెండింటికి అవుసరమగు ఎమ్మోనియాను ముందు తయారుచేసినచో, అవుసరమును బట్టి దానిని ఫాస్ఫేట్‌గానో సల్ఫేట్‌గానో మార్చుకొనవచ్చును. ఈ ఎరువులలో నత్రజనివాయువు, ఫోస్ఫరస్ ఉపయోగింతురు. వీటినిగురించి పరిశోధనలు జరిపి, ఎరువులు తయారుచేయుచున్న విదేశ కంపెనీలనుండి ఎరువులు తయారుచేయుటకు ఇక్కడగల అవకాశములనుగురించి సలహా పుచ్చుకున్న బాగుండునని ఒకరు సూచించిరి. ముందుగా ఎమ్మోనియాను తయారుచేయు ఫ్యాక్టరీని స్థాపించుటకు, విదేశకంపెనీల సలహాలను తీసుకొనుటకు నిశ్చయించిరి.

గాజుపరిశ్రమకు అవుసరమగు ముడిపదార్థములు మనరాష్ట్రములో ఎంతవరకు లభ్యమగునో పరిశీలించుటకు ఒక నిపుణుడు ఇదివరకే నియమింపబడెను. పారిశ్రామికులకు తర్ఫీదునిచ్చుటకు కాళహస్తిలో ఒక శిక్షణకేంద్రము కూడ స్థాపించబడెను. ఈ కేంద్రములో శిక్షణపొందిన ప్రథమజట్టు పారిశ్రామికులు గతజనవరినెలలోనే తమ శిక్షణను పూర్తిచేసుకొనిరి. గాజుపరిశ్రమను మద్రాసు నగరములో స్థాపించవలసినదని, రాష్ట్రప్రభుత్వము నియమించిన పారిశ్రామిక సలహాసంఘము, ఈమధ్యనే సిఫార్సుచేసినది. ఫ్యాక్టరీని కట్టుటకు ఒక ప్లాను కూడ తయారుచేసికొనియుంటిననీ, ప్రభుత్వము నూటికి 51 వంతులు మూలధనము పెట్టుబడి పెట్టినచో ఫ్యాక్టరీ నిర్మాణమునకు పూనుకొందుననియు ఒక పారిశ్రామికవేత్త చెప్పెను. సీసాల ఉత్పత్తి ఫ్యాక్టరీని స్థాపించవలసిన అవుసరమును వేరొకరు స్పష్టపరచిరి.

రంగులు, వార్నీషులు తయారుచేయగల ఆధునిక ఫ్యాక్టరీని స్థాపించుటకు ప్రభుత్వము అభిప్రాయపడినట్లు 5 లక్షల రూపాయల పెట్టుబడి చాలదనీ, 20 లక్షల రూపాయిలైన వుండవలెననీ కొందరభిప్రాయపడిరి. ఈ పరిశ్రమ ప్రభుత్వము వశపరచుకొనునను భయములేదు కాబట్టి పారిశ్రామికవేత్తలు పూనుకొని పరిశ్రమ నభివృద్ధి చేయవలసియున్నది.

సముద్రములో, బాగాలో పలికి పోయి చేపలను పట్టుటకు కావలసిన ట్రాలర్లు, 'కోల్డ్‌స్టోరేజ్' సాధనములు విరివిగా లభించవలెను. ఏయే ప్రాంతములలో చేపలు ఎక్కువగా దొరకునో వివరములు సేకరించి, పల్లెకార్లకు తెలియజేయవలెను. ఈ విషయములలో శ్రద్ధ వహించి, సౌకర్యములు కలుగజేయవలెనని నిశ్చయింపబడినది.

మన రాష్ట్ర విద్యుచ్ఛక్తి సంపదను, అభివృద్ధిని చీఫ్ ఎలెక్ట్రికల్ ఇంజనీర్ వివరించిరి. పారిశ్రామికాభివృద్ధికి అవుసరమైనంతగా, పరిశ్రమలతోపాటు విద్యుచ్ఛక్తి ఉత్పత్తికూడ వృద్ధిచేయబడును. మాచ్‌ఖండ్ ప్రాజెక్టు పూర్తి అయితే ఒక లక్ష కిలోవాట్ల విద్యుచ్ఛక్తి లభించి, విశాఖపట్టణం, గోదావరి, కృష్ణాజిల్లాలకు సరిపడగలదు. నెల్లూరులో స్థాపింపనున్న థర్మల్ స్టేషన్ మొట్టమొదట 5 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేయును. మరొక పదిసంవత్సరములలో ఈ ఉత్పత్తి-శక్తి రెట్టింపుచేసెదరు. మద్రాసు పట్టణంలోని థర్మల్ స్టేషన్ 1951 వ సంవత్సరమునకు మరొక 15 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయగలుగును. తుంగభద్రాప్రాజెక్టు విద్యుచ్ఛక్తి-ఉత్పత్తికేంద్రము 1952 వ సంవత్సరము నాటికి తయారై 22 500 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయును. వర్షములు తగ్గినప్పుడు ఈ ఉత్పత్తి-శక్తి తగ్గిపోవును కాబట్టి ఆకాలములో మైసూర్‌లోని జోగ్ ఫాల్స్ కేంద్రమునుండి నాలుగువేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి బదులు తీసికొనెదరు. రాయపాదసాగర ప్రాజెక్టు పూర్తిఅయితే 2 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తిఅగును. పాయ్‌కారాలో ఇప్పుడు 40 వేల కిలోవాట్లు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అగుచున్నది; మరొక 12,500 కిలోవాట్లు ఉత్పత్తిచేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. మోయార్ స్కీము 1952 వ సంవత్సరము నాటికి పూర్తి అయి, 30 వేల కిలోవాట్లు విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయును. మెట్టూర్ ప్రాజెక్టు వర్షాకాలములో 40 వేల కిలోవాట్లు, ఇతరకాలములలో 20 వేల కిలోవాట్లు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయుచున్నది. పాపనాశనం స్టేషన్‌ను వృద్ధిపరచుచున్నారు. దీనికితోడుగా నుండుటకు మధురలో 4 వేల కిలోవాట్ల ఉత్పత్తిశక్తి గల థర్మల్‌స్టేషన్ స్థాపించెదరు. ఈ స్కీములకు మొత్తం 20 కోట్ల రూపాయలు ఖర్చగును. ఇవి అన్నీ పూర్తిఅయితే, మన రాష్ట్రములో పరిశ్రమలకు, వ్యవసాయమునకు, ఇండ్లకు విద్యుచ్ఛక్తి పుష్కలముగా లభించును.

పరిశ్రమలకు ప్రభుత్వ మెట్టి సహాయము, ముఖ్యముగా ధనసహాయము చేయునని అనేకులు ప్రశ్నించిరిగాని సంతృప్తికరమగు సమాధానము రాలేదు. విద్యుచ్ఛక్తి, నీరు, స్థలము లభింపజేయుట ఏమంత చెప్పుకొనదగిన సహాయము కాదు. ప్రభుత్వము కొంత మొత్తము పెట్టుబడి పెట్టునని ఆశ యున్నచో అనేకులు పరిశ్రమలు స్థాపింతురు. ఈ విషయమై ప్రభుత్వము తన వైఖరిని నిర్ణయించుకుని, పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడవలెను.

నేటి ప్రపంచం

(5 వ పేజీ తరువాయి)

జేసినవి. రష్యా ఈ విధానాన్ని అనుసరించి అతి ప్రమాదభరితమైన అంతర్జాతీయ పరిస్థితిని తెచ్చిపెట్టిందని కూడా హెచ్చరిక చేసినవి. రష్యా ఈ ఆక్షేపణ పత్రాలకు ఇంకా సమాధానం ఇవ్వలేదుకాని, దాని సమాధానం ఏధోరణిలో వుండేదీ సులభంగానే ఊహించవచ్చు. ప్రస్తుతం ఏదైనా ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడినమాట నిజమే అయితే, దానికి బాధ్యత అంతా బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు పశ్చిమజర్మనీవిషయంలో వేస్తున్న ఎత్తులే కారణమని రష్యా స్పష్టపరిచి తీరుతుంది. జర్మనీ విషయంలో యాల్టా ఒడంబడిక షరతులను మూడు పశ్చిమరాజ్యాలు ప్రత్యక్షంగా భంగపరచినవనికూడా మరొకసారి ఆరోపిస్తుంది. ఇంతకుమించి ఈ సమస్య ఏవిధంగానూ పరిష్కారం కాబోదు. పశ్చిమ అగ్రరాజ్యాలు చివరకు బర్లిన్ సమస్యపై ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేయడం జరుగుతుందేమో.

ఈపరిస్థితులలో, పొరపాటున ఏ ఒక్క నిప్పురవ్వ పడ్డా బర్లిన్‌లో అగ్రరాజ్యాలమధ్య పరిస్థితి ఒక్కసారిగా భగ్గుమంటుందని బ్రిటిష్ ఎటార్నీ జనరల్ సర్ షా క్రాస్ హెచ్చరిక చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఏనాటికైనా అగ్రరాజ్యాలమధ్య యుద్ధం సంభవించేది బర్లిన్ నగరంలోనే. పశ్చిమ అగ్రరాజ్యాలు తమకు కావలసింది ప్రపంచశాంతి, లోకకళ్యాణము అని ఎంతగా పైకి చెప్పుకుంటున్నప్పటికీ, సంఘర్షణకైనా తలపడతవిగాని, బర్లిన్‌నుమాత్రం ఖాళీచేయవు. వారు అక్కడ నిలచివున్నంతకాలం, రష్యా మొండివైఖరి మారనంతకాలం తృతీయప్రపంచ సంగ్రామానికి కలహాబీజం బర్లిన్ నగరమే.

కాస్మిక్ కిరణాలు జీవితాలనే మార్చవచ్చు!

శ్రీ వసంతరావు వెంకటరావు

పరమాణువులో అపారమైన శక్తి నిబిడీకృతమై యుందని, పరమాణువును భిన్నం చేయడానికి సంకులమైన యంత్రనిర్మాణంలో విజ్ఞానులు నిమగ్నులై యున్నారనీ హిరోషిమా ధ్వంసమైన ఆ దుర్దినంనుండి జనసామాన్యానికి తెలియును. కాని, విజ్ఞానులుత్పన్నం చెయ్యగలిగిన శక్తికి శతసహస్రాంతమైన శక్తితో పరమాణువులను అనవరతంగా ప్రకృతి భిన్నంచేస్తూందన్న విషయం కొలదిమందికి మాత్రమే తెలియును. కాస్మిక్ కిరణాలు జనింపజేస్తున్న కణాలు ఈ విచ్ఛిత్తికి కారణం దుర్జ్ఞేయమైన ఈ కిరణాలగూర్చి చాలకాలంనుండి తెలిసినప్పటికి, ఇప్పుడిప్పుడే విజ్ఞానులకు వాటి రహస్యాలు కనుగొనే అవకాశం కలుగుతూంది. ఆ అవకాశాన్నిస్తూన్నది సాధారణమైన ఫోటోగ్రాఫిక్ ప్లేటు. కాస్మిక్ కిరణజ్ఞానంయొక్క జన్మచరిత్ర అపరాధపరిశోధక కథకన్న అత్యంత ఆసక్తిదాయకమంటే అతిశయం గాదు. ఆ కథాసందర్భాన్ని అవగాహన చేసికోడానికి పరమాణువు (Atom) గూర్చి కొన్ని విషయాలు తెలిసికోవాలి.

ద్రవ్యమంతా పరమాణువులతో నిర్మింపబడింది. ఎట్టి బలవత్తరమైన సూక్ష్మదర్శిని (Microscope) లోనైనా పరమాణువు కనిపించదు; పరమాణువంత మహాసూక్ష్మమైన ద్రవ్యఖండం. 25 కోట్ల పరమాణువులను ఒక దాని ప్రక్క నొకటి వరుసగా పేర్చినపక్షమందు అవి ఒక అంగుళం పొడవు నాక్రమిస్తాయి. దానిబట్టి పరమాణు వెంత చిన్నదో కొంతవరకు ఊహించవచ్చును. అట్టి పరమాణువు మహా దృఢ నిర్మాణం కలిగియుంది. అదొక సూక్ష్మ సౌరమండలం. పరమాణుమధ్యను సూర్యునివలె ఒక కేంద్రకం (Nucleus) ఉంటుంది. కేంద్రకం చుట్టు ఎలక్ట్రానులు, గ్రహాలవలె, నిత్య ప్రదక్షిణాలు చేస్తుంటాయి. కేంద్రకం ధన విద్యుతావేశం కలిగి ఉంటెగా, ఎలక్ట్రానులు ఋణావేశం కలవాటచేత కేంద్రకం ఎలక్ట్రానులు అపరిమిత విద్యుత్ బలాకృష్టమై యుంటాయి. గురుత్వాకర్షణ బలంచేత సూర్యమండలంలో సూర్యగ్రహాలు బంధింపబడ్డాయి; విద్యుత్ బలాలచే పరమాణువులో కేంద్రకం ఎలక్ట్రానులు బంధింపబడ్డాయి.

ధనావేశం కల ప్రోటానులు, విద్యుదావేశమే లేని న్యూట్రానులు కలిసి కేంద్రకంలో నున్నాయి అట్టి కేంద్రకాన్ని భిన్నంచేసిన ప్పుడే విపరీతశక్తి బహిర్గమౌతుంది. ఏమనగా ఎలక్ట్రానులను కక్ష్యలలో త్రిప్పుచున్న విద్యుత్ బలంకన్న కోటిరెట్లు మిన్నయైన బలంతో కేంద్రకం బంధింపబడింది. అందుచేతనే, పరమాణువులో గల ఎలక్ట్రానులను సులభంగా విడదీయ గలిగినప్పటికీ, కేంద్రకంలో గల ప్రోటాను న్యూట్రానులను వేరుచేయడానికి అత్యంతశక్తి కావలసియుంది. కేంద్రక రహస్యాన్వేషణానికై పరిశోధనాగారాలలో సైక్లోట్రాను, వాన్‌డీగ్రాఫ్ జెనరేటరువంటి సంకుల యంత్రనిర్మాణ మవసరమైంది. కాని, ఇంతవరకు మానవుడు ఉత్పన్నంచేయలేనట్టి విశేష శక్తిమంతమైన కణాలను ప్రకృతి కాస్మిక్ కిరణాలచే కలిగిస్తూంది.

సుమారు రేబదియేండ్లక్రితం ప్రమాదవశాత్తు రేడియోధార్మిక (Radio-active) పదార్థాలను బెకరెల్ గుర్తించెను. కొన్ని ప్రయోగాలకై యురేనియం అను మూలతత్వంయొక్క లవణాన్ని హెన్రీ బెకరల్ అను ఫ్రెంచి విజ్ఞాని తన బల్లసొరుగులో భద్రపరిచేడు. ఆ సొరుగులో కొన్ని ఫోటోగ్రాఫిక్ ప్లేట్లున్నాయి. అవి బంగిలో నుండగానే నల్లపడ్డాయని తెలిసింది. యురేనియం లవణంనుండి ప్రసరింపబడుతూన్న శక్తిచే ఆప్లేట్లు నల్లబడ్డాయని యూహించి, ఊహను స్థిరపరచడంతో రేడియోధార్మికత్వం కనుగొనబడింది.

విద్యుదావేశాన్ని చూపించే చిన్న యుపకరణమొకటి కలదు. దానికి విద్యుద్దర్శిని (electroscope) అంటారు. అందులో రెండు బంగారురేకులుంటాయి. అవి ఆవేశపూరితమైనప్పుడా రేకులు వికర్షించుకొంటాయి విద్యుదావేశం తగ్గినప్పుడా రేకులు దగ్గరగావిపోయి. విద్యుద్దర్శినితో ప్రయోగాలు చేసున్న విజ్ఞానులిద్దరు దాని విద్యుదావేశం క్షీణిస్తున్నట్లు గమనించేరు. అక్షీణత్వానికి కట్టి కారణం కనిపించలేదు. దానికద్ద రేడియోధార్మిక పదార్థలవలేశమేమైనా ఉన్నదేమోనని జాగ్రతగా ఆ విద్యుద్దర్శిని శక్తినిరోధక పదార్థాలతో కాపాడేరు. అయినప్పటికీ క్షీణత్వం తగ్గలేదు. దానినిబట్టి అతిశక్తివంతమైన అదృశ్య ప్రసారమేదో ఆ ఉపకరణాన్ని మర్దిస్తూన్నదని అనుమానించేరు.

అయితే ఆప్రసారమెక్కడనుండి వస్తూన్నది? భూమిలోనుండి కాదని ప్రాయోగికంగా నిర్ణయించేరు. అది ఆకాశజనితమేమో అని బెలూనలలో విద్యుద్దర్శినిని పైకి పంపేరు. పైకి పోతూన్నకొద్దీ ప్రసార తీక్ష్ణత ఎక్కువకాసాగింది. కాబట్టి, ఆప్రసారం ఆకాశంలోనుండి వస్తూన్నట్టు స్పష్టమైంది. సూర్యునినుండి వస్తున్నదా, లేక ఏ నక్షత్రంనుండైనా వస్తున్నదా అని తెలిసికోడానికి అనేక ప్రయోగాలు చేసి, అన్ని దిశలనుండి ఒకే విధంగా వస్తూన్నట్లు సుమారు ఇరవై సంవత్సరాలక్రితం నిర్ణయించేరు. ఈ ప్రసారం విశ్వంనుండి వస్తూండుటచే దానికి 'విశ్వకిరణాలు' లేక 'కాస్మిక్ కిరణాలు' అని నామకరణంచేసేరు.

కాస్మిక్ కిరణోత్పత్తిగూర్చి ఇదమిత్థమని ఇప్పటికికూడ నిర్ణయం కాలేదు. ఈ విషయమై ప్రసంగిస్తూ బ్రిటిష్ విజ్ఞాని పి. ఎమ్. ఎస్. బ్లాకెట్ (P M S Blacket) ఏమన్నాడంటే, ఇది ఏదో విధంగా కాలాకాశస్వభావ ఫలితం గావచ్చు, లేక మన మెరుగని, నక్షత్రాలనుండి వస్తూన్న ప్రసారం గావచ్చునని. శక్తినుండి ద్రవ్యం జనిస్తున్న సందర్భంలో విడివడినవరి ప్రసారం గావచ్చునని, లేక ద్రవ్యం శక్తిగాపరివర్తన మౌచున్నప్పుడు బహిర్గమించు ప్రసారం గావచ్చునని మరికొందరి అభిప్రాయం.

కాస్మిక్ కిరణాలెట్లుద్భవించినప్పటికి, అవి బాహ్యాకాశాంనుండి నిరంతరంగా భూమిపైకి వర్షిస్తున్నాయని, వాటిలో నత్యంత శక్తివంతములైన ఆవేశపూరితకణాలున్నాయని మాత్రం నిశ్చయం. ప్రధానంగా వాటిలో రెండు విధాలు గలవు అవి 'మెత్తని', 'గట్టి'. మెత్తనికిరణాలు భూతలంచేతి, భూమిపైనున్న ఘనపదార్థం చేత గ్రహింపబడతాయి. భూమిలో 800 అడుగులలోతునున్న గనులలోనికికూడ గట్టికిరణాలు జొరబడతాయి; ఇట్టి విపరీత భేదక (penetrating) సామర్థ్యానికి కారణం వాతావరణంలో కాస్మిక్ కిరణా లుత్పత్తి చేయు మెసాను (meson) లను కణాలు. ప్రోటాన్ల వంటి బృహత్ శక్తి గల కణాలు వాతావరణంలోగల కేంద్రకాలను ఢీకొన్నప్పుడు మెసాన్లు విడివడుతున్నాయి.

ఎలక్ట్రాను, ప్రోటాను, న్యూట్రాను మొదలగు ప్రాథమిక కణాలకన్న మెసాన్ల స్వభావ పరిశోధన, కేంద్రక శక్తులతో వాటికున్న సంబంధమును నేడు విజ్ఞానుల నాకర్షించిన ప్రధాన విషయాలు. కేంద్రక పరివర్తనంలో అక్కరపడు వచ్చు శక్తి మిలియను—ఎలక్ట్రాను—వోల్టుల పరిమాణం గలదైయుంది. యురేనియం కేంద్రక విచ్ఛిత్తిలో అవసరమైన శక్తి 200 మిలియన్-ఎలక్ట్రాన్-వోల్టులు (మి. ఎ. వో.) లవుగా, కొన్నిటిన్ని మెసాన్లశక్తి పదిలక్షల మి. ఎ. వో. వరకు పోగలదు.

ప్రత్యేక ఎమల్షన్ పూయబడిన ఫోటోగ్రాఫిక్ ప్లేటులవల్ల పెర్కిన్స్, పవెల్, ఓచియాలిని అను విజ్ఞానులు మెసానయొక్క చరిత్రాన్ని కనిపెట్టేరు. ఎమల్షన్‌లో నున్న పరమాణువుయొక్క కేంద్రములోనికొక మెసాను జొరబడినప్పుడు ఆ కేంద్రకం ముక్కలవుతుంది. అధిక సామర్థ్యంగల సూక్ష్మదర్శిని (microscope) తో ఆ ఎమల్షన్‌ను పరిశీలిస్తే విచ్ఛిన్నమై విక్షిప్తమైన కేంద్రకఖండాలు నల్లని గీతలవలెనో, లేక, అదృశ్యసూత్రంతో బంధింపబడిన నల్లని ముత్యాలవలెనో కనిపిస్తాయి. పరెల్ ప్రభృతులకు కొద్దిరోజుల పూర్వమే కావెండిష్ పరిశోధనాగారంలో పనిచేస్తున్న బ్లాకెట్ కాస్మిక్ కిరణాలచేతనే వాటి ఫోటోగ్రాఫులు తీయించి, ధనావేశంగల ఎలక్ట్రానుల—వాటినే పాసిట్రాను (positron) లంటారు — ఉనికిని కనిపెట్టేరు. సూక్ష్మమైన యంత్రాలతో ఈ మెసానుల లక్షణాలు కనిపెట్టడానికి అనేకమంది విజ్ఞానులు భూగర్భంలోను, మైళ్లకొలది ఎత్తున ఆకాశంలోను పరిశోధనలు చేస్తున్నారు. ఒక్కొక్క మెసాను ఆగమనాన్ని సూచించే యంత్రాలున్నాయి!

వీటి ప్రయోజన మేమి? నేటివరకేమియు లేదని చెప్పాలి. కాని, జీవులను ముట్టించిన కాస్మిక్ కిరణాలు జీవులలో ఆశ్చర్యకరమైన మార్పులు కలిగించవచ్చునన్న సందేహం బలమౌతూంది. ఎలుకలలో వ్రణాలను కలిగించి మాన్పుట విషయమై స్విస్ పరిశోధనాగారాలలో తీవ్రమైన ప్రయోగాలు, పరిశోధనలు జరుగుతున్నాయి. వాటి ఫలితాలాన్ని నిరీక్షించాలి!

యుగసంధి

(6-వ పేజీ తరువాయి)

చూస్తున్నాడు. అతని కోటుకి కుట్టిన పెద్ద బొత్తాములు కాలి వేళ్లతో పట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఫెనీచ్కా పరుగెత్తుకుని వెళ్లి అతనిమీద పడిపోయింది. తన కొడుకునీ అతన్నీ కౌగలించుకుని తన ముఖాన్ని అతని భుజంమీద వాల్చింది. నికోలై ఆశ్చర్యపడ్డాడు. ఫెనీచ్కా, ఎన్నడూ గట్టిగా మాట్లాడని ఫెనీచ్కా, ఇంకో మనిషి ఎదట ఎన్నడూ అతన్ని కౌగలించుకుని ఎరగదు.

"ఏం జరిగింది?" తన అన్నగారివేపు చూస్తూ అతను అని, మిట్యాని ఆమె చేతి కిచ్చాడు "నీ కేమన్నా బాగా ఉందా?" అని పావెల్ పెట్రోవిచ్ దగ్గరగా వెళ్లి అడిగాడు.

అతను ఒక పట్టుని రుమాలుమాటున ముఖాన్ని దాచుకుని అన్నాడు, "లేదు...ఏమీ లేదు.... నా కసలు ఇప్పుడు చాలా తేలికగా ఉంది."

"నువ్వు అనవసరంగా తొందరపడి సోఫామీదకి మారావు. ఎక్కడికి వెళ్లిపోతున్నావు?" ఫెనీచ్కా వేపు తిరిగి నికోలై పెట్రోవిచ్ ఆఖరు ముక్క అన్నాడు. కాని ఆమె అప్పటికప్పుడే గదిలోకి పోయి తలుపు మూసుకుంది. "వట్ర వాడిని నీకు చూపిద్దామని నేను తీసుకు వస్తున్నాను. వాడు పెదనాన్నకోసమని ఏడుస్తున్నాడు. ఎందుకు తీసుకుపోయింది? నీ పరిస్థితి ఎల్లా ఉంది? మీ రిద్దరూ ఏమన్నా అనుకున్నారా?"

"తమ్ముడూ!" పావెల్ పెట్రోవిచ్ గంభీరంగా అన్నాడు

నికోలై పెట్రోవిచ్ కంగారుపడ్డాడు. అతనికి భయంవేసింది ఎందుకో మాత్రం అతని తెలియదు.

"తమ్ముడూ," పావెల్ పెట్రోవిచ్ మళ్లీ అన్నాడు, "నాది ఒక్కటే కోరిక ఉంది. ఆ కోరిక తీరుస్తానని నాకు మాట ఇయ్యి."

"ఏం కోరిక? చెప్పు."

"చాలా ముఖ్యమయినది. నా ఉద్దేశం నీ భావిసుఖమంతా దానిమీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు నీకు చెప్పదలచుకున్న విషయాన్ని గురించి నేను ఈ మధ్య ఎంతో ఆలోచించాను .....తమ్ముడూ! నీ బాధ్యత నువ్వు నెరవేర్చాలి. నీ న్యాయబుద్ధి, నీ ఔదార్యం నువ్వు రుజువుపరచుకోవాలి ఈ అపవాదు ఇంతటితో పోవాలి. నిన్ను చూసి ఇతరులు చెడిపోకూడదు...... నీకంటే మంచి వాళ్ళు ఈ లోకంలో లేరు!"

"నీ అభిప్రాయం ఏమిటి, పావెల్?"

"ఫెనీచ్కాని పెళ్లిచేసుకో.... ఆమె నిన్ను ప్రేమిస్తోంది నీకల్ల కొడుకుని కనింది."

నికోలై పెట్రోవిచ్ ఒకఅడుగు వెనక్కి వేశాడు. చేతులు ముందుకి విసిరాడు. "నువ్వేనా ఇది అంటుంటా? పావెల్! ఇల్లాంటి వివాహాలను గట్టిగా నిత్యమూ ప్రతిఘటించేవాడవని నా నమ్మకం. నువ్వేనా, అంటుంటా? నువ్వు నా ధర్మమని ఏదయితే అంటున్నావో ఆ ధర్మాన్ని ఇన్నాళ్లూ నెరవేర్చకపోవడానికి నీమీద గౌరవమే కారణమని నీకు తెలుసునా?"

"అలాఅయితే నీ గౌరవానికి నేను అనర్హుణ్ణి," పావెల్ పెట్రోవిచ్ నీరసపు చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "బజరోవ్ నాకు దురభిమానం ఎక్కువని అంటుండేవాడు. అది నిజమనిపిస్తుంది. తమ్ముడూ! ఇంక మనం పైపైమర్యాదలకోసం, లోకం ఏమనుకుంటుందోననీ, మనకర్తవ్యాన్ని మరిచిపోకూడదు. మనలో ఉన్న అన్నరకాల గర్వాన్ని ఇంక పక్కనిపెట్టవలసిన రోజు వచ్చింది. నువ్వన్నట్టు, మన ధర్మాన్ని మనం నిర్వహిద్దాం. తర్వాత మనకి సుఖంకూడా చేకూరుతుంది తెలుసా!"

నికోలై పెట్రోవిచ్ ఒక పరుగులో తన అన్నగారిని కౌగలించుకోడానికి వెళ్లాడు

"నా కళ్లు పూర్తిగా తెరుచుకున్నాయి," అన్నాడు "ఈ లోకంలో నీ అంత తెలివయిన వాడూ, నీ అంత దయగలవాడూ ఇంకొకడు లేడని నేను మొదటినించీ అంటున్నమాట అక్షరాలా నిజం. నువ్వు ఎంత ఉదారుడవో అంత న్యాయబుద్ధికూడా నీకు ఉందని ఇప్పుడు రుజువయింది."

"మెల్లగా, నెమ్మదిగా," పావెల్ పెట్రోవిచ్ అతన్ని వారించాడు; "ఈ న్యాయబుద్ధిగల అన్నయ్యకాలు నలిపి వేయకు. ఏభయి ఏళ్లవయస్సులో ఈ అన్నయ్య ద్వంద్వయుద్ధాలలోకి దిగడు. సరే, అది నిశ్చయమయిపోయినట్టే. ఫెనీచ్కా ఇంక నా......మరదలు"

"పావెల్, ఆర్కాడీ ఏమంటాడో!"

"ఆర్కాడీయా? అతను ఎగిరి గంతు వేస్తాడు. నీ కేమీ అనుమానం అక్కరలేదు. పెళ్లి అనేది అతని సిద్ధాంతాలకు సరిపడని దుకో. కాని అతనిలోని సామ్యవాదతత్వం తృప్తిచెందుతుంది. తరవాత, ఈ కులభేదాలలో నిజంగా ఏమి అర్థం ఉంది?"

"ఏది పావెల్, ఇంకోసారి దగ్గరగా రానీ! భయపడకు. కాలికి నొప్పి తగలదులే."

ఆ సోదరులు మళ్లీ కౌగలించుకున్నారు.

"నీ అభిప్రాయం ఏమిటి? నీ నిశ్చయాన్ని ఆమెకు ఇప్పుడు చెప్పనక్కరలేదా?" పావెల్ పెట్రోవిచ్ అడిగాడు.

"ఏం తొందర వచ్చింది?" నికోలై పెట్రోవిచ్ అన్నాడు. "మీ రిద్దరూ ఏమన్నా మాట్లాడారా?"

"మే మిద్దరమూ మాట్లాడినదా? ఏదో మామూలుగా."

"అయితే సరే బాగానే ఉంది. ఇంకా కావలసినంత వ్యవధి ఉంది. నీకు బాగా నయమవాలి గదా. అన్ని విషయాలూ జాగ్రత్తగా ఆలోచించాలి........"


"నీమనస్సులో నిశ్చయమయిపోయింది గదా?"

"ఆ. నిశ్చయం చేసుకున్నాను. నా హృదయపూర్వకమయిన ధన్యవాదాలు నీకు. నువ్వింక విశ్రమించాలి. నేను వెళ్లిపోతాను. నీకు ఇప్పుడు ఉద్రేకం కూడదు......కాని తరవాత సావకాశంగా మాట్లాడదాం. కులాసాగా నిద్రపో. భగవంతుడు నిన్ను దయతో చూస్తాడు."


"ఎందుకల్లా నాకు ధన్యవాదాలు చెపుతాడు?" అనుకున్నాడు పావెల్ పెట్రోవిచ్, నికోలై పెట్రోవిచ్ వెళ్లిపోయిన తరవాత. "అందులో తన మంచితనం ఏమీ లేనట్టు! అతనికి పెళ్లికాగానే నేను వెళ్లిపోతాను. ఎక్కడికో దూరంగా డ్రెస్డెన్......ఫ్లారెన్స్....అక్కడే ఉండి పోతాను. చివరివరకూ—..."

పావెల్ పెట్రోవిచ్ యుడికొలోన్‌తో నుదురు తడుపుకుని కళ్లు మూసుకున్నాడు. చిక్కిపోయిన, అతి సుందరమయిన అతని తల ఆ తెల్లగుడ్డమీద తెల్లగా కదలిక లేకుండా విశ్రమిస్తోంది—పగటివెలుగు ఆ తలమీద పడి, మృతకళేబరంలాగ కనిపిస్తోంది........అతడు నిజంగాకూడా మృతుడే.

పుదుక్కోట్టై సంస్థానంలో మద్యపాన నిషేధము




జూలై 1 నుంచి పుదుక్కోట సంస్థానంలో మద్యపాన నిషేధచట్టము అమలులోకి వచ్చింది. ఆనాడు జనం ఉత్సవం సలుపుకొంటున్నారు.




నిషేధచట్టం అమలు పెట్టి ఉత్సవాన్ని ప్రారంభిస్తూ మంత్రి భక్తవత్సలం గారు ప్రారంభోపన్యాసం చేస్తున్నారు.


పుదుక్కోటలో కొత్తకాలువ-నరసింగకావేరీకాలువ



నరసింగ కావేరికాలువకు జూన్ 30 న మంత్రి భక్తవత్సలంగారు ప్రారంభోత్సవం జరిపారు.



నరసింగ కావేరి కాలువను మంత్రిగారు 'నాగుడి' వద్ద పర్యవేక్షిస్తున్నారు.



నరసింగ కావేరీ కాలువ దృశ్యము

Regd. No M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras